అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

గురువారం 15-6-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 165 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు | వెల : 6.50



ఇండ్లకోసం పోరాటాలు ఉధృతం

- మహబూబాబాద్‌లో ప్రభుత్వ దమనకాండను ఖండిస్తున్నాం : వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు జీ నాగయ్య

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో ఇండ్లు, ఇండ్ల స్థలా లు లేని నిరుపేదలందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలనీ, నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన పేదలందరికీ తక్షణమే ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జీ నాగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఇండ్లు, ఇండ్ల స్థలాల సాధనకోసం తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక అధ్వర్యంలో జూన్ 18 నుంచి 27వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరిగే బస్సుయాత్ర కర పత్రాల ను హైదరాబాద్‌లోని ఎమ్‌బీ భవన్ ఆవిష్కరించారు. మహబూబాబాద్ లో పేదల గుడిసెలు కూల్చివేసి, 8 గంట లకుపైగా ప్రభుత్వ శాఖల అధికారులు దమనకాండ జరపడాన్ని తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగం ప్రకారం జీవించే హక్కు అందరికీ ఉందనీ, దానిలో సొంత ఇల్లు కూడా భాగ మేనని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వడం లో తీవ్రంగా వైఫల్యం చెందాయన్నారు. రాష్ట్రంలో 26 జిల్లాల్లో 61 కేంద్రాల్లో 48 వేల మంది పేదలు ఇండ్లు వేసుకొని నివా సముంటున్నారనీ, వారందరినీ అర్హులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. బస్సు యాత్రను జయ ప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీజీ నర్సింహ్మా రావు (పట్నం రాష్ట్ర కన్వీనర్), ఆర్.వెంకట్రాములు (వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి),టి.స్కైలాబ్ బాబు (కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి), ఆర్.అరుణజ్యోతి (ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు), ఆర్.శ్రీరాం నాయక్ (గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి), కోట రమేష్, ఆనగంటి వెంకటేష్(డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు), జి.నరేష్ (వృత్తి సంఘాల రాష్ట్ర నాయకులు) పాల్గొన్నారు.

బిజినెస్



స్టార్టప్‌ల నిధుల్లో 71 శాతం పతనం

న్యూఢిల్లీ:భారత్‌లోని స్టార్టప్ సంస్థలు గడ్డుకాలాన్ని ఎదుర్కొంటున్నాయి. నిధుల సమీకరణలో సవాళ్ల ను చవిచూస్తున్నాయి. ప్రస్తుత ఏడాదిలో (జనవరి నుంచి మే) కాలంలో స్టార్టప్ సంస్థలకు సంబంధించి 5 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.41వేల కోట్లు)విలువ చేసే 461 ఒప్పందాలు జరిగాయని మార్కెట్ ఇంటిలిజెన్సీ వేదిక ట్రాక్సన్ వెల్లడించింది. ఇంతక్రితం ఏడాది ఇదే సమయంలోని 17.1 బిలియన్ డాలర్ల (రూ.1.40 లక్షల కోట్లు) ఫండింగ్స్‌తో పోల్చితే 71 శాతం పతనం చోటు చేసుకుంది. ప్రస్తుత ఏడాదిలో ఇప్పటి వరకు టెక్నలాజీ ఉత్పత్తుల స్టార్టప్‌లు 1.6 బిలియన్ డాలర్ల (రూ.13వేల కోట్లు) నిధులను సమీకరించగలిగాయి. తర్వాత స్థానంలో ఫిన్‌టెక్ రంగం 1.4 బిలియన్ డాలర్ల (రూ.11.4 వేల కోట్లు) నిధులను పొందాయి. ముఖ్యంగా ఫోన్‌పే 850 మిలియన్ డాలర్ల సేకరణతో ఫిన్‌టెక్ రంగం అధిక నిధులను నమోదు చేసింది. అంతర్జాతీయంగా చోటు చేసుకుంటున్న ఆర్థిక మందగమనం.. టెక్ కంపెనీలు పొదుపు చర్యలకు దిగడం తదితర అంశాలు స్టార్టప్‌ల నిధుల సమీకరణలో ప్రతికూలతలను పెంచుతున్నాయి. గడిచిన ఏడాది 2022లో స్టార్టప్‌లకు ఫండ్స్ 33 శాతం తగ్గి 24 బిలియన్ డాలర్ల (రూ.1.95 లక్షల కోట్లు)కు పరిమితమయ్యాయని పిడబ్ల్యుసి ఇండియా ఇటీవల ఓ రిపోర్టులో తెలిపింది. 2021లో ఈ సంస్థలు 35.2 బిలియన్ డాలర్ల (రూ.2.85 లక్షల కోట్లు)ను సమీకరించగలిగాయి. ఈ రంగంలో ఫండింగ్ తగ్గిపోవడంతో పాటు భారీగా ఉద్యోగాలు ఊడుతోన్న విషయం తెలిసిందే. స్టార్టప్‌లకు నిధుల మద్దతులో కేంద్ర ప్రభుత్వం సరైన విధానాన్ని అనుసరించకపోవడం, బడా కార్పొరేట్లకు కొమ్ము కాయడం వల్లే అవి ఒత్తిడిలోకి జారుకుంటున్నాయని.. కొత్తవి రాలేకపోతున్నాయనే విమర్శలు ఉన్నాయి.


15 ప్రీమియం ఎక్స్‌పీరియన్స్ స్టోర్లు తెరుస్తాం

- సామ్‌సంగ్ వెల్లడి



హైదరాబాద్: ప్రస్తుత ఏడాదిలో దేశ వ్యాప్తంగా 15 ప్రీమియం ఎక్స్‌పీరియన్స్ స్టోర్లను తెరువాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆ కంపెనీ ఎక్స్‌క్లూజివ్ బ్రాండ్ షాప్స్ హెడ్ రాహుల్ సింగ్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని ఇనార్బిట్ మాల్‌లో నూతన స్టోర్‌ను ఆయన లాంచనంగా ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఇది దేశంలో తమకు నాలుగో ప్రీమియం ఎక్స్‌పీరియన్స్ స్టోర్ అని తెలిపారు. మరో 11 అవుట్‌లెట్‌లను అందుబాటులోకి తేనున్నా మన్నారు. వీటిని 8-10 నగరాల్లో ఏర్పాటు చేయనున్నామన్నారు. తమ రిటైల్ మార్కెట్‌లో తెలుగు రాష్ట్రాలు కీలక వాటాను కలిగి ఉన్నాయన్నారు. తెలంగాణలో 56, ఎపిలో 58 స్టోర్లు ఉన్నాయన్నారు. తెలంగాణలోని ప్రీమియం స్మార్ట్‌ఫోన్ల వ్యాపారంలో 60 శాతం వాటాను లక్ష్యంగా చేసుకున్నామన్నారు. నూతన స్టోర్‌లో తొలి వారంలో పలు ప్రత్యేక డిస్కౌంట్‌లను అందిస్తున్నామన్నారు.

కంటి సమస్యలకు 'లీ హెల్త్' ఔషధం



హైదరాబాద్: మనుషుల్లో వయసు పెరిగే కొద్దీ కంటి చూపు మందగిస్తుంది. ఈ సమస్యకు పరిష్కారంగా హైదరాబాద్‌కు చెందిన ఫార్మా కంపెనీ లీ హెల్త్ డొమెయిన్ 'డీ-మాక్యులా' పేరు తో సహజ సిద్ధంగా బయో యాక్టివ్ ఫైటోన్యూట్రి యెంట్ డైటరి సప్లిమెంట్‌ను తయారు చేసింది. ఇది సాఫ్ట్‌జెల్ క్యాప్సూల్ రూపంలో ఉంటుందని, కంటికి వచ్చే అంటువ్యాధులను సైతం నయం చేస్తుందని ఆ కంపెనీ తెలిపింది. అశ్వగంధ, బోస్విల్లా శరాషియో, జీగ్జాంథిన్, త్రిఫల, బిటా కెరోటిన్, కుంకుమ పువ్వును దేశీయ ఆవు నెయ్యిలో మరిగించి సేకరించిన రసాయనం ఆధారంగా డీ-మాక్యులా తయారు చేశామని లీ హెల్త్ డొమెయిన్ డైరెక్టర్ ఆళ్ల లీలా రాణి తెలిపారు. కంటి మంట, చికాకు, పొడిబారడం, హానికర నీలి కాంతికి వ్యతిరేకంగా పోరాడడానికి, డయాబెటిక్ రెటినోపతి చికిత్సలో సహాయకారిగా ఉపశమనం పొందడానికి సాయపడుతుందన్నారు. ఇది ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో లభ్యమవుతుందన్నారు.

నీట్ ఫలితాల్లో నారాయణ విజయ పరంపర!



హైదరాబాద్ : వైద్య విద్యా ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్-2023లో తమ విద్యార్థులు విజయ పరంపరను కొనసాగించారని నారాయణ గ్రూప్ డైరెక్టర్స్ పి సింధూర నారాయణ, పి శరణి నారాయణ తెలిపారు. ఆలిండియా 10 లోపు 4 ర్యాంక్‌లు, 100 లోపు 35 ర్యాంకులు సాధించినట్లు వెల్లడించారు. శశాంక్ సిన్హా ఆలిండియా 4వ ర్యాంక్‌తో సంచలనం సృష్టించారన్నారు. తమ విద్యార్థులు 500 లోపు 112, 1000 లోపు 169 ర్యాంక్‌లు పొంది సరికొత్త రికార్డ్‌ను నెలకొల్పారన్నారు. విశిష్టమైన ప్రణాళికతో రూపొందించిన స్టార్ సిఒ బ్యాచ్, ఎన్ 40 ప్రోగ్రామ్ ద్వారా నిరంతరం టాప్ ర్యాంక్‌లు సాధిస్తున్నామన్నారు. సిబిఎస్ఇ సిలబస్ ఆధారంగా నిర్వహిస్తున్న నీట్ పరీక్ష కోసం అత్యంత వినూత్న విద్యా ప్రణాళిక వలనే ఈ టాప్ ర్యాంకులు సాధించగలిగామన్నారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి వారు అభినందనలు తెలిపారు.

ఆకాశం వైపు ఎదురుచూపు

(మొదటిపేజీ తరువాయి)

ఉల్లిగడ్డ వంటి పంటలూ సాగవుతాయి.

జూన్ 15 దాటినా వర్షాల్లేవు

జూన్, జులైలో కురిసే వర్షాల ఆధారంగానే ఖరీఫ్ సీజన్ పంటల సాగు ఆధారపడి ఉంటుంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో అత్యధికంగా 7.48 లక్షల ఎకరాల్లో సాగయ్యే పత్తి విత్తనాలు జూన్ మొదటి వారంలోనే విత్తుకోవాలి. కనీసం రెండో వారంలోనైనా విత్తనాలు విత్తకపోతే పంట ఆలస్యమై చీడపీడల పాలవుతుంది. అదే విధంగా బోరుబావులు, కాల్వ లు, చెరువుల కింద 8 లక్షల ఎకరాల్లో వరి సాగవ్వనుంది. ఆరిద్ర కార్తిలోనే వరినార్లు పోసుకుంటారు. సన్న రకాలు ఆరు మాసాలకే పంట చేతికొస్తుంది. అందుకే ఖరీఫ్‌లో జూన్‌లోనే వరి నార్లు పోస్తారు. ఇప్పటి వరకు వర్షాలు పడక పోయే సరికి మేజర్ పంటలైన పత్తి, వరి సాగు ప్రశ్నార్ధకంగా మారింది. సంగారెడ్డి జిల్లాలో జూన్‌లో సాధారణ వర్షాపా తం 130.4 మిల్లీ మీటర్లు కాగా ఇప్పటి వరకు వర్షం జాడే కనిపించలేదు. గతేడాది జూన్‌లో 150.1 మిల్లీ మీటర్ల వర్ష పాతం నమోదైంది. మెదక్, సిద్దిపేట జిల్లాల్లోనూ సాధారణ వర్షపాతం 130.6 మిల్లీ మీటర్లు కాగా ఇంత వరకు చినుకే పడలేదు. ఈ ఏడాది జూన్‌లో కనీస వర్షాపాతమైనా పడు తుందా లేదా అనే అనుమానం కలుగుతుంది. పరిస్థితులు ఇలానే కొనసాగితే ఇక జులైపై ఆధారపడాల్సి వస్తుంది. ఆ మాసంలోనూ వర్షాలు సరిపడ కురవకపోతే ఖరీఫ్ పంటల సాగు చేజారిపోయినట్లేనని రైతులు పేర్కొంటున్నారు.


చేజారిన ముందస్తు ఖరీఫ్

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ముందస్తు ఖరీఫ్‌కు వెళ్లాలని ప్రణాళికలు తయారు చేసింది. తక్కువ కాలంలో పంట చేతికొచ్చే వరి రకాల్ని సాగు చేయాలని ప్రతిపాదనలు చేసింది. యాసంగి సీజన్‌లో పంట చేతికొచ్చే దశలో అకాల వర్షాలు కురిసి ప్రతి ఏటా నష్టమేర్పడుతుంది. యాసంగిలో మార్చి వరకు కోతలు పూర్తయితే నూక శాతం తక్కువవుతుంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ ను ముందుకు తీసుకెళ్లాలని బావించింది. ఇందు కోసం వ్యవసాయ శాఖ వానాకాలం, యాసంగిలో సాగు పద్ధతిపై ఒక ప్రణాళికల తయారు చేసింది. వానాకాలంలో 140 రోజులు అంతకన్న ఎక్కువ సయమం గల దీర్ఘకాలిక రకాల సాగుకు మే 25 నుంచి జూన్ 5 లోగా నారు పోసుకోవాలని సూచించింది. 130-135 రోజుల వ్యవధి గల మధ్య కాలిక రకాల సాగుకు జూన్ 15 వరకు నార్లు పోసుకోవాలి. 120-125 రోజుల వ్యవధి గల స్వల్పకాలిక రకాల సాగుకు జూన్ 25 వరకు నార్లు పోయాలి. ఎలాంటి రకాలైనప్పటికీ వానాకాలంలో జులై చివరి నాటికే నాట్లు వేసుకోవాలి. ప్రభుత్వం ప్రతిపాదించిన మూడు రకాల సూచనలకు కూడా సమయం దాటిపోయింది. అంటే ఈ ఏడాది ఖరీఫ్ ముందుకు జరిగే అవకాశంలేదు. యాసంగిలోనూ పాత పద్ధతిలోనే వరి సాగు చేయాల్సి ఉంటుంది.

పత్తి, వరి సాగుకు అదును దాటుతున్న వైనం

పత్తి, వరి సాగుకు అదును దాటుతోంది. జూన్ 5 వరకు వరి సాగుకు నార్లు పోయాలి. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో ఎక్కడా వరి నార్లు పోయలేదు. బోర్ల కింద కొంత మంది రైతులు నారు కోసం వడ్లు చల్లారు. అవి మొలకలు రావట్లేదు. వర్షాలు పడకపోతే నాట్ల కోసం పొలం దున్నడం వీలుకాదు. ఇక పత్తి సాగు సీజన్ దాటిపోతుంది. జూన్ మొదటి వారంలోనే పత్తి విత్తనాలు విత్తుకోవాలి. ఇప్పటి వరకు దక్కులు దున్ని సిద్ధం చేశారు. వర్షాలు పడకపోవడం తో ఇంత వరకు ఏ ఒక్క ఎకరంలో కూడా విత్తనాలు విత్త లేదు. జూన్ చివరి వరకు పత్తి విత్తనాలు వేయకపోతే ఆ పంట సాగు ప్రశ్నార్ధకమే అవుతుంది.

చినుకు కోసం ఎదురుచూపు



చినుకు జాడ కోసం ఎదురు సూత్తున్నం. మబ్బుకాన రాట్లే. ఎండలు మండుతున్నయి. కాలమైతదో కాదోనన్న గుబులు పట్టుకుంది. 20 ఎకరాల్లో పత్తి విత్తనాలు విత్తుకునేందుకు సిద్ధం చేసిన. అప్పు చేసి విత్తనాలు, ఎరువులు తెచ్చిన. ఏం లాభం కాలం లేకపాయే. ఈ మాసాంతం లోనైనా వర్షం కురిస్తే సరె. లేదంటే పత్తి వేసినా దండగే. పెట్టుబడి ఎల్లదు. కాలమైతదని పొలంలో ఆశతో ఎదురు సూత్తున్నం. ఆ మేఘాల దయ.

భీమిని మాణిక్యప్ప, మేళసంఘం

ప్రత్యామ్నాయ ప్రణాళికలు

సకాలంలో అవసరం మేరకు వర్షాలు కురవకపోతే ప్రత్యామ్నాయ పంట సాగుకు సంబంధించిన ప్రణాళికలున్నాయి. కాంటింజెంట్ యాక్షన్ ప్లాన్ తయారు చేసి రైతులు అకాల పరిస్థితులకు అనుకూలమైన పంటలేయాలి. ఆగస్టు 15 వరకు కూడా వర్షాలు కురవకపోతే రెగ్యులర్‌గా వేసుకునే పంటలు కాకుండా తక్కువ కాలంలో చేతికొచ్చే రకాల్ని సాగు చేయాలి.

స్పందన, ఏరువాక శాస్త్రవేత్త

ఉన్నతంగా వైద్యం

(మొదటిపేజీ తరువాయి)

వైద్యానికి ఉన్న ఎడతెగని సంబంధాన్ని వివరించారు. "మానవజీవితం ఉన్నంత కాలం వైద్యం కూడా తప్పకుండా కొనసాగుతూనే ఉంటుం దని తెలిపారు. గతంలో మిడతలదండు బెడద గురించి కేంద్రం హెచ్చరికతో రాష్ట్ర ప్రభుత్వం తీసు కున్న చర్యలు, అనుభవాలను కేసీఆర్ వివరించారు. " మధ్య ఆసియా నుంచి ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ మీదుగా గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రానికి మిడతల దండు వస్తుంటుంది. ఈ మిడతల దండు హర్యానా లోకి వచ్చి అక్కడి నుంచి మధ్యప్రదేశ్, మహారాష్ట్ర లోకి ప్రవేశించి, ఆదిలాబాద్ సరిహద్దు దాకా విస్తరి స్తూ వస్తున్నది. కేంద్ర ప్రభుత్వం హెచ్చరికతో ఆది లాబాద్ ఉత్తర భాగాన ఉన్న కలెక్టర్లను, ఎస్పీలను అప్రమత్తం చేసి ప్రజలను, పంటలను కాపాడుకునేందుకు ఫైరింజన్లు, స్ప్రేలతో సన్నద్ధంగా ఉన్నాం. ఆ సమయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ఒక మహిళా అధికారి, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాల యం నుంచి ఇద్దరు ఎంటమాలజిస్టులు పర్యవేక్షణ కోసం వస్తే హెలికాప్టర్ సమకూర్చి సరిహద్దులకు పంపాం. మహారాష్ట్రలోనే మిడతల దండును చంపే యడం వల్ల, అవి మన దాకా రాలేదు. సైన్స్ ఇంతగా అభివృద్ధి చెందిన ఈ కాలంలోనూ ఈ సమస్యకు పరిష్కారం ఎందుకు కనుక్కో లేదని నేను వారిని ప్రశ్నించాను. అందుకు వారు, మిడతలను చంప లేము. నిర్మూలించలేము. అది అసాధ్యమని చెప్పా రు. మనిషి 4 లక్షల సంవత్సరాల క్రితం భూమి మీదకు వచ్చాడు. కానీ ఈ మిడతలు, బాక్టీరియాలు, ఇతరత్రా 8 లక్షల సంవత్సరాల క్రితమే ఉద్భవించాయి. అవి నిర్దాణంగా ఉంటాయి. వాటికి వ్యతిరేక చర్యలతో ప్రకోపం చెంది ఇబ్బందులు కలిగిస్తాయని చెప్పారు. కరోనా కూడా అటువంటిదేనా అంటే అటువంటిదే అని వారు బదులిచ్చారు. అయితే ప్రజలను ఎలా రక్షించుకోవాలని ప్రశ్నించాను. ఎక్కడైతే వైద్యారోగ్య వ్యవస్థ పకడ్బందీగా ఉంటుందో అక్కడ తక్కువ నష్టాలు జరుగుతాయని వారిచ్చిన సమాధానంతో ఆరోగ్యశాఖ ప్రాధాన్యతను అర్థం చేసుకున్నాను.." అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు వివరించారు.

" డాక్టర్లు గొప్పవారు. నిరుపేదలు వైద్యానికి వచ్చిన సందర్భంలో బెడ్లు అందుబాటులో లేకుంటే కిందనే బెడ్లు వేసి వైద్యం అందిస్తారు. దాన్ని రోగుల ను కింద పడుకోబెడుతున్నారు... అంటూ పత్రికలు, జర్నలిస్టులు వక్రీకరణలు చేస్తారు. వైద్యారోగ్యశాఖ అధికారులకు పౌర సంబంధాలపై అవగాహన తక్కువ. దీంతో వారిని విమర్శించే వారే ఎక్కువ. వైద్యం ప్రత్యేక చదువు, అర్హత. మానవతా కోణంలో ఆలోచించాలి. ఎంత ఉన్నత పదవుల్లో ఉన్నవారైనా డాక్టర్ల దగ్గరికి రావాల్సిందే..." అని సీఎం తెలిపారు.

వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు చురుకైన వ్యక్తి అంటూ సీఎం కేసీఆర్ ప్రశంసించారు." వైద్యశాఖ అందించే సేవలు ప్రజల్లోకి పోయేలా పౌర సంబంధాలను పెంపొందించాలి. ప్రజలతో పెన వేసుకున్న విభాగం కాబట్టి వైద్యారోగ్య రంగంలో పౌరసంబంధాలు బాగా పెరగాలి. వైద్యారోగ్య శాఖ ప్రజల బాగు కోసం ఏం చేస్తున్నదనేది ప్రజలకు బాగా తెలిసేలా చర్యలు చేపట్టాలి.

కేసీఆర్ కిట్ల ద్వారా గర్భిణులకు నగదు సాయంతో పాటు, ప్రసవానంతరం ఇచ్చే కిట్లతో ఆస్పత్రుల్లో ప్రసవాలు పెరిగాయి. గతంలో ప్రభుత్వాస్పత్రుల్లో 30 శాతం ప్రసవాలు జరిగితే, ప్రస్తుతం అవి 70 శాతానికి పెరిగాయి. తద్వారా మహిళల ఆరోగ్యం బాగుంటు న్నది. అనవసరమైన అబార్షన్లు, దుర్మార్గపూరిత చర్య లు కూడా ఉండటం లేదు. సమాజాన్ని కాపాడు కోగలుగుతున్నాం. మాతా మరణాలు, శిశు మరణా లు చాలా తగ్గాయి..." అని కేసీఆర్ చెప్పారు. రాష్ట్రం ఏర్పడే నాటికి నిమ్స్‌లో 900 పడకలుంటే వాటిని 1,500 పెంచుకున్నామని సీఎం కేసీఆర్ తెలిపారు. వాటికి తోడు మరో రెండు వేల పడకల ఆస్పత్రి బ్లాక్ నిర్మించుకుంటున్నామని చెప్పారు. హైదరాబాద్ నాలుగువైపులా నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రు ల నిర్మాణం, విదేశాలకు పోకుండా ఆధునిక వైద్య సేవలు, టెలిమెడిసిన్ వంటివి విస్తరించామని గుర్తుచేశారు.

కరోనా వంటి పరిస్థితులు ఎదురైతే ఎదుర్కొనేం దుకు సిద్ధంగా ఉండాలని సీఎం ఆదేశించారు. ప్రయివేటు ఆస్పత్రులు తిరస్కరించిన కరోనా రోగులను గాంధీ ఆస్పత్రి వైద్యులు బతికించారని అభినందించారు. రాష్ట్రంలోని పరిస్థితులకు అను గుణంగా అధ్యయనం చేసి ప్రణాళికలు రూపొందిం చాలని వైద్యులకు సూచించారు.

న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభం

గర్భిణీలకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్ర మాన్ని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా లాంఛనంగా ప్రారంభించారు. కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ లబ్దిదారు లు ఉదయనగర్ కాలనీకి చెందిన పార్వతి, భోళా నగర్‌కు చెందిన పర్వీనమ్మ ఎంబీటీనగర్‌కు చెందిన శిరీషమ్మ, ప్రతాప్‌నగర్ పంజాగుట్ట తేజశ్విని, శ్రీరామ్ నగర్‌కు చెందిన సుజాతమ్మ, అంబేద్కర్ నగర్ రేణుక మ్మలకు న్యూట్రిషన్ కిట్లను సీఎం అందచేశారు. వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు సీఎం కేసీఆర్‌కు లక్ష్మీనరసింహ స్వామి జ్ఞాపికను అందచేశారు. ఈ కార్య క్రమంలో వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు, మంత్రులు మహమూద్ అలీ, వేముల ప్రశాంత్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, రాజ్యసభ సభ్యులు కె.కేశవరావుతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నిమ్స్ కాంట్రాక్టు కార్మికుల జీతాలు పెంచండి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నిమ్స్ కాంట్రాక్టు కార్మికుల జీతాలను పెంచాలనీ, ఇతరత్రా సమస్యలను పరిష్కరించాలని సీఎం కేసీఆర్‌కు నిమ్స్ కాంట్రాక్టు కార్మికుల యూనియన్(సీఐటీయూ) వినతిపత్రం అందజేసింది. బుధవారం నిమ్స్ ప్రాంగణం లో సీఎం కేసీఆర్‌ను సీఐటీయూ, టీఆర్ఎస్‌కేవీ నాయకులు వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర అధ్యక్షులు జి.రాంబాబు యాదవ్, కనీస వేతనాల సలహా మండలి బోర్డు చైర్మెన్ పి.నారాయణ, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్, నిమ్స్ కాంట్రాక్టు కార్మికుల యూనియన్ (సీఐటీయూ అనుబంధం) అధ్యక్షులు ఎం.వెంకటేశ్, నాయకులు బాలయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. నిమ్స్ ఆస్పత్రిలో కాంట్రాక్టు పద్ధతిలో 30 ఏండ్ల నుంచి 1350 మంది కార్మికులు పనిచేస్తున్నారనీ, 306 డ్రాఫ్ట్ జీవో ప్రకారం రూ.14,700 జీతం మాత్రమే ఇస్తున్నారని సీఎం కేసీఆర్ దృష్టికి వారు తీసుకెళ్లారు. 2019 నుంచి వీడీఏ పాయింట్లు అమలు చేస్తామనీ, వాటిని లెక్కించి అదనంగా రూ.2,100 వేతనం పెంచి ఏరియర్స్ ఇస్తామని నిమ్స్ అధికారులు వాగ్దానం చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఇప్పటివరకూ నిమ్స్ యాజమాన్యం ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని వాపోయారు. సీనియార్టీ ప్రకారం కార్మికులను రెగ్యులర్ చేయాలనీ, 306 జీవోను గెజిట్ చేయాలనీ, రూ.26 వేల వేతనం ఇవ్వాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. నిమ్స్‌లో పని చేసి రిటైర్డ్ అయిన కార్మికులకు ఆ ఆస్పత్రిలో ఉచిత వైద్య సేవలందించాలనీ, బస్‌పాసు సౌకర్యం కల్పించాలని కోరారు.

సీబీఐకి నో ఎంట్రీ

- తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం

చెన్నై: తమిళనాడులోని స్టాలిన్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐకి తలుపులు మూసివేసింది. రాష్ట్రంలో ఏ కేసులోనైనా దర్యాప్తు చేసుకునేందుకు గతంలో సీబీఐకి ఇచ్చిన అనుమతిని ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. దీంతో ఇకపై రాష్ట్రంలో ఏ కేసునైనా సీబీఐ దర్యాప్తు చేయాలంటే.. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. గతంలో తెలంగాణ సహా పలు రాష్ట్రాలు ఇదే తరహా నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. సెంథిల్ బాలాజీని మనీలాండరింగ్ కేసులో ఈడీ అరెస్టు చేసిన కొన్ని గంటల వ్యవధిలోనే డీఎంకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వం కేంద్ర దర్యాప్తు సంస్థల్ని దుర్వినియోగ పరుస్తోందంటూ తీవ్రంగా ఆరోపిస్తూ ఇప్పటికే దేశంలోని తొమ్మిది రాష్ట్రాలు సీబీఐకి జనరల్ కన్సెంట్‌ను ఉపసంహరించుకున్నాయి. ఆ జాబితాలో తెలంగాణ, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, కేరళ, ఝార?ండ్, పంజాబ్, మేఘాలయ, మిజోరాం రాష్ట్రాలు ఉండగా.. తాజాగా తమిళనాడు చేరినట్లయింది.

శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ గోల్డెన్ జూబ్లీ ప్లాన్

ముంబయి : శ్రీరామ్ గ్రూప్ గోల్డెన్ జూబ్లీ వేడుకల సందర్భం గా కొత్త బీమా పాలసీని ప్రారం భించినట్లు ప్రకటించింది. శ్రీ రామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆవిష్కరించిన ఈ ఈ ప్లాన్ ఒక యూనిట్ లింక్డ్, నాన్ పార్టిసిపేటింగ్ ప్లాన్ అని పేర్కొంది. ఇది పాలసీ హోల్డర్లు తమ ఆర్థిక లక్ష్యాలను సాధించడంలో సహాయం చేస్తుందని పేర్కొంది.

అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
గురువారం 15-6-2023
సంపుటి : 9 | సంచిక : 165 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు | వెల : 6.50

ఢిల్లీకి పాలు, నీళ్లు నిలిపేస్తాం
బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలి
- ఖాప్ పంచాయతీల డిమాండ్
- 18న భారత్ బంద్‌కు పిలుపు



న్యూఢిల్లీ : రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్‌ఐ) అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేసిన హర్యానాలోని ఖాప్ పంచాయితీలు బుధవారం బంద్ నిర్వహించాయి. ఢిల్లీ-హర్యానా జాతీయ రహదారిని ...5లో

ఉన్నతంగా వైద్యం
అదే మా లక్ష్యం : సీఎం కేసీఆర్
- నిమ్స్‌లో దశాబ్ది బ్లాక్ భవనానికి శంకుస్థాపన
- కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ల పంపిణీ ప్రారంభం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
దేశానికి ఆదర్శంగా నిలిచిన రాష్ట్ర వైద్యారోగ్య రంగాన్ని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేంత వరకు రాష్ట్ర ప్రభుత్వ పట్టుదల తపన కొనసాగుతూనే ఉంటుందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు స్పష్టం చేశారు. వైద్యారోగ్య రంగంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యాచరణ మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందనీ, కరోనావంటి కష్టకాలంలో డాక్టర్లు, నర్సులు, సిబ్బంది, ఉన్నతాధికారులు ప్రదర్శించిన పనితీరు గొప్పదని సీఎం కొనియాడారు. ఎంతచేసినా వైద్యశాఖకు పలు దిక్కుల నుంచి విమర్శలు వస్తుంటాయని తెలిపారు. ఈ విషయాన్ని గమనంలో ఉంచుకుని ప్రజావైద్యం దిశగా ఈ శాఖ చేస్తున్న కృషిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకుపోవాలని సూచించారు. అందుకోసం ప్రజా సంబంధాల వ్యవస్థను మరింతగా మెరుగుపరుచుకుని ప్రణాళిక రూపొందించుకోవాలని సీఎం కేసీఆర్ సూచించారు.

"2014 లో వైద్యరంగానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపు రూ.2,100 కోట్లు. కాగా, 2023-24లో కేటాయింపులు రూ. 12,367 కోట్లకి పెంచాం. అన్నం ఉడికిందా అని కుండంతా పిసికి చూడాల్సిన అవసరం లేదు. దీన్నే బట్టే మనకు తెలంగాణ పురోగమనం అర్థం అవుతుంది. వైద్యారోగ్య శాఖను చాలా అనూహ్యంగా విస్తరిస్తున్నాం. 17 వేల పడకల నుంచి 50 వేల పడకలకు విస్తరించాం, వందో రెండొందలో ఉన్న ఆక్సిజన్ బెడ్లను 50 వేలకు పెంచుకున్నాం, కేంద్రాన్ని ప్రాధేయపడకుండా సొంతంగా 550 టన్నుల ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేసే ప్లాంట్లను ఏర్పాటు చేసుకున్నాం" - కేసీఆర్

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం నాడు జరిగిన వైద్యారోగ్య దినోత్సవం సందర్భంగా ...ప్రముఖ ప్రభుత్వ దవాఖాన నిమ్స్ విస్తరణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఇది పూర్తయితే ఈ 'దశాబ్ది వైద్య భవనాల్లో' నూతనంగా 2,000 ఆక్సిజన్ పడకలు అందుబాటులోకి రానున్నాయి. అత్యంత అధునాతన ఆపరేషన్ థియేటర్లు సహా వర్తమాన వైద్య రంగంలో ప్రజల వైద్యసేవలకు అవసరమయ్యే పలు రకాల వైద్య సేవలు అందనున్నాయి.
ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ మానవ జీవితానికి, ...2లో






నిమ్స్ కాంట్రాక్టు కార్మికుల జీతాలు పెంచండి
- ఇతరత్రా సమస్యలు పరిష్కరించండి
- సీఎం కేసీఆర్‌కు సీఐటీయూ వినతి పత్రం అందజేత

వివరాలు 2లో

రాష్ట్ర ప్రభుత్వ నిర్మాణాలకు అంతర్జాతీయ అవార్డులు
- సీఎం కేసీఆర్ హర్షం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన, పునరుద్ధరించిన 5 నిర్మాణాలు అంతర్జాతీయ అవార్డులను దక్కించుకోవడం పట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు హర్షం వ్యక్తం ...5లో

తమిళనాడు మంత్రి అరెస్టు
సెంథిల్‌బాలాజీ అరెస్టులో నాటకీయ పరిణామాలు
- ఛాతిలో నొప్పితో ఆస్పత్రిలో చేరిన మంత్రి
- ఇది ప్రతీకార రాజకీయ చర్య ..ఫెడరల్ స్ఫూర్తిపై దాడి : సీఎం స్టాలిన్
- ఇలాంటి చర్యలకు భయపడం : కాంగ్రెస్



ఆస్పత్రిలో మంత్రిని పరామర్శిస్తున్న సీఎం

చెన్నై : మనీలాండరింగ్ కేసులో తమిళనాడు విద్యుత్ శాఖ మంత్రి, డీఎంకే నేత వి. సెంథిల్ బాలాజీ అరెస్టయ్యారు. మంత్రి కార్యాలయంలో మంగళవారం నుంచి సోదాలు జరిపిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు దాదాపు 18 గంటల పాటు విచారించారు. అనంతరం అర్ధరాత్రి ఆయనను అదుపులోకి తీసుకున్నారు. మంత్రి అరెస్టుతో తమిళనాడు రాజకీయాల్లో హీట్ పెరిగింది. డీఎంకే, కాంగ్రెస్, వాటి మిత్రపక్షాలు కేంద్రంలోని మోడీ సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేశాయి.
సెంథిల్ బాలాజీ తన సహాయకులు సిఫారసు చేసిన అభ్యర్థులను నియమించేందుకు ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ అధికారులతో కలిసి కుట్ర పన్నారనే ఆరోపణలపై కేసు నమోదైంది. ఉద్యోగాల కోసం కోట్లాది రూపాయలు లంచం తీసుకున్నారని ఈడీ ఆరోపించింది. సెంథిల్ బాలాజీ రాష్ట్ర రవాణా శాఖ మంత్రిగా ఉన్న సమయంలో 2014 నుంచి 2015 మధ్య కాలంలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఆ సమయంలో ఆయన ఏఐఏడీఎంకే నాయకుడిగా ఉన్నారు. ఆ తర్వాత 2018లో ఆయన డీఎంకేలో చేరారు.
ఈనెల 13న ఈడీ రాష్ట్ర సెక్రెటేరియట్‌లోని సెంథిల్‌బాలాజీ ఛాంబర్‌లు, చెన్నైలోని ఆయన బంగ్లా, కరూర్, కోయంబత్తూర్ నగరాల్లో అతనికి సంబంధించిన ఇతర ప్రాంగణాల్లో సోదాలు నిర్వహించింది. అయితే, బుధవారం తెల్లవారుజామున ఈడీ అధికారులు మంత్రిని అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఆ సమయంలో ఆయన ఏడ్చినట్టు వీడియోలో కనబడింది.
మంత్రి అరెస్టు తర్వాత కరూర్ బస్టాండులో అధికారులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. అయితే అరెస్టు తర్వాత ఛాతిలో అసౌకర్యంగా ఉన్నదని సెంథిల్‌బాలాజీ ఫిర్యాదు చేశారు. దీంతో ఆయనను వైద్య పరీక్షల కోసం చెన్నైలోని మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ అడ్మిట్ అయ్యారు. అనంతరం మంత్రికి కరోనరీ యాంజియోగ్రామ్ చేయించామనీ, అందులో ఆయన ట్రిపుల్ వెసెల్ డిసీజ్‌తో బాధపడుతున్నారని తేలిందని ...5లో

సీబీఐకి నో ఎంట్రీ
- తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం

వివరాలు 2లో

ఆయుధంగా మారిన ఈడీ


'సెంథిల్ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం. రాష్ట్ర సచివాలయంలో సోదాలు జరపడం దేనికి సంకేతం? ఎక్కడైనా సోదాలు చేయగలమనే బెదిరింపులకు ఇది సంకేతం కాదా? ప్రతిపక్ష నేతలపై దాడికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ను మోడీ ప్రభుత్వం ఒక ఆయుధంగా మార్చుకుంది'
- సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఏచూరి

ధరణి జీవన్మరణ సమస్య
దివాళా తీసిన కంపెనీకి ధరణి బాధ్యత ఎలా అప్పగిస్తారు?
- విదేశీ కంపెనీ చేతుల్లోకి తెలంగాణ డేటా
- ధరణి లావాదేవీలపై ఫోరెన్సిక్ ఆడిట్ జరగాలి
- కేసీఆర్‌ను అసెంబ్లీలో చెట్టుకు ఉరి తీసినా తప్పులేదు: టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్
తెలంగాణ ప్రజలకు ధరణి పోర్టల్ జీవన్మరణ సమస్యగా మారిందని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దాన్ని రద్దు చేస్తామని ...5లో



కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ నేతలు నోముల, శ్రీహరిరావు
- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన రేవంత్ 5లో..

హస్తం వైపు రాజగోపాల్‌రెడ్డి చూపు
ఇప్పటికే క్యాడర్‌కు సంకేతాలు..బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అన్న భావన

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్
బీజేపీ విసిరిన వలలో చిక్కుకున్న మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఇప్పుడు పునరాలోచనలో పడ్డారని తెలుస్తున్నది. హస్తం గూటికి చేరేందుకు పావులు కదుపుతున్నట్టు, ఢిల్లీ నుంచి దిగ్విజయ్ సింగ్ రంగంలోకి దిగి ఆయనతో చర్చలు జరిపినట్టు, తిరిగి పార్టీలో చేరేందుకు రాజగోపాల్‌రెడ్డి సిగ్నల్ ఇచ్చినట్టు ప్రచారం జరుగుతున్నది. దానికి తగ్గట్టుగానే తన క్యాడర్‌కు రాజగోపాల్‌రెడ్డి సంకేతాలు పంపుతున్నారు. తన వెంటే నడిచి వచ్చేలా సన్నద్ధం చేస్తున్నారు. కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు జిల్లాలో రాజగోపాల్‌రెడ్డి భువనగిరి పార్లమెంటరీ స్థానం పరిధిలో రాజకీయ చక్రం తిప్పేవారు. అందుకు తగ్గట్టుగానే ఆయా నియోజకవర్గాల్లో తనకంటూ సొంత క్యాడర్‌ను తయారుచేసుకున్నారు.





బీజేపీ ఆడిన నాటకం
కాంట్రాక్టులు, పెండింగ్ బిల్లులను అడ్డంపెట్టుకుని బీజేపీ ఆడిన నాటకం... ఇదే క్రమంలో రేవంత్‌రెడ్డి పార్టీ అధ్యక్షుడు కావడాన్ని జీర్ణించుకోలేకపోయిన ఆయన చివరకు కాంగ్రెస్‌ను వీడారు. ఆ సందర్భంలో సోదరులైన రాజగోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి మధ్య అంతర్గతంగా చిన్నపాటి యుద్ధమే సాగిందనే ప్రచారముంది. అన్న చెప్పినా ఆయన వినలేదు. హస్తం గుర్తుపై గెలిచిన ఆయన ఆ తర్వాత ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న రాజగోపాల్‌రెడ్డి ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో ఓడిపోయారు. ఉప ఎన్నికల్లో బొక్కబోర్లా పడ్డ తర్వాత, ఇప్పుడు బీజేపీలో నేతలు గ్రూపులుగా విడిపోయి ఎవరికి వారు ఎత్తులకు పైఎత్తులు వేసుకుంటుండటంతో ఆ పోరు భరించలేనన్న నిర్ణయానికి వచ్చి రాజగోపాల్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. 'మీకు ఫోన్ ఎప్పుడైనా రావచ్చు. నాతో కలిసి వచ్చేందుకు సిద్ధంగా ఉండండి. మీతో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుందాం. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే. రెండు పార్టీల నేతలు పైకి విమర్శలు ...5లో



ముంచుకొస్తోంది..
- సౌరాష్ట్ర, కచ్ జిల్లాలకు రెడ్ అలెర్ట్
- బిపోర్‌జాయ్ తుపానుతో 8 రాష్ట్రాల్లో వర్షాలు

న్యూఢిల్లీ : బిపోర్‌జాయ్ తుపాను అంతకంతకూ తీవ్రమవుతూ గుజరాత్‌పై విరుచుకుపడుతోందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) బుధవారం తెలిపింది. గుజరాత్‌లోని సౌరాష్ట్ర, కచ్ జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది. జునాగఢ్, ద్వారక తీర ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు ...5లో



మణిపూర్‌లో ఆగని హింస
మరో తొమ్మిది మంది మృతి.. మంత్రి ఇంటికి నిప్పు

ఇంఫాల్ : మణిపూర్‌లో జాతుల మధ్య హింసాకాండ కొనసాగుతూనే ఉంది. మంగళవారం రాత్రి జరిగిన హింసాత్మక సంఘటనలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రంలోని కాంగ్‌కోపీ జిల్లా ఐజీజంగ్ గ్రామంలో కాల్పులు, గృహదహనాలు వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. కుకీల జనాభా అధికంగా ఉన్న ఈ గ్రామంలో రాత్రి 10.30 గంటలకు హింస చెలరేగింది. చనిపోయిన వారందరూ ...5లో

ఆకాశం వైపు ఎదురుచూపు
నైరుతీ రుతుపవనాలు ఆలస్యం
- జూన్ 15 వచ్చినా చినుకు జాడలేదు
- ఖరీఫ్ ముందస్తు సాగు అసాధ్యమంటున్న రైతులు
- ప్రత్యామ్నాయ పంట ప్రణాళికలు ఏవీ?

జూన్ రెండో వారంలో కూడా మండుతున్న ఎండల్ని చూస్తుంటే వానా కాలమా..? ఎండా కాలమా..? అనే సందేహం కలుగుతుంది. ముందస్తు ఖరీఫ్ కాదు కదా.. సాధారణ ఖరీఫ్ సీజన్ కూడా చేజారిపోతుందనే గుబులు అన్నదాతలు వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో అకాల వర్షాలు తప్ప సీజన్‌లో కురవాల్సిన వర్షాల జాడలేకపోయే సరికి రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. నైరుతి రుతుపవనాలు సకాలంలో వస్తున్నాయని ఆశపడ్డ రైతులకు నిరాశే ఎదురవుతోంది. వేసవి దుక్కులు దున్నేందుకైనా పదును ఉండే చిన్నపాటి వర్షంకూడా కురవకపాయే అంటూ దిగాలు చెందుతున్నారు. పత్తి విత్తనాలు విత్తుకునే సమయం చేజారిపోతుందని ఆందోళన చెందుతున్నార



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి
ఉమ్మడి మెదక్ జిల్లాలో ఖరీఫ్ సీజన్ పంటల సాగు జాడే కనిపిస్తలేదు. మూడు జిల్లాల్లో కలిపి 18 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యే అవకాశముంది. సంగారెడ్డి జిల్లాలో 7.10 లక్షల ఎకరాలు సాగుకానుంది. ఇందులో పత్తి 3.50 లక్షల ఎకరాలు, వరి 1.40 లక్షల ఎకరాలు, మిగతావి ఇతర పంటలు సాగవుతాయి. మెదక్ జిల్లాలో 3.76 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవ్వనుండగా.. ఇందులో అత్యధికంగా వరి.. 3.10 లక్షల ఎకరాల్లో సాగవుతుంది. సిద్దిపేట జిల్లాలో 8 లక్షల ఎకరాల్లో.. 3.20 లక్షల ఎకరాల్లో వరి, 3.50 లక్షల ఎకరాల్లో పత్తి సాగవ్వనుంది. చెరకు, కంది, పెసర, మొన్నజొన్న, జొన్న, మినుము, మక్కలు, ఆలు, ...2లో

లండన్‌లో హైదరాబాద్ యువతి హత్య
మరో యువతికి తీవ్రగాయాలు



(ఫైల్)

నవతెలంగాణ-తుర్కయాంజల్
లండన్‌లో హైదరాబాద్‌కు చెందిన యువతి దారుణ హత్యకు గురైంది. బ్రెజిల్‌కు చెందిన యువకుడు ఆమెపై కత్తితో దాడి చేసి హత్య చేశాడు. ఈ సంఘటన యువతి కుటుంబసభ్యులకు తీవ్ర మనోవేదనను మిగిల్చింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా తుర్కయాంజల్ మున్సిపాల్టీ బ్రహ్మణపల్లికి చెందిన కొంతం శ్రీనివాస్ రెడ్డి, రమాదేవి దంపతులకు కూతురు తేజస్విని (23), కుమారుడు పవన్ కుమార్ రెడ్డి ఉన్నారు. శ్రీనివాస్‌రెడ్డి ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ పిల్లలను చదివిస్తున్నాడు. కుమారుడు ఆస్ట్రేలియాలో ప్రయివేటు ఉద్యోగం చేస్తుండగా కూతురు తేజస్విని రెడ్డి ఎంఎస్ చేయడానికి రెండున్నర సంవత్సరాల క్రితం లండన్ వెళ్లింది. లండన్‌లోని గ్రీన్ విచ్ యూనివర్సిటీలో ఎంఎస్ పూర్తి చేసింది. ఇటీవలే స్వదేశానికి తిరిగి రావాల్సి ఉండగా కొన్ని కారణాల దృష్ట్యా ఆమె రాలేకపోయింది. అయితే ...5లో

సంపాదకీయం


అవి తాయిలాలు కాకూడదు...

మనం చేస్తున్న పని మంచిదా..? చెడ్డదా..? అన్నప్పుడు 'దాని వల్ల అత్యధిక మందికి మేలు, లాభం జరిగితే అది మంచిదని భావించొచ్చు...' అని మన పెద్దలు చెబుతుంటారు. ఇది వ్యక్తుల దగ్గర్నుంచి వ్యవస్థల వరకూ.. పంచాయతీ దగ్గర్నుంచి పార్లమెంటు వరకూ అందరికీ వర్తించే

> తెలంగాణలోని దళిత, బడుగు, బలహీనవర్గాల వారు, మైనారిటీలు దశాబ్దాల తరబడి... 'కూడుకేడ్చారు.. గూడుకేడ్చారు..ఒంటినిండా కప్పుకోను బట్టకేడ్చారు...' ఈ క్రమంలో స్వయం పాలన, సర్వతోముఖాభివృద్ధి కోసమంటూ కొట్లాడి తెలంగాణను తెచ్చుకున్నాం. మళ్లీ ఇప్పుడు గతంలో మాదిరిగా కూడు కోసం, గూడు కోసం, ఆర్థిక సాయాలు, ఆసరాల కోసం ఏడ్చే పరిస్థితి రాకూడదు. అది రాకుండా ఉండాలంటే పాలకులు, పార్టీలు గుప్పించే హామీలు 'ఎన్నికల తాయిలాలు' కాకూడదు. అవన్నీ అమలు కావాలని ఆశిద్దాం.

సూత్రం. మనం ఇప్పుడు ప్రజాస్వామ్య భారతంలో ఉన్నాం కాబట్టి... పాలకులు ఈ విషయాన్ని మరింతగా గుర్తు పెట్టుకోవాలి. భారతావనికి స్వాతంత్ర్యం సిద్ధించి 76 ఏండ్లు పూర్తవుతున్న క్రమంలో... తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు నిర్వహించుకుంటున్న ప్రస్తుత తరుణంలో ఇది మరింత సందర్భోచితం.

రానున్న ఐదారు నెలల కాలం తెలంగాణకు, ఇక్కడి ప్రజలకు అత్యంత కీలక సమయం. ఎందుకంటే రాష్ట్ర శాసనసభకు డిసెంబరు నాటికి ఎన్నికలు జరుగుతాయి కాబట్టి. ఈ క్రమంలో ఈ ఐదారు నెల్ల కాలం ఇటు అధికార పార్టీకి, అటు ప్రతిపక్ష పార్టీలకు కూడా అంతే కీలకం. అందుకే బీఆర్ఎస్‌తోపాటు కాంగ్రెస్, బీజేపీలు పోటా పోటీగా జనంపై హామీల వర్షం కురిపిస్తున్నాయి. అధికారంలోకి వస్తే అది చేస్తాం.. ఇది చేస్తామంటూ హంగామా సృష్టిస్తున్నాయి. ఈ వాగ్దానాల వానను కురిపించటంలో అధికారంలో ఉన్న గులాబీ పార్టీ సహజంగానే ముందు వరుసలో ఉంది. వికలాంగులకు పింఛన్ పెంపు, బీసీలకు రూ.లక్ష ఆర్థిక సాయం వంటివి ఈ కోవలోనివే. వీటిలో బీసీలకు ఆర్థిక సాయం కోసం దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా వచ్చి పడుతున్నాయి. ఈ అప్లికేషన్ సమర్పించేందుకు అవసరమైన ఆదాయ ధృవీకరణ పత్రం కోసం జనాలు తహశీల్దార్ కార్యాలయాల ముందు క్యూ కడుతున్నారు. మీ సేవా సెంటర్లు దరఖాస్తుదారులతో కిక్కిరిసి పోతున్నాయి. దాంతో వాటి పంట పండుతోంది.



ఇంత వరకూ పరిస్థితి బాగానే ఉంది. కానీ ఇక్కడే ఒక లాజిక్కు దాగుంది. దరఖాస్తులు సమర్పించిన బీసీలందరికీ ఆర్థిక సాయం వస్తుందా..? అనేది పెద్ద శేష ప్రశ్న. ఇప్పటి బీఆర్ఎస్‌తో పాటు గతంలో రాష్ట్రాన్ని పాలించిన పలు పార్టీలు ఎన్నికలప్పుడు ప్రకటించిన అనేక పథకాలు, కార్యక్రమాలు లబ్దిదారులందరి దరి చేరకపోవటమే దీనికి కారణం. ఎప్పటిదాకో ఎందుకు..తెలంగాణ ఆవిర్భవించిన నాటి నుంచి నేటి దాకా పదేండ్ల కాలాన్ని పరిశీలించినా ఈ సత్యం బోధపడుతుంది. 2014 జూన్‌లో రాష్ట్ర శాసనసభ ఎన్నికల సమయంలో... దళితులకు మూడెకరాల భూ పంపిణీ, కేజీ టూ పీజీ ఉచిత విద్య, డబుల్ బెడ్ రూం ఇండ్లు తదితర ప్రతిష్టాత్మక పథకాలను ఆనాటి టీఆర్ఎస్ (నేటి బీఆర్ఎస్) ప్రకటించింది. ప్రస్తుతం ఆయా హామీల పరిస్థితేంటో మనందరికీ తెలిసిందే. 2014లో ఇచ్చిన 'దళితులకు మూడెకరాల' హామీ గురించి... 2018 ముందస్తు ఎన్నికల సందర్భంగా ఏలికలను అడిగితే... 'వాగ్దానాలన్నీ ఐదేండ్లలోనే అమలు కావు... మూడెకరాల పంపిణీ అనేది ఒక నిరంతర ప్రక్రియ, అందువల్ల అది కొనసాగుతూనే ఉంటుంది...' అనే సమాధానం విని విస్తుపోవాల్సి వచ్చింది. ఇక 2018లో ఇచ్చిన నిరుద్యోగ భృతికి ఇప్పటి వరకూ అతీగతీ లేదు. దీని గురించి నాలుగేండ్ల క్రితమే అడిగితే... 'రాష్ట్రంలో ఎంతమంది నిరుద్యోగులున్నారో వివరాలు తీస్తున్నాం... విధి విధానాలు రూపొందిస్తాం...' అని చెప్పారు తప్పితే అటు మంత్రుల నుంచి గానీ, ఇటు అధికారుల నుంచి గానీ స్పష్టమైన సమాధానం రాకపోవటం గమనార్హం. హుజూరాబాద్ ఉప ఎన్నిక సందర్భంలో కూడా సర్కారు వారు ఆర్భాటంగా దళిత బంధును ప్రకటించారు. ఆ పథకం కింద ఇప్పటి వరకూ ఒక్కో ఊరిలో ఎంత మందికి లబ్ది చేకూరిందనేది లెక్కలు తీస్తే... అసలు విషయం ఇట్టే బోధపడుతుంది. బర్రెలు, గొర్రెల పంపిణీ సంగతి సరేసరి.

ఈ రకంగా 'ఏ పథకాన్ని, ఏ కార్యక్రమాన్ని చూసినా... ఏమున్నది గర్వకారణం... అవన్నీ ఎన్నికల మాయాజాలం...' అన్నట్టుగా పరిస్థితి తయారైంది. తెలంగాణలోని దళిత, బడుగు, బలహీనవర్గాల వారు, మైనారిటీలు దశాబ్దాల తరబడి... 'కూడుకేడ్చారు.. గూడుకేడ్చారు... ఒంటినిండా కప్పుకోను బట్టకేడ్చారు...' ఈ క్రమంలో స్వయం పాలన, సర్వతోముఖాభివృద్ధి కోసమంటూ కొట్లాడి తెలంగాణను తెచ్చుకున్నాం. మళ్లీ ఇప్పుడు గతంలో మాదిరిగా కూడు కోసం, గూడు కోసం, ఆర్థిక సాయాలు, ఆసరాల కోసం ఏడ్చే పరిస్థితి రాకూడదు. అది రాకుండా ఉండాలంటే పాలకులు, పార్టీలు గుప్పించే హామీలు 'ఎన్నికల తాయిలాలు' కాకూడదు. అవన్నీ అమలు కావాలని ఆశిద్దాం.

ప్రభుత్వ విద్య ప్రజల ఆకాంక్షలవైపు అడుగేసేనా?

పి. మాణిక్ రెడ్డి

మానవమేధస్సు అమోఘమైనది. ఆ మేధస్సు పరిణితి, ఆలోచనల ఘర్షణల మూలమే మనం చూస్తున్న అనేక ఆవిష్కరణలు. ఆ విధమైన నూతన ఆవిష్కరణలకు, శాస్త్ర సాంకేతిక పురోగమనాకి విద్య చుక్కానిలాంటిది. ఒక దేశం అభివృద్ధి, పౌరుల క్రియాశీల ఆలోచనా స్రవంతిని ఆదేశ విద్యావిధానం నిర్దేశిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈనాడు అనేక దేశాల అభివృద్ధి లేదా వెనుకబాటుతనాన్ని పరిశీలించినప్పుడు ఈ వ్యత్యాసం మనకు స్పష్టంగా గోచరిస్తున్నది. అలాంటి విద్య అందరికీ అందుబాటులో ఉండాలి. అందరికీ సమానమైనదిగా నాణ్యమై నదిగా ఉండాలి. స్వాతంత్ర్యం సాధించి 75ఏండ్లు గడిచినా అక్షరాస్యతలో ఇంకా 75శాతానికి చేరువలోనే ఉన్నాం. మహిళా అక్షరాస్యత 65శాతం వద్దే ఉన్నది. దళిత, ఆదివాసి వెనుకబడిన వర్గాల్లో, కొన్ని ప్రాంతాల్లో 50శాతం వద్దే ఆగిపోయింది. ఇదంతా అందరికీ విద్యనందించటంలో పాలకవర్గం నిర్లక్ష్యం ఉదాసీనతయే కారణం. విద్యార్థుల ప్రమాణాలకు సంబంధించి తరచుగా మనకు వినపడే నాణ్యతా విషయాన్ని పరిశీలిస్తే మనం తరచూ "అంద రికీ సమాన విద్య" అంటున్న మాటల్లో సమానమైన, నాణ్యమైన ఆనేది సమపాళ్ళలో విద్య అందుతుందా? అనేది సంశయమే. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు దశాబ్ది ఉత్సవాలు ప్రారంభించుకున్న తరుణంలో రాష్ట్రంలోని విద్యారంగ స్థితిగతులను పరిశీలిస్తే అనేక విషయాలు వెల్లడయ్యాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాల విషయాన్ని చూసినప్పుడు అనేక కారణాలు మనకు చాలా స్పష్టంగా కనిపిస్తాయి. విద్యార్థి సమగ్ర మూర్తిమత్వ ఎదుగుదలకు తోడ్పడే విద్యనందించాల్సిన ప్రభుత్వ పాఠశాలవిద్య అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నది. 'ఐఏఎస్ కొడుకైనా, అటెండర్ కొడుకైనా' ఒకే విధమైన పాఠశాలలో చదువుకునే విధంగా 'కేజీ టు పీజీ' విద్యనందిస్తామన్న వాగ్దానాలను, దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సర్వీసు సమస్యల పరిష్కారంపై 'అర పేజీలో రాసు కుందాం' అంటూ ఇచ్చిన హామీల నినాదాలను విద్యా భిమానులేమీ మరువలేదు.

> రాష్ట్ర వ్యాప్తంగా 5వేల ప్రొఫెసర్లు ఇతర సిబ్బంది ఖాళీలున్నాయంటే ఉన్నత విద్యలో ఉన్నతాన్నేమని అర్థం చేసుకోగలం. నియామకాల నోటిఫికేషన్‌లకు ఆటంకాలున్నాయని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నది. ఆ ఆటంకాల వెనుకున్న సూత్రధారుల ఆటలు కట్టించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలి. దానికేమాత్రం వెరవరాదు. విద్యారంగంతోపాటు ప్రభుత్వం నిర్మాణాత్మక విమర్శగా స్వీకరించి పరిష్కార కార్యాచరణను ప్రకటించాలి. అందుకోసం మరో ఉద్యమానికి సైతం పూనుకోవాలి. కావలసిందల్లా విద్యా రంగంపట్ల, పేదప్రజల చదువులపట్ల చిత్తశుద్ధి.

ఉపాధ్యాయుల ఖాళీలు


రాష్ట్రంలోనున్న ప్రభుత్వ జిల్లా, మండల పరిషత్ ఆధ్వర్యంలోని 26,074 పాఠశాలల్లో దాదాపు 20వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలుస్తున్నది. ఏడేండ్లుగా పదోన్నతులు లేనందున 11వేల పోస్టులు భర్తీకి నోచుకోక ఖాళీగా ఉంటున్నాయి. ఇందులో 2వేలదాకా ఉన్నత పాఠశాలల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పోస్టులు. ఇంత పెద్ద మొత్తంలో సబ్జెక్టు టీచర్లు, ప్రధానోపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉండటం పాఠశాలల అడ్మినిస్ట్రేషన్‌పై తీవ్ర ప్రతికూల ప్రభావం ఉండడం సహజమే కదా! అర్థ పుష్కరకాలం పైగా పండిట్, పిఇటి అప్‌గ్రేడేషన్ సమస్య సాగదీయడం విద్యాశాఖకు ఓమచ్చగా మిగిలిపోతున్నది. పరిష్కారమార్గాన్ని పరిశీలించే బదులు, ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులే కోర్టుకు వెళ్ళారంటూ క్లిష్టమైన సమస్యగా చిత్రీకరించి చెప్పుకోవడమే సులభమైన మార్గంగా ఎంచు కోవడమనేది విద్యారంగం పట్ల ప్రభుత్వ నిర్లిప్తధోరణి కాక ఏమనుకోవాలి? రాష్ట్రంలోని 33జిల్లాలకుగాను కేవలం 7జిల్లాల్లోనే పూర్తిస్థాయి డీఈఓలు ఉన్నారు. కొత్త జిల్లాలు ఏర్పడేనాటికున్న 12డీఈఓ పోస్టులకు గాను ఐదుఖాళీగా ఉండగా నూతన జిల్లాలకు మంజూరీ చేయాల్సిన పోస్టులు ఇంతవరకు లేవు. జిల్లాల్లో ఇంఛార్జిలు లేదా పూర్తి అదనపు బాధ్యతలుగా విధులు నిర్వహించే డీఈఓలు ఉన్నారు. కీలకమైన జిల్లా విద్యాశాఖాధికారి పోస్టులు ఖాళీగా ఉండడం మూలంగా పాఠశాలల గైడెన్స్, పర్యవేక్షణకు సంబంధించిన సమగ్రతలో లోటు ఏర్పడుతున్నది. ఉపాధ్యాయుల సీనియారిటీ లిస్టులు, సర్వీసు సమస్యల పరిష్కారానికి సంబంధించిన పరిస్థితులు ఉపాధ్యాయులను అసంతృప్తికి గురి చేస్తున్నాయి. మారిన పరిస్థితుల కనుగుణంగా ఉప విద్యాశాఖాధికారుల అదనపు పోస్టులు మంజూరు చేయాల్సి ఉన్నది. మండల స్థాయిలోనైతే మండల విద్యాధికారులు లేనందువలన పర్యవేక్షణా భారంతో ఒక్కొక్క ఇంఛార్జి యంఈఓ అరడజను మండలాల బాధ్యతలతో నెట్టుకొస్తున్న పరిస్థితి. ఇది ఉపాధ్యాయులపై కూడ అదనపు పనిభారానికి కారణమవుతున్నది. మొత్తం 612మండలాలకుగాను కేవలం 17మండలాలలోనే పూర్తికాలపు యంఈఓలు ఉండటం, పదిహేనేండ్లుగా యంఈఓ పోస్టులు భర్తీకాకపోవడం మూలంగా పాఠశాల విద్యలో కలిగిన ప్రతినష్టాన్ని, లోపాల్ని అసర్-2022 నివేదిక తేటతెల్లం చేసింది.

విద్యార్థుల ఎన్‌రోల్‌మెంటు

కరోనా తదనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంటు గణనీయంగా పెరిగింది. పెరిగిన విద్యార్థుల సంఖ్యకనుగుణంగా బోధనా సిబ్బందిని, బోధనా సౌకర్యాలకు సంబంధించి సానుకూల సత్వర చర్యలు తీసుకున్నట్లైతే ఎన్‌రోల్‌మెంట్‌ను నిలుపుకోగలిగే అవకాశం ఉండేది. కానీ పెంచాల్సిన ప్రభుత్వం ఆవైపు దృష్టి కేంద్రీకరించకపోగా కరోనాకు ముందు ఖాళీపోస్టులు సబ్జెక్టు టీచర్ల స్థానంలో, పనిచేస్తున్న 20వేల విద్యావాలంటీర్లను పునర్నియామకం చేయలేదు. కరోనా సమయంలో పెరిగి మళ్ళీ తగ్గిన నమోదును పరిశీలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెరగడంపట్ల ప్రభుత్వానికి శ్రద్ధ చూపడంలేదేమోననే సందేహం కలగడం సహజం. తగినంతమంది టీచర్లు లేకపోవడం, మౌలిక వసతుల లేమి లాంటి కారణాలు ఎన్‌రోల్‌మెంటు తగ్గడానికి కారణమవుతున్నాయి. ఎన్‌రోల్‌మెంటు సమస్య విద్యా ప్రమాణాల సంక్షోభానికి కారణమవుతున్నది. గత విద్యాసంవత్సరం ఎన్‌రోల్ మెంటును గమనిస్తే మొత్తం 18235 ప్రాథమిక పాఠశాలలో 1290 ప్రాథమిక పాఠశాలల్లో సున్నా ఎన్‌రోల్‌మెంటు నమోదైంది. 10మంది వరకు విద్యార్థులున్న పాఠశాలలు 1415 ఉండగా 20వరకు విద్యార్థులున్న పాఠశాలలు 4031 ఉన్నాయి. 100మందికి పైబడి విద్యార్థులున్న పాఠశాలలు 2,500 ఉన్నాయి. తక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలల్లో ఇద్దరు, ముగ్గురు టీచర్లు సరిపోతారనుకున్నా బోధన మాత్రం ఐదు తరగతులకు, అన్ని సబ్జెక్టులకు జరగాల్సిందే కదా! మొత్తం ప్రాథమిక పాఠశాలల్లో 1686ప్రాథమిక పాఠశాలలకు మాత్రమే తరగతికొక్క ఉపాధ్యాయుని చొప్పున ఐదుగురు ఉన్నారు. ఇక ఉన్నత పాఠశాలల విషయానికొస్తే 100 అంతకు తక్కువ విద్యార్థులున్న పాఠశాలలు 1500 దాకా ఉన్నాయి. 800 ఉన్నత పాఠశాలల్లో 300కు మించి విద్యార్థులున్నారు. ఇందులో వేయికిపైగా విద్యార్థులున్న పాఠశాలలున్నాయి. వీటిలో ఫిజికల్ డైరెక్టర్, ఆర్ట్స్, డ్రాయింగ్, క్రాఫ్ట్ పోస్టులు మచ్చుకు కూడా కానరావు. ఈ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య అందించాలంటే సరిపడా సబ్జెక్టు టీచర్లు, వసతులు ఉండాలి. అప్పుడే ఈ విద్యార్థుల సంఖ్య కూడా పెరుగుతుంది. నాలుగున్నర వేలకుపైగా ఉన్న మొత్తం ఉన్నత పాఠశాలల్లో రెండున్నర వేల పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల పోస్టులు పదోన్నతులులేని కారణంగా ఖాళీగా ఉన్నాయి. మరో 300కుపైగా పాఠశాలలకు పోస్టులు మంజూరు చేయాల్సి ఉన్నది. ఎయిడెడ్ ఉన్నత పాఠశాలల్లో నియామకాల ప్రక్రియ లేనందువలన మూతపడుతున్నవి.

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

ప్రభుత్వ పాఠశాలల మౌలిక స్థితిగతులను సంపూర్ణంగా మార్చి అభివృద్ధి చేసే ఉద్దేశంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం ప్రారంభంలో ప్రకటించిన మన



ఊరు-మనబడి, మన బస్తీ-మన బడి కార్యక్రమం స్వాగతించదగిందే. నిర్ణీతకాల వ్యవధిలో పాఠశాలలకు సంబంధించి ఈ పనులన్నీ పూర్తయ్యేవిధంగా ప్రభుత్వం చర్యతీసుకోవడం అత్యంత ఆవశ్యం. ప్రభుత్వం చిత్త శుద్ధితో ఇవన్నీ అమలు చేసినప్పుడు ఉపాధ్యాయులు, సంఘాలు తప్పని సరిగా సానుకూల దృక్పథంతోనే వాటిని వినియోగించుకుంటారు. ఎటొచ్చీ ఇది ప్రచార కార్యక్రమంగా ఉండకూడదనేదే ఉపాధ్యాయుల ఆలోచన. అలాగే ముఖ్యమైన అంశం ఏంటంటే బోధనలో ఉపాధ్యాయునితోపాటు పాఠ్యపుస్తకాలు కీలకం. ఇవి సకాలంలో విద్యార్థికి అందాలి. గత విద్యాసంవత్సరం రెండు నెలల ఆలస్యం మూలంగా రకరకాల కార్యక్రమాలు సృష్టించి నెట్టుకొచ్చిన పరిస్థితిని చూశాం. ఈ విద్యాసంవత్సరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు ఉచితంగా

> కరోనా తదనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంటు గణనీయంగా పెరిగింది. పెరిగిన విద్యార్థుల సంఖ్యకనుగుణంగా బోధనా సిబ్బందిని, బోధనా సౌకర్యాలకు సంబంధించి సానుకూల సత్వరచర్యలు తీసుకున్నట్లైతే ఎన్‌రోల్‌మెంట్‌ను నిలుపుకోగలిగే అవకాశం ఉండేది. కానీ పెంచాల్సిన ప్రభుత్వం ఆవైపు దృష్టి కేంద్రీకరించకపోగా కరోనాకు ముందు ఖాళీపోస్టులు సబ్జెక్టు టీచర్ల స్థానంలో, పనిచేస్తున్న 20వేల విద్యావాలంటీర్లను పునర్నియామకం చేయలేదు. కరోనా సమయంలో పెరిగి మళ్ళీ తగ్గిన నమోదును పరిశీలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెరగడంపట్ల ప్రభుత్వానికి శ్రద్ధ చూపడంలేదేమోననే సందేహం కలగడం సహజం.

అందజేస్తామన్న ప్రభుత్వం నిర్ణయం అభినందనీయం. వీటితోపాటు ఏకరూప దుస్తులు సకాలంలో విద్యార్థులకు అందేవిధంగా తగు ఏర్పాట్లు చేయాలి. విద్యార్థులకు పౌష్టికరమైన ఆహారం చాలా ప్రధానం మధ్యాహ్న భోజనం మరింత పౌష్టికరమైన ఆహారంగా ఉండేందుకు అవసరమైన నిధులను పెంచాలి. దీంతో ప్రభుత్వ పాఠశాల లన్నింటిలో అల్పాహారం అందించాలి. పేద విద్యార్థు లందరూ బడికి వచ్చేవిధంగా ఈ చర్యలు తోడ్పడతాయి. డ్రాప్ అవుట్స్ సమస్య గణనీయంగా తగ్గుతుంది.

ఉన్నతవిద్యపై దృష్టి అవసరం

కేజీ టు పీజీ అమలులో భాగంగా ఏర్పాటు చేశామంటున్న గురుకులాల సంఖ్యను పెంచడంతోపాటు ఆ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు పూర్తిస్థాయి వేతనాలు చెల్లించాలి. విద్యారంగంలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, చుట్టం టీచర్ లాంటివి శోభనిచ్చే పదాలు కావు. శాస్త్ర, సాంకేతిక రంగం కొత్తపుంతలు తొక్కుతున్న క్రమంలో, సమాజం లోని సమకాలీన పరిణామాలలో ఉన్నత విద్యారంగానిది కీలకపాత్ర. నూతన ఆవిష్కరణ లకు విశ్వవిద్యాలయాలు నిలయాలుగా మారాలి. సమాజపరిణామ క్రమానికి దిశానిర్దేశం చేసే ఆలోచనా స్రవంతికి పుట్టి నిల్లుగా ఉండాలి. అందుకు నిరంతర అధ్యయన, పరిశోధనల కవసరమైన ఏర్పాట్లు అధ్యాపకులు విశ్వ విద్యాలయాల కవసరం. కానీ నేడు దశబ్దాల తరబడి ప్రొఫెసర్లు, లెక్చరర్ల ఖాళీలతో జూనియర్, డిగ్రీ కళాశాలలు, విశ్వవిద్యాలయాలు వెలవెల పోతున్నాయి. కాంట్రాక్టు లెక్చరర్లతో కాలం గడుస్తున్నది. రాష్ట్ర వ్యాప్తంగా 5వేల ప్రొఫెసర్లు ఇతర సిబ్బంది ఖాళీలున్నాయంటే ఉన్నత విద్యలో ఉన్నతాన్నేమని అర్థం చేసుకోగలం. నియామకాల నోటిఫికేషన్‌లకు ఆటంకాలున్నాయని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నది. ఆ ఆటంకాల వెనుకున్న సూత్రధారుల ఆటలు కట్టించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలి. దానికేమాత్రం వెరవరాదు. విద్యారంగంతోపాటు ప్రభుత్వం నిర్మాణాత్మక విమర్శగా స్వీకరించి పరిష్కార కార్యాచరణను ప్రకటించాలి. అందుకోసం మరో ఉద్యమానికి సైతం పూనుకోవాలి. కావలసిందల్లా విద్యా రంగంపట్ల, పేద ప్రజల చదువులపట్ల చిత్తశుద్ధి. తద్వారా విద్యా భిమానులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, యువ కులందరూ ఒక్కే లక్ష్యంతో భవిష్యత్తుకు బాటలు వేసే విద్యారంగాన్ని కాపాడుకోవడం కష్టమైన పనేమి కాదు. ఇదే దశాబ్ది ఉత్సవాల లక్ష్యం కావాలి.

సెల్:9440064276



'చే' అంటే... ప్రశ్నించడమే...

ప్రపంచ మానవాళి విముక్తి కోసం... భౌగోళిక సరిహద్దులతో సంబంధంలేకుండా... అమెరికన్ సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా... ఆఖరి క్షణం వరకూ పోరాడిన ధీరుడు, కోట్లాది మంది యువత గుండెల్లో నిలిచిన గెరిల్లా యోధుడు చే గువేరా. చే... అంటేనే ఒక గెరిల్లా విప్లవకారుడు, మనసున్న డాక్టర్, మహాకవి, గొప్ప రచయిత, ప్రాణం ఇచ్చే స్నేహితుడు, మిలటరీ వ్యూహకర్త, క్యూబా విముక్తి యోధుడు, చదరంగంలో గ్రాండ్ మాస్టర్, అన్నింటికీ మించి అమెరికా సామ్రాజ్యవాదులకు సింహస్వప్నం. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో కోణాలు చేగువేరాలో చూడవచ్చు. ఆయన జీవితం నేటి యువతరానికి ఆదర్శం.

చేగువేరా అర్జెంటీనాలోని రోసారియోలో 1928 జూన్ 14న ఎర్నెస్టో గువేరా లించ్, సెలియా దంపతులకు జన్మించాడు. బ్యూనస్ అఫ్ ఎయిర్స్ విశ్వవిద్యాలయంలో వైద్యశాస్త్రంలో పట్టభద్రుడయ్యాడు. 1949లోనే అర్జెంటీనాలో ఒంటరిగా, తర్వాత 1952లో మిత్రుడు ఆల్బర్ట్ గ్రినిడాతో కలిసి లాటిన్ అమెరికా మొత్తాన్ని మోటారు బైక్ యాత్ర ద్వారా చుట్టేశాడు. అప్పుడే అమెరికన్ సామ్రాజ్యవాద కంపెనీలు ప్రజలను ఎలా దోచుకుంటున్నాయో చేగువేరాకు అర్థమైంది. ఈ దోపిడీని అరికట్టాలని, పేద ప్రజలకు అండగా నిలబడాలని మోటారు సైకిల్ యాత్రలోనే ఒక నిర్ణయానికి వచ్చాడు. వైద్యుడిగా కొంతమంది రోగులకు వైద్యం చేసే బదులు సమాజానికి పట్టిన అత్యంత ప్రమాదకరమైన జబ్బును వదిలించాలనుకున్నాడు. ఇదే సమయంలో గ్వాటెమాలా దేశంలో జాకెబ్ ఆర్బెంజ్ ప్రభుత్వం ప్రజలకు అనుకూల నిర్ణయాలు తీసుకుందని అమెరికన్ సామ్రాజ్యవాదులు సీఐఏ కుట్ర ద్వారా ప్రభుత్వాన్ని కూల్చడాన్ని ప్రత్యక్షంగా చూశారు. అక్కడినుండి మెక్సికో చేరుకున్నారు 1955లో ఒక రాత్రి వేళ క్యూబాలో బాటిస్టా నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న విప్లవ సారథి ఫైడెల్ క్యాస్ట్రోతో కలిసి నడవాలని నిర్ణయించుకున్నాడు. ముందు డాక్టర్‌గా సాయుధదళంలో చేరాడు. 1956లో క్యాస్ట్రో రూపొందించిన సాయుధ తిరుగుబాటు పథకాన్ని అమలు చేయడానికి గ్రాన్మా అనే పడవలో చేగువేరాతో సహ 81మందితో గెరిల్లా పోరాటానికి క్యూబాకు బయలుదేరారు. గెరిల్లా పోరాటం సందర్భంగా దళానికి డాక్టర్‌గా బయలుదేరిన చేగువేరా పరిస్థితిని బట్టి ఫైటర్ అయ్యాడు. శత్రువుల వ్యూహాలను పసిగట్టి ఎత్తులకు పైఎత్తులు వేసి శత్రువు సైన్యాన్ని చిత్తుచేశాడు. అనతికాలంలోనే కమాండర్ అయ్యాడు. శాంతక్లారాలో తిరుగుబాటుతో బాటిస్టా ప్రభుత్వానికి చావుదెబ్బ తగిలింది. 1959లో క్యూబాలో విప్లవం విజయవంతమైంది. హవానాలో విజయోత్సవ ర్యాలీలో క్యాస్ట్రోతో కలిసి చే పాల్గొన్నాడు. క్యూబా ప్రభుత్వంలో పారిశ్రామిక విభాగం అధ్యక్షుడిగా, క్యూబా బ్యాంకు అధ్యక్షుడిగా, పారిశ్రామిక మంత్రిగా వివిధ బాధ్యతలు నిర్వహించి తన ప్రత్యేకతను చాటుకున్నాడు. తన లక్ష్యం ఇంతటితో ఆగదని ప్రపంచ దేశాలను విముక్తి చేయాలనే సంకల్పంతో 1965లో క్యూబా వదిలి కాంగో అక్కడ నుంచి టాంజానియా, జెకోస్లోవేకియాలో తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. 1966లో బొలీవియా దేశంలో నాకహుజ్ ప్రాంతాల్లో సాయుధ పోరాటంలో పాల్గొన్నాడు. కంటి మీద కునుకులేని అమెరికా సామ్రాజ్యవాదులు ఎలాగైనా చేగువేరాను చంపాలని, లేకపోతే తమ ఆటలు సాగవని గ్రహించారు. 1967 అక్టోబర్ 9న లా హిగెయెరా పట్టణంలో ఒక చిన్న గదిలో చేగువేరాను బంధించి చంపారు అమెరికన్ సామ్రాజ్యవాదులు. చేగువేరాను భౌతికంగా లేకుండా చేసి చివరకు ఆయన శవాన్ని కూడా దొరకకుండా చేశారు. కానీ ఈ రోజు కోట్లాది యువత గుండెల్లో, ప్రశ్నించే ప్రతి గొంతులో, అన్యాయాన్ని ఎదిరించే ప్రతి పిడికిలిలో చేగువేరా స్ఫూర్తి కనిపిస్తోంది.

కేవలం 39ఏండ్ల వయసులోనే కార్మిక, కష్టజీవుల రాజ్యం కోసం, ఈ దోపిడీ సమాజాన్ని కూల్చేయడం మినహ మరో మార్గం లేదని నమ్మి దాని కోసం తన ప్రాణాలను సైతం బలిపెట్టాడు. అందుకే చేగువేరా అంటే విప్లవం, చేగువేరా అంటే చైతన్యం, చే గువేరా అంటే ప్రశ్నించడం, చేగువేరా అంటే సమానత్వం, చేగువేరా అంటే నియంతృత్వ పాలనకు చరమగీతం. క్యాస్ట్రో మాటల్లో చెప్పాలంటే చేగువేరా ఒక అసాధారణ సామర్థ్యం గల ఒక సేనాని. యుద్ధక్షేత్రంలో ఏ మాత్రం భయపడకుండా దూసుకెళ్లడం చేగువేరా సహజ లక్షణం. 1964లో చేగువేరా తన కూతురికి లేఖ రాస్తూ ఇలా అంటాడు... ప్రపంచంలో ఎక్కడ ఎవరికి అన్యాయం జరిగినా స్పందించగలగాలి. నేడు ఈ మాటే కోట్లాది మంది యువతకు ఆదర్శంగా మారింది. సమాజంలో జరుగుతున్న అన్యాయాన్ని, అణచివేతను యువత ప్రశ్నించాలి, తీవ్రంగా నిరశించాలి. చేగువేరా 95వ జయంతి సందర్భంగా ఆయనకు మనమిచ్చే నివాళి ఇదే.

- జి. రామన్న



ఏ దేశ ప్రజలు గొర్రెల్లా ఉంటారో
ఆ జాతిని చూసి జాలిపడు
ఏ గొర్రెల కాపరులు వారిని తప్పుదారి పట్టిస్తారో
ఆ దేశపు బూటకపు నాయకత్వాన్ని చూసి జాలిపడు

ఏ దేశ మేధావులు నోరు విప్పరో
ఏ సద్గుణ సంపన్నులు గాలి కబుర్లతో
గాలితో యుద్ధాలు చేస్తుంటరో
వారినందరినీ చూసి జాలిపడు
అవసరమైనప్పుడైనా గొంతెత్తలేని
జాతి జనుల చూసి జాలిపడు
దాడులు చేసే వారిని పొగడుతూ ఉండడం
హింసిస్తూ, ప్రపంచాన్ని బలవంతంగా
పాలించాలనుకునే అంబోతుల్ని - హీరోలనుకుని,
భజనలు చేస్తున్న భక్తుల్ని చూసి జాలిపడు -
తమ భాష తమదే తప్ప,
మరో భాష అర్థం చేసుకోలేని
అవివేకులను చూసి జాలిపడు

తమ సంస్కృతీ సంప్రదాయాలు తమవే తప్ప,
ఇంకా వేరేవి కూడా ఉంటాయని
తెలుసుకోలేని మూర్ఖుల్ని చూసి జాలిపడు
డబ్బే ఊపిరిగా బతికే వారిని చూసి జాలిపడు
బాగా మెక్కి నిద్రిస్తున్న వారిని ఇంకా నిద్రబుచ్చుతున్న
కాపాలాదారుల కపటత్వాన్ని చూసి జాలిపడు
హక్కుల్ని, బాధ్యతల్ని గాలికొదిలేసే దేశప్రజల్నీ..
వారి దేశాన్నీ... చూసి జాలిపడు!

తమ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కొట్టుకుపోతున్నా,
మిన్నకుండే వానపాము
ఒమనస్తత్వాన్ని చూసి జాలిపడు.
స్వేచ్ఛాలోచనతో తలెత్తుకు సగర్వంగా బతికిన
ఓ నా ప్రియమైన దేశమా? నువ్విప్పుడు నిరంతరం
కన్నీళ్ళెందుకు కారుస్తున్నావ్?

ఖలీల్ జీబ్రాన్ భావానికి కవితా రూపం ఇచ్చింది:
అమెరికన్ కవి లారెన్స్ ఫెర్‌లిగెట్టి
తెలుగు అనువాదం : డాక్టర్ దేవరాజు మహారాజు

దేశానికి కామ్రేడ్స్ కావాలి...



ఎండీ. షకీలాబేగమ్

"నీ హక్కు కోసం నువ్వు పోరాడాలి. దాన్ని నువ్వు ధైర్యంగా అడగాలి. దానికోసం ఏ కష్టాన్నైనా ఎదిరించాలి. దాన్ని సాధించడం కోసం నువ్వు చేసే ప్రయాణంలో నీకు తోడొచ్చే వాడే కామ్రేడ్!" అంటూ 'డియర్ కామ్రేడ్' సినిమాలో హీరో తాతయ్య వివరిస్తారు. ఈ సినిమాలో హీరోయిన్ ఒక క్రికెట్ క్రీడాకారిణి. క్రికెట్ బోర్డుకు చెందిన అధికారి తనను లైంగికంగా వేధిస్తున్నప్పుడు ప్రతిఘటించిన ఆమెను, ఆమె స్నేహితురాలిని అకాడమీ నుండి బయటకు వెళ్లేలా చేస్తాడు. తనకు ఎంతో ఇష్టమైన క్రికెట్‌కు దూరమై, ఇంత చేసిన అతన్ని ఏమీ అనలేక, బయటకు తెలిస్తే తమ పరువు పోతుందనుకునే తల్లిదండ్రుల నీడన ఉన్న ఆమె డిప్రెషన్‌లోకి వెళు తుంది. తనని అవమానించిన, మానసికంగా హింసించిన, తన భవిష్యత్తునే కాలదన్న చూసిన వాడి నిజస్వరూపం బయటపెట్టిన తర్వాతే ఆమె డిప్రెషన్ నుంచి నిజంగా బయటకొస్తుంది. దీనికి తన వెంట ఉండి నిలబడినవాడే సినిమాలో హీరో కామ్రేడ్.

ఇలాంటి పోలిక ఉన్న కథే నేడు దేశ రాజధానిలో నిజ జీవితంలో జరుగుతున్నది. దేశానికి అంతర్జాతీయ ఖ్యాతిని, అవార్డులను తెచ్చిన మహిళా రెజ్లర్లను... 'భారత కుస్తీ సమాఖ్య' (డబ్ల్యుఎఫ్ఐ) అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నట్లు వారు ఆరోపణ చేశారు. వేధింపులు చేసిన వారిపై కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయకపోవడం, దానికోసం నెలల తరబడి రోడ్లపై నిరసన తెలపాల్సి రావటం, స్వయంగా ప్రధానితో చెప్పినా పట్టించుకోకపోవడం, బాధితులను బెదిరింపులకు గురిచేయడం, సుప్రీంకోర్టు అక్షింతలు వేసిన తర్వాత గానీ నామమాత్రంగా కేసు నమోదు చేయడం, దీనిపై వేసిన కమిటీ పారదర్శకతలేని విచారణ జరిపి నిందితునికి క్లీన్‌చిట్ ఇచ్చేయడం అన్నది మహిళల ప్రాథమిక హక్కులను కాలరాయడం కన్నా మించినదని ఇట్టే అర్థమైపోతుంది. అధికారంలో ఉన్న మహిళా రాజకీయ ప్రతినిధులు కళ్లకు గంతలు కట్టుకున్నట్లు నటించడం, కనీసం స్పందించకుండా పరుగులు తీయడం (కేంద్ర మంత్రి మీనాక్షి లేఖి), క్రీడారంగంలోనే ఉన్న మహిళలు సైతం నిరసన తెలుపుతున్న వారిని తప్పుపట్టడం, ఇంకా తుప్పుపట్టి ఉన్న వ్యవస్థను ప్రతిబింబింపజేస్తుంది.

నిర్భయ ఘోరం జరిగినప్పుడు ఆ సమయంలో ఆమె ఎందుకు బయటకు వెళ్లాలి అనీ, బన్వారీ దేవి (రాజస్థాన్) కేసులో ఎవరికో బాల్య వివాహం చేస్తుంటే ఆమెకేంటని, రెజ్లర్ల విషయంలో అసలు ఆడపిల్లలకు ఇలాంటి ఆటలు ఎందుకని మాట్లాడే వ్యవస్థను పాలకులు ఇంకా ఇంకా కొనసాగించాలనే ఈ రోజు పాలక పార్టీకి



చెందిన ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను తప్పు చేశాడని తెలిసి కూడా వెనకేసుకొస్తోంది. బన్వారీ దేవి కేసులో మొట్ట మొదటిసారిగా... పని ప్రదేశంలో మహిళల భద్రత అనేది వారి ప్రాథమిక హక్కు అని పేర్కొంటూ సుప్రీంకోర్టు మార్గదర్శకాలు ఇచ్చింది. ఆర్టికల్ 14, 15, 19, 21 ప్రకారం లైంగికంగా వేధించడం ప్రాథమిక హక్కుల ఉల్లంఘన అవుతుంది. కానీ రాజ్యాంగ హక్కు కాదు కదా! కనీసం నైతిక విలువలు కానీ మానవీయ కోణం కూడా లేని దృశ్యాలు దేశంలో చోటు చేసుకుంటున్నాయి. కొందరు బలైన తర్వాతే చట్టాలు వచ్చాయి. కానీ ఈ చట్టాల అమలు కోసం మరలా పోరాటం చేయ వలసి వస్తున్నది. ఈ పోరాటంలో అనేకమంది తమ జీవితాలను పణంగా పెట్టాల్సి వస్తోంది. గుజరాత్ అల్లర్లలో బిల్కిస్ బానో కేసులో ఆమె సంవత్సరాల తరబడి పోరాడిన తర్వాత దోషులకు శిక్షపడింది. అయితే ఆ తర్వాత సంస్కారవంతులనే సర్టిఫికెట్‌తో అంత ఘోరం చేసినవారు బయటకు రావడం... హారతులు ఇవ్వడం చూశాం. సినిమాలో చివరకు కథ సుఖాంతం అవుతుంది. కానీ నిజ జీవితంలో ఇది నిజంగా సాధ్యమా? ఆ అధికారి వెనుక ఒక రాజకీయ పార్టీ ఉంటే? ఆ అధికారి వెనుక ధనస్వామ్యం ఉంటే? అధికారి వెనుక ఏకంగా అధికార పార్టీ అండదండ ఉంటే... బాధితురాలికీ, ఆమె కుటుంబానికీ పాట్లు తప్పవని ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావో దారుణ అత్యాచార ఉదంతం తెలియచేస్తోంది. ఇటువంటి అనేక ఇబ్బందులను ఢిల్లీలో రెజ్లర్లు పడుతున్నారు. అయినా కానీ వారి పోరాట స్ఫూర్తి తగ్గలేదు. మే 28న ఒకపక్క పార్లమెంటు భవన ప్రారంభోత్సవం జరుగుతుంటే మరో పక్క పోలీస్ రాజ్యం యథేచ్ఛగా సాగిపోయింది. నూతన పార్లమెంటు భవనానికి మార్చ్‌గా వెళుతున్న రెజ్లర్లపై పోలీసులు పైశాచికంగా దాడిచేశారు. నడిరోడ్డుపై ఈడ్చుకుంటూ వెళ్లి పోలీస్ వాహనంలో ఎత్తిపడేశారు. పోలీస్‌స్టేషన్ల చుట్టూతిప్పారు. సోషల్ మీడియాలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా రెజ్లర్లకు వ్యతిరేకంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్ నెట్‌వర్క్ విషప్రచారం సాగించింది. దీంతో తాము గెలిచిన పతాకాలను గంగలో కలిపేందుకు సిద్ధమయ్యారు రెజ్లర్లు.

దేశవ్యాప్తంగా రైతు, వ్యావసాయ కార్మిక, విద్యార్థి, యువజన, మహిళా సంఘాల మద్దతును రెజ్లర్లు కూడగట్టుకోవడంతో ఈ పోరాటం ప్రజా పోరాటంగా రూపాంతరం చెందింది. ఇది కేవలం మల్ల యోధుల పోరాటం మాత్రమే కాదు. ప్రజాస్వామ్యానికి, ధనస్వామ్యానికి జరుగుతున్న పోరాటం. ఈ పోరాటానికి... స్వాతంత్ర్యోద్యమంలో బ్రిటిష్ వారి ముందు రొమ్ము విరుచుకుని నిలబడిన కామ్రేడ్లు కావాలి. ఎన్ఆర్‌సి లాంటి కుట్ర పూరితమైన పౌర సత్వ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమించిన కామ్రేడ్లు కావాలి. రైతు ఉద్యమంలో దేశ ప్రధాని మెడలు వంచిన కామ్రేడ్లు కావాలి. ఇటువంటి కామ్రేడ్స్ లేకుండా ప్రపంచంలో ఏ హక్కు సాధించలేదు. అందుకే రెజ్లర్లకు న్యాయం జరిగే వరకూ, మహిళలను లైంగిక వస్తువుగా చూసే నీచులకు బుద్ధి చెప్పే వరకు ఈ పోరాటం సాగాలి.

ఇవి ఫ్రిజ్‌లో పెడుతున్నారా..?

ఈ రోజుల్లో ఫ్రిజ్ లేని ఇల్లు ఉండదు. అందులోనూ వేసవి కాలం అయితే మంచినీటి దగ్గర నుంచి తినే పదార్థాల వరకు అందులో పెట్టాల్సిందే. కొన్ని వస్తువులకు ఫ్రిజ్ అవసరమే. అయితే కొన్ని ఆహార పదార్థాలు మాత్రం ఫ్రిజ్‌లో పెడితే విషతుల్యం అవుతాయి. అవేంటో తెలుసుకుందాం...

పుచ్చకాయ : వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం పుచ్చకాయ తింటుంటాం. అవసరాన్ని బట్టి ఒకేసారి రెండు మూడు ఇంటికి తీసుకువస్తూ ఉంటాం. అయితే కోయని పుచ్చకాయల్ని ఫ్రిజ్‌లో పెట్టవచ్చు. కానీ కోసిన తర్వాత వాటిని డైరెక్ట్‌గా ఓపెన్‌గా ఫ్రిజ్‌లో పెట్టకూడదు. ఒక వేళ చల్లదనం కోసం పెట్టాలనుకుంటే ఏదైనా మూత ఉన్న బాక్స్‌లో పెట్టి పెట్టుకోవచ్చు.



ఉల్లిగడ్డలు : వంట చేసేపుడు కొన్ని సందర్భాలలో అవసరానికి మించి ఉల్లిగడ్డలు కట్ చేస్తుంటాం. వాటిని మళ్ళీ ఉపయోగించవచ్చని ఫ్రిజ్‌లో దాస్తాం. ఇలా చేయడం వల్ల ఫ్రిజ్‌లో ఉండే ఇతర ఆహార పదార్థాలు చెడిపోతాయి. అందువల్ల తరిగిన ఉల్లిగడ్డలను ఫ్రిజ్‌లో పెట్టకపోవడమే ఉత్తమం.

ఆలూ : చల్లటి ప్రదేశంలో లేదా ఫ్రిజ్‌లో ఉంచడం వల్ల ఆలుగడ్డలో ఉండే చెక్కర శాతం పెరుగుతుంది. దీని వల్ల కూర రుచి మారుతుంది.

తేనె : ఎన్ని ఏండ్లయినా చెడిపోని ఆహార పదార్థం తేనె. దీనిని ఫ్రిజ్‌లో పెట్టడం వల్ల రుచి మారుతుంది.

అరటి పండ్లు : అరటి పండ్లలో ఎంజైమ్స్ ఉంటాయి. వీటిని ఫ్రిజ్‌లో ఉంచితే ఈ ఎంజైమ్స్ తగ్గిపోతాయి. దీనితో అరటి పండ్లు త్వరగా చెడిపోయే అవకాశం ఉంటుంది.

పువ్వులు : పువ్వుల వాసన వల్ల ఫ్రిజ్‌లో ఉండే ఇతర ఆహార పదార్థాలకు ఆ వాసన పడుతుంది. ఫలితంగా వాటిని తినలేం.

పచ్చళ్ళు : కాలానికి తగ్గట్లు పచ్చళ్ళు పెడుతూనే ఉంటారు. ఇవి చెడి పోకుండా ఉండటానికి కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి కానీ వాటిని ఫ్రిజ్‌లో పెట్టడం వల్ల చల్లదనానికి త్వరగా చెడిపోయే అవకాశం ఉంటుంది.

బ్రెడ్ : బ్రెడ్ పాకెట్ ఓపెన్ చేసి తిన్నాక మిగిలినది తాజాగా ఉండాలని ఫ్రిజ్‌లో పెడుతుంటారు. ఓపెన్ చేసి పెట్టడం వల్ల బ్రెడ్ గట్టి పడిపోతుంది. అందువల్ల కవర్ మూసి పెట్టాలి.

డార్క్ స్పాట్స్‌కు బార్లీ...

బార్లీ కాస్త వగరుగా, కాస్త తియ్యగా ఉండి చలువ చేసే స్వభావాన్ని కలిగి ఉంటాయి. వేసవి వచ్చిందంటే బార్లీ గింజలను విరివిగా వాడుతుంటారు. ఇవి బరువు తగ్గించడంలో, బ్లడ్ షుగర్ లెవల్స్‌ను కంట్రోల్ చేయడంలో ఉపయోగపడతాయి. అలసట, నీరసం వంటి సమస్యలను దూరం చేస్తాయి. కిడ్నీలో రాళ్లను కరిగించడంలోనూ వీటి పాత్ర కీలకం. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక విధాలుగా బార్లీ గింజలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అయితే వీటిని ఆరోగ్యంతో పాటు చర్మ సంరక్షణకు కూడా ఉపయోగించ వచ్చుట. ముఖ్యంగా డార్క్ స్పాట్స్‌ను తగ్గించడంలో ఇవి చాలా ఎఫెక్ట్‌గా పని చేస్తాయుట. మరి వాటిని చర్మ సంరక్షణకు ఎలా ఉపయోగించాలో తెలుసుకుందామా...




- బార్లీ గింజలను పొడి చేసుకుని, అందులో ఓట్స్ పొడి, రోజ్ వాటర్ వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని డార్క్ స్పాట్స్ ఉన్న చోట అప్లై చేసి ఇరవై నిమిషాల పాటు ఆరనివ్వాలి. అనంతరం చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా రెగ్యులర్‌గా చేస్తే డార్క్ స్పాట్స్ క్రమంగా తగ్గిపోతాయి.
- ఒక బౌల్‌లో బార్లీ గింజల పొడి, కొద్దిగా నిమ్మ రసం వేసి కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి పావు గంట పాటు ఆరనివ్వాలి. తర్వాత గోరు వెచ్చని నీటితో శుభ్రంగా రుద్దుతూ కడిగేసుకోవాలి. ఇలా చేయడం వల్ల డార్క్ స్పాట్స్‌తో పాటు చర్మంపై మృతకణాలు కూడా తొలగిపోయి, ముఖం అందంగా మారుతుంది.
- బార్లీ గింజలను నీటిలో వేసి నానబెట్టుకుని పేస్ట్ చేసుకోవాలి. ఈ పేస్ట్‌లో కొద్దిగా తేనె వేసి కలిపి ముఖానికి పట్టించాలి. బాగా ఆరిన తర్వాత కొద్దిగా నీళ్ల చల్లి వేళ్లతో స్క్రబ్ చేసుకుంటూ శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల డార్క్ స్పాట్స్ తొలగిపోయి ముఖం కాంతివంతమవుతుంది.



ఓట్స్ వాడకం ఈ మధ్యకాలంలో బాగా పెరిగిపోయింది. ఒకప్పుడు అధిక బరువు తగ్గాలనుకునే వారు మాత్రమే ఓట్స్‌ను ఉపయోగించే వారు. ఇప్పుడు రోజువారీ ఆహారంలో భాగమయ్యాయి. బరువుతో నిమిత్తం లేకుండా ప్రతీ ఒక్కరూ ఓట్స్‌తో చేసిన వంటకాలను ఇష్టపడుతున్నారు. ఉప్మా ఇడ్లీలాంటివే కాకుండా చిన్న చిన్న మార్పులతో వెరైటీగా చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. అవేంటో మనమూ ఓ సారి ప్రయత్నిద్దాం...

ఓట్స్‌తో వెరైటీగా...

పుంగనాలు



కావాల్సిన పదార్థాలు : ఓట్స్ - కప్పు, నీళ్ళు - ఒకటిన్నర కప్పు, చిన్నగా తరిగిన ఉల్లిగడ్డ - పావు కప్పు, పచ్చిమిర్చి - ఒకటి (సన్నగా తరిగినది), అల్లం - అంగుళం ముక్క (సన్నగా తరిగి పెట్టుకోవాలి), క్యారెట్ - ఒకటి (తురిమి పెట్టుకోవాలి), ఉడికించిన పచ్చి బఠానీలు - అర కప్పు, క్యాబేజి - పావు కప్పు (సన్నగా తరిగి పెట్టుకోవాలి), జీలకర్ర - అర టీ స్పూన్, ఉప్పు - రుచికి సరిపడా, తరిగిన కొత్తిమీర - కొద్దిగా, నెయ్యి - కొద్దిగా

తయారుచేసే విధానం : ఒక గిన్నెలోకి ఓట్స్ తీసుకుని కప్పున్నర నీళ్ళు పోసి అరగంట పాటు నానబెట్టాలి. నానిన ఓట్స్‌ను నీళ్ళతోపాటు మిక్సి జార్‌లోకి తీసుకుని కొంచెం పలుకులుగా గ్రైండ్ చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని గిన్నెలోకి మార్చుకుని అందులో తగిరిన ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి, అల్లం ముక్కలు, క్యారెట్ తురుము, బఠానీలు, క్యాబెజీ తురుము, అర టీస్పూన్ జీలకర్ర, పసుపు, కొత్తిమీర, ఉప్పు, బియ్యం పిండి అన్ని వేసి బాగా కలపాలి. గుంతపుంగనాల గిన్నె తీసుకుని స్టవ్ మీద పెట్టి కాస్త వేడయ్యాక ఆయిల్ లేదా నెయ్యి రాసి ఈ మిశ్రమాన్ని ఆ గుంతల్లో వేసుకుని మీడియం మంట మీద కనీసం మూడు నుంచి ఐదు నిమిషాలు కాలాక తీసుకుంటే సరి. కమ్మని ఓట్స్ గుంతపుంగనాలు రెడీ.

ఇడ్లీ



కావాల్సిన పదార్థాలు : ఓట్స్- రెండు కప్పులు, పుల్లని పెరుగు - రెండు కప్పులు, ఆవాలు- టీస్పూన్, మినప్పప్పు - టేబుల్ స్పూన్, సెనగపప్పు- అర టేబుల్‌స్పూన్, నూనె- అరటీస్పూన్, పచ్చిమిర్చి - రెండు (సన్నగా తరగాలి), క్యారెట్ తురుము-రెండు టేబుల్ స్పూన్లు, కొత్తిమీర తురుము- టేబుల్ స్పూన్, పసుపు- చిటికెడు, ఉప్పు - తగినంత.

తయారుచేసే విధానం : మొదట బాణలిలో ఓట్స్ వేసి కాస్త రంగు మారే వరకూ సన్నని మంట మీద వేయించాలి. తర్వాత మిక్సీలో వేసి పొడిలా చేయాలి. తర్వాత చిన్న కడాయిలో నూనె పోసి వేడయ్యాక ఆవాలు, మినప్పప్పు, సెనగపప్పు వేసి వేయించాలి. కొద్దిసేపటి తర్వాత పచ్చిమిర్చి, కొత్తిమీర తురుము, క్యారెట్ తురుము, పసుపు వేసి ఓ నిమిషం వేగాక దించి ఓట్స్ పొడిలో కలపాలి. అందులోనే కొద్దిగా పెరుగు, తగినంత ఉప్పు వేసి కలిపి ఇడ్లీ పిండి మిశ్రమంలా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని నెయ్యి రాసిన ఇడ్లీ ప్లేటుల్లో వేసి సుమారు 15 నిమిషాలు ఉడికించి దించాలి. అంతే వేడివేడి ఓట్స్ ఇడ్లీ రెడీ అయినట్టే.

ఉప్మా



కావాల్సిన పదార్థాలు : ఓట్స్ - రెండు కప్పులు, మినప్పప్పు- టేబుల్ స్పూన్, శనగపప్పు - రెండు టీ స్పూన్లు, అల్లం ముక్కలు - ఒక టీ స్పూన్, కరివేపాకు - కొద్దిగా, ఇంగువ - చిటికెడు, ఆవాలు - ఒక టీ స్పూన్, పచ్చి మిర్చి - మూడు, ఎండు మిర్చి - రెండు, ఉల్లిగడ్డ - ఒకటి, నూనె - ఒక టీస్పూన్, నీరు - నాలుగున్నర కప్పులు, ఉప్పు - తగినంత

తయారుచేసే విధానం : పాన్‌లో మూడు నిమిషాల పాటు ఓట్స్ వేయించి పక్కన పెట్టుకోవాలి. తర్వాత అదే పాన్‌లో కొద్దిగా నూనె వేడిచేసి, మినప్పప్పు, శనగపప్పు, ఆవాలు, పచ్చిమిర్చి ముక్కలు, ఎండు మిర్చి వేసి వేగనివ్వాలి. ఉల్లిగడ్డ, అల్లం ముక్కలు, కరివేపాకు కూడా వేసి వేయించాలి. తర్వాత ఇంగువ, ఉప్పు కలిపి నీరు పోసి మరిగించాలి. ఓట్స్ వేసి, నీరంతా పీల్చేదాకా సన్నని సెగపై ఉడికించాలి. అంతే రుచికర ఓట్స్ ఉప్మా రెడీ. షుగర్‌తో బాధపడే వారికి ఇది మంచి ఆహారం.

ఖీర్



కావాల్సిన పదార్థాలు : ఓట్స్ - పావు కేజీ, గ్రాములు, పంచదార - రెండు టేబుల్ స్పూన్‌లు, ఆపిల్ - ఒకటి, తేనె - యాభై గ్రాములు, కాజు, బాదం పలుకులు - ఇరవై ఐదు గ్రాములు, పాలు - అర లీటరు, నెయ్యి - టేబుల్ స్పూన్, యాలకుల పొడి - చిటికెడు

తయారుచేసే విధానం : ఒక పాన్‌లో నెయ్యి వేసి అందులో ఓట్స్ కూడా వేసి సన్నని మంట మీద కొద్దిగా వేయించాలి. చాల్లారాక మిక్సి జార్‌లో వేసి పొడి చేసుకోవాలి. స్టవ్ మీద పాత్ర పెట్టి పాలు బాగా మరగ నివ్వాలి. అందులో ఈ ఓట్స్ మిశ్రమం వేసి తిప్పుతూ ఉండాలి. ఆపిల్‌ను చిన్న ముక్కలుగా కట్ చేసుకుని అందులో వేసి కలపాలి. మిశ్రమం మొత్తాన్ని బాగా కలియ తిప్పుతూ పంచదార, తేనె వేయాలి. పంచదార అందులో కలిసి పోయాక బాదం, జీడిపప్పు పలుకులు, యాలకుల పొడి వేసి బాగా కలపాలి. స్టవ్ ఆఫ్ చేసి దించి కాస్త చల్లారాక సర్వ్ చేసుకుంటే సరి. ఈ ఖీర్ చాలా వెరైటీ రుచితో మళ్ళీ తినాలనిపిస్తుంది.

ఊతప్పం



కావాల్సిన పదార్థాలు : ఓట్స్- రెండు కప్పులు, సేమియా- కప్పు, పెరుగు- రెండు కప్పులు, ఉల్లిగడ్డ - రెండు, పచ్చిమిర్చి- నాలుగు, కొత్తిమీర - కొంచెం, టమాటా- ఒకటి, ఉప్పు - తగినంత, నూనె - కొంచెం,

తయారుచేసే విధానం : ఓట్స్‌ను పెరుగులో, నీళ్లలో సేమియాను నానబెట్టాలి. రెండు గంటలయ్యాక సేమియాలో నీళ్లు వంపేసి, ఓట్స్‌లో కలపాలి. పచ్చిమిర్చి, ఉల్లిగడ్డలు, టమాటాలను సన్నగా తరిగి ఓట్స్ మిశ్రమంలో కలపాలి. అందులోనే కొత్తిమీర, కొద్దిగా ఉప్పు వేసి కలియ తిప్పాలి. గట్టిగా ఉంటే కొన్ని నీళ్లు చేర్చి కలపాలి. తర్వాత పొయ్యి మీద పెనం పెట్టాలి. వేడయ్యాక మిశ్రమాన్ని ఊతప్పంలా మందంగా వేసి నూనెతో రెండు వైపులా కాల్చాలి. పోషకాలు మిళితమైన వేడి వేడి ఓట్స్ ఊతప్పాన్ని కొబ్బరి పచ్చడితో తింటే రుచిగా ఉంటుంది.

హస్తం వైపు రాజగోపాల్‌రెడ్డి చూపు

(మొదటిపేజి తరువాయి)

చేసుకున్నా...లోపల అంతా కలిసే ఉంటున్నారు. అందుకే లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవిత అరెస్టు కాలేదు. దీనికి బీజేపీ సహకారం పూర్తిగా ఉంది' అంటూ తన అనుయాయులతో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి బాహాటంగానే చర్చిస్తున్నారు. తెలంగాణలో బీజేపీకి అవకాశం లేదని తన అనుచరుల వద్ద తేల్చిచెపుతున్నారు. ఈ విషయం ఇప్పుడే కాదు...మునుగోడు ఉప ఎన్నికల్లోనూ తేలిపోయిందని చెబుతున్నారు.

మునుగోడులో పావుగా వాడుకుందనే ఆవేదన

మునుగోడు ఉప ఎన్నిక ద్వారా రాష్ట్రంలో చక్రం తిప్పాలనే భావనతో బీజేపీ తనను పావుగా వాడుకుందని సన్నిహితుల వద్ద ఆవేదన చెందినట్టు తెలిసింది. అంతేకాకుండా మునుగోడుకు చెందిన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, బండి సంజయ్ వెన్నంటి ఉండే జి మనోహర్‌రెడ్డి కూడా తన ఓటమికి కారణమయ్యారనే కోపం రాజగోపాల్‌రెడ్డిని వెంటాడుతున్నది. పాత బీజేపీ శ్రేణులు అక్కడ రాజగోపాల్‌రెడ్డికి వ్యతిరేకంగా పని చేశారనే ప్రచారముంది. మరోవైపు బీజేపీలో ఇటీవల గ్రూపుల పోరు తీవ్రమైంది. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలో ఆయన కమలం పార్టీని వీడిని హస్తం గూటికి చేరాలనే నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది.

అక్కడే ఉంటే గెలుపు అంత ఈజీ కాదు

ప్రస్తుత రాజకీయ పరిణామాల్లో కాంగ్రెస్ పార్టీ కర్నాటక రాష్ట్రంలో తిరుగులేని విజయం సాధించడంతో తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి ఊపొచ్చింది. రాజగోపాల్‌రెడ్డి సొంత అన్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కాంగ్రెస్‌లోనే ఉన్నారు. రాజగోపాల్‌రెడ్డి కూడా కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా, ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా సుదీర్ఘ కాలం పనిచేశారు. అంతేకాకుండా రానున్న ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేస్తే మునుగోడులో గెలుపు అంత ఈజీగా కాదనేది తేలిపోయింది. దీంతో ఆయన సొంత గూటికి రావాలని నిర్ణయించుకున్నట్టు బలంగా వినిపిస్తున్నది.

కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ నేతలు నోముల, శ్రీహరిరావు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సికింద్రాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నోముల ప్రకాష్ గౌడ్, నిర్మల్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నేత శ్రీహరి రావు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో రేవంత్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకాష్ గౌడ్ సేవలను ఉపయోగించుకుని వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. గ్రేటర్‌లో సెల్ఫీలు దిగే వారు, సెల్ఫ్ డబ్బాలు కొట్టుకునేవారు ఎక్కువయ్యారు అని బీఆర్ఎస్ నాయకులను ఎద్దేవా చేశారు. కేటీఆర్, దానం నాగేందర్ ను సూటిగా ప్రశ్నిస్తున్నా.. గ్రేటర్ లో మెట్రో నిర్మించింది కాంగ్రెస్ కాదా? అని ప్రశ్నించారు. కచ్చితంగా నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కొడంగల్‌లో గెలవడం ఎంత ముఖ్యమో నిర్మల్ నియోజకవర్గంలో గెలవడం అంతే ప్రాధాన్యతగా తీసుకుంటామన్నారు. రాబోయే ఎన్నికల్లో కేసీఆర్ కుటుంబానికి, ప్రజలకు మధ్య యుద్ధం జరగబోతోందన్నారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజలు బీఆర్ఎస్ పార్టీని బండకేసి కొడతారని రేవంత్‌రెడ్డి విమర్శించారు.

సిగ్గనిపించడం లేదా కేసీఆర్? రేవంత్ ట్వీట్

రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) బాధిత రైతులకు బేడీలు వేసి భువనగిరి కోర్టుకు తీసుకొచ్చిన ఘటనపై రేవంత్‌రెడ్డి ట్విటర్ వేదికగా స్పందించారు. 'ఆడబిడ్డలపై అకృత్యాలు చేసే దుర్మార్గులపై చర్యలు ఉండవు. మత్తు పదార్థాల మాఫియాకు శిక్షలు ఉండవు. భూ కబ్జాలు చేసే బీఆర్ఎస్ గద్దలపై కేసులు ఉండవు. తన రక్తాన్ని చెమటగా మార్చి బుక్కెడు బువ్వ పెట్టే రైతు చేతికి సంకెళ్లా? సిగ్గనిపించడం లేదా కేసీఆర్'. అని రేవంత్ ప్రశ్నించారు.

కాంగ్రెస్‌లో పొంగులేటి చేరిక ఖాయం : మాజీ ఎంపీ వి హనుమంతరావు



మాజీ ఎంపీ, బీఆర్ఎస్ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్‌లో పార్టీలో చేరుతారని మాజీ ఎంపీ వి హనుమంతరావు వెల్లడించారు. ఎలాంటి షరతులు లేకుండా చేరుతున్నారని తెలిపారు. అన్ని సీట్లు పొంగులేటి వర్గానికి అనేది అవాస్తవమని పేర్కొన్నారు. ఈ వ్యవహారాలను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చూసుకుంటారని వివరించారు.

ఢిల్లీకి పాలు, నీళ్లు నిలిపేస్తాం

(మొదటిపేజి తరువాయి)

రైతులు దిగ్బంధించారు. ఖాప్ పంచాయతీల బంద్‌కు ప్రతిపక్ష పార్టీలు మద్దతునిచ్చాయి. బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశాయి. బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయకుంటే ఢిల్లీకి పాలు, నీళ్ల సరఫరా నిలిపివేస్తామని ఖాప్ పంచాయతీలు హెచ్చరించాయి. హర్యానా బంద్ తరువాత ఖాప్ పంచాయతీలు ఈ నెల 18న భారత్ బంద్ ప్రకటించాయి. ఇందుకోసం ఇతర రాష్ట్రాల రైతు సంఘాలను సంప్రదించి సన్నాహాలు చేసేందుకు 21 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటుచేశారు. దీనితో పాటు, ఇతర రాష్ట్రాల వ్యాపార బోర్డులు, రాజకీయ పార్టీలు, ఖాప్‌ల ప్రతినిధులతోనూ సంప్రదింపులు జరుపుతున్నారు. బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్ అరెస్టు, రైల్ కారిడార్‌కు పరిహారం, రుణమాఫీ, తదితర అంశాలతో కూడిన 25 అంశాల చార్టర్‌ను రూపొందించారు. ప్రభుత్వంతో చర్చలు జరిపే బాధ్యతనూ ఈ 21 మంది సభ్యుల కమిటీకి అప్పగించారు.

బ్రిజ్ భూషణ్ కుటుంబ సభ్యులెవరూ డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికల్లో పోటీ చేయరు

డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ కుటుంబ సభ్యులు అర్హత ఉన్నప్పటికీ రాబోయే ఫెడరేషన్ ఎన్నికల్లో పోటీ చేయరని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్, నలుగురు వైస్ ప్రెసిడెంట్లు, సెక్రటరీ జనరల్, ట్రెజరర్, ఇద్దరు జాయింట్ సెక్రటరీలు, ఐదుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్ల స్థానాలకు జూలై 6న ఎన్నికలు జరగనున్నాయి.

రాబోయే ఎన్నికలలో బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ కుటుంబ సభ్యులు లేదా అతని సహచరులు పోటీ చేసేందుకు అనుమతించకూడదన్నది క్రీడా మంత్రి అనురాగ్ ఠాకూర్ వద్ద రెజ్లర్లు లేవనెత్తిన డిమాండ్లలో ఒకటి. అందుకు రెజ్లర్లకు కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. సింగ్ కుమారుడు కరణ్ భూషణ్ ఉత్తరప్రదేశ్ రెజ్లింగ్ అసోసియేషన్‌కు నాయకత్వం వహిస్తుండగా, అతని అల్లుడు ఆదిత్య ప్రతాప్ సింగ్ బీహార్ యూనిట్‌కు అధిపతిగా ఉన్నారు. 'ఆయన కుమారుడు కరణ్, అతని అల్లుడు ఆదిత్య డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికలకు నామినేషన్లు వేయకూడదని నిర్ణయించుకున్నారు' అని సింగ్ సన్నిహిత వర్గాలు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో వివాదానికి మరింత ఆజ్యం పోసేలా చేయడం మంచిది కాదని, అయితే కరణ్, ఆదిత్య ఇద్దరూ ఎన్నికలలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని ఆయా వర్గాలు పేర్కొన్నాయి.

మణిపూర్‌లో ఆగని హింస

(మొదటిపేజి తరువాయి)

మైతీ తెగ వారే. వీరంతా స్థానిక వాలంటీర్లని పోలీసులు తెలిపారు. కాంగ్‌కోపీ, తూర్పు ఇంఫాల్ జిల్లాల సరిహద్దులో ఈ గ్రామం ఉంది. గత వారం రోజులుగా ఈ ప్రాంతంలో హింసాత్మక ఘటనలు కొనసాగుతూనే ఉన్నాయి. అక్కడ తమ వారు నివసిస్తున్న ప్రదేశాలను కాపాడుకునేందుకు సమీప ప్రాంతాలకు చెందిన మైతీలు అక్కడికి చేరుకున్నారు. దీంతో రెండు తెగల మధ్య ఘర్షణలు జరిగాయి. గాయపడిన పది మందిని ఆస్పత్రిలో చేర్చగా వారిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. పోలీసుల కథనం ప్రకారం కుకీ తెగకు చెందిన వారు మంగళవారం రాత్రి ఖామెన్‌లాక్‌లో బాంబులు విసిరారు. ఈ ప్రాంతంలోనే కుకీలు, మైతీల మధ్య ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. కాగా ఆ రాష్ట్రమంత్రి ఇంటికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు.

లండన్‌లో హైదరాబాద్ యువతి హత్య

(మొదటిపేజి తరువాయి)

లండన్‌లోని ఓ అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లో నివసిస్తున్న ఆమెపై ఎదురు ఫ్లాట్‌కు చెందిన ఓ బ్రెజిలియన్ కత్తితో దాడి చేశాడు. దాంతో ఆమె మృతి చెందింది. అడ్డువచ్చిన జనగామకు చెందిన అఖిలకు తీవ్రగాయాలు అయ్యాయి. హత్యకు గల కారణాలు తెలియరాలేదు. అయితే నిందితుడు ఆ అపార్ట్‌మెంట్‌లోకి వారం రోజుల క్రితమే వచ్చినట్టు తెలిసింది. కాగా, హత్య విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి కేటీఆర్‌తో ఫోన్‌లో సంప్రదించారు. మృతదేహాన్ని త్వరలోనే స్వగ్రామం తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సత్తు వెంకట రమణా రెడ్డి, తదితరులున్నారు.

ధరణి జీవన్మరణ సమస్య

(మొదటిపేజి తరువాయి)

పునరుద్ఘాటిం చారు. దివాళా తీసిన కంపెనీకి ధరణి పోర్టల్ బాధ్యతను ఎలా అప్పగిస్తారని ప్రశ్నించారు. విదేశీ కంపెనీలకు అప్పగించడం ద్వారా తెలంగాణకు సంబంధించిన సమాచారం విదే శీయుల్లో చేతుల్లోకి పోయిందని చెప్పారు. ధరణి పోర్టల్ లావాదేవీలపై ఫోరెన్సిక్ ఆడిట్ జరగాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్‌ను అసెంబ్లీలో చెట్టుకు ఉరి తీసినా, గల్ఫ్ దేశాల్లో మాదిరిగా రాళ్లతో కొట్టినా తప్పు లేదని చెప్పారు. ఇలాంటి మాటలు అనటానికి తాము ఏ మాత్రం భయపడటం లేదన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలు మల్లు రవి, హర్కర వేణుగోపాల్‌తో కలిసి ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 75 ఏండ్లలో ఏ రాజకీయ పార్టీ, రాజకీయ నాయకుడు కేసీఆర్ మాదిరిగా దోపిడీకి పాల్పడలేదన్నారు. కేసీఆర్, కేటీఆర్ ఇద్దరూ సైబర్ నేరగాళ్ల మాదిరిగా ధరణి పేరుతో తెలంగాణ ప్రజల సొమ్మును దోచుకుంటున్నారని ఆరోపించారు. ధరణి పోర్టల్ వెనకాల దొరలు, రాజులున్నారని చెప్పారు. కేసీఆర్ దోపిడీ, దొంగతనానికి అడ్డు అదుపూ లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరణి దోపిడీపై తొవ్వుతుంటే కొత్త కొత్త విషయాలు బయపడుతున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం దగ్గర ఉండాల్సిన రెవెన్యూ రికార్డులను ధరణి పేరుతో పూర్తిగా ప్రయివేటు కంపెనీ ఐఎల్ అండ్ ఎఫ్ఎస్‌కు కట్టబెట్టారని విమర్శించారు. రాష్ట్రంలో భూలావాదేవీలన్నీ ధరణి పోర్టల్ ద్వారా ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ నిర్వహిస్తున్నదని తెలిపారు. వాస్తవానికి ఆ కంపెనీ దివాళా తీసిందన్నారు. గతంలో రూ.90వేల కోట్ల అప్పులు చేసి బ్యాంకులను నిండా ముంచిందని విమర్శించారు. దివాళా తీసిన కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని ఆరోపించారు. ఇది రాష్ట్ర ప్రభుత్వం చేసిన మొదటి తప్పు అని చెప్పారు. ఆ కంపెనీ ధరణి నిర్వహణ కోసం సబ్సిడీ కంపెనీ టెర్రాసిస్ టెక్నాలజీస్ లిమిటెడ్‌ను ఏర్పాటు చేసిందనీ, అందులో 52.26 శాతం వాటాను టెర్రాసిస్ కంపెనీ ఫిలిప్పీన్స్ దేశానికి చెందిన ఫాల్కన్ కంపెనీకి రూ.1275 కోట్లకు అమ్ముకుందని అన్నారు. కొనుగోలు చేసే కంటే ఒక నెల ముందు మాత్రమే ఫాల్కన్ కంపెనీని 2021, అక్టోబర్‌లో ప్రారంభించారని తెలిపారు. ఇప్పుడు టెర్రాసిస్ కంపెనీ 99 శాతం వాటా ఫాల్కన్ కంపెనీకి ఇచ్చేసిందనీ, ఇప్పుడు ఆ కంపెనీలో శ్రీధర్‌రాజు చేరారని తెలిపారు. దాంతో ధరణి పోర్టల్ పూర్తిగా శ్రీధర్ రాజు చేతుల్లోకి వెళ్ళిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. తద్వారా ప్రజల భూముల వివరాలన్నీ ప్రయివేటు వ్యక్తుల చేతుల్లో పెడుతున్నారని విమర్శించారు. ధరణి నిర్వహణపై ఐఎల్ఎఫ్ సంస్థతో రూ.150కోట్లకు ఒప్పందం చేసుకున్నారని గుర్తు చేశారు. ఆ సంస్థకు చెందిన 99శాతం వాటాను టెరాలసిస్ టెక్నాలజీస్ అనే సంస్థ కొనుగోలు చేసిందనీ, 70లక్షల భూ యజమానుల వివరాలను ఐఎల్ఎఫ్ సంస్థకు విక్రయించారని ఆరోపించారు. ఒడిశా ప్రభుత్వం 2008లో ఈ-ధరణి పేరుతో ఈ ప్రాజెక్టు ప్రారంభించిందనీ, దీని నిర్వహణను కూడా ఐఎల్ అండ్ ఎఫ్ఎస్‌కు అప్పగించిందన్నారు. ధరణి పోర్టల్ పారదర్శకంగా ఉంటే, అంతా తప్పుల తడకగా ఉందంటూ కాగ్ రిపోర్టు ఎందుకు ఇచ్చిందని ప్రశ్నించారు. ధరణిని బంగాళాఖాతంలో పడేయాలని కాగ్ చెప్పిందని గుర్తు చేశారు. ఇంత జరిగితే కేసీఆర్ తానే అద్భుతాలు చేసి ధరణిని సష్టించినట్టు చెప్పారని ఎద్దేవా చేశారు. రిజిస్ట్రేషన్‌కు స్లాట్ బుక్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే తిరిగి డబ్బులు రావడం లేదనీ, అందుకు మక్తల్‌కు చెందిన ఆంజనేయులు గౌడ్ ఒక ఉదాహరణ అని తెలిపారు. ఇలా ఎన్ని వందల కోట్లు కంపెనీ ఖాతాలోకి వెళుతున్నాయని ప్రశ్నించారు. అసలు ఆ డబ్బులు ప్రభుత్వానికి చేరుతున్నాయా? చెప్పాలన్నారు.

ధరణి ద్వారా జరిగిన లావాదేవీలతో వచ్చిన రూ.50వేల కోట్లలో రూ. 40వేల కోట్లు ప్రభుత్వానికి వెళ్లాయని కొంత మంది అధికారులు చెబుతున్నారనీ, ఇది వాస్తవమా? అవాస్తవమా? విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. లక్షల కోట్ల దోపిడీ జరుగుతున్నా కేంద్రం కేసీఆర్‌పై ఎందుకు విచారణకు ఆదేశించడం లేదని ప్రశ్నించారు. దీని వెనక ఏ గూడుపుఠానీ ఉందో కేంద్ర బీజేపీ నేతలే చెప్పాలని డిమాండ్‌చేశారు. 'అరవింద్ కుమార్ లీగల్ నోటీసులను రిజిస్టర్ పోస్టు లేదా పర్సన్ ద్వారా నాకు పంపాలి.. కానీ పబ్లిక్ డొమైన్‌లో ఎలా పబ్లిష్ చేస్తారు. మీడియాకు ఎలా రిలీజ్ చేస్తారు? ఉద్దేశపూర్వకంగానే అరవింద్ కుమార్ నా ప్రతిష్ఠను తగ్గించేలా వ్యవహరించారని ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు.

ముంచుకొస్తోంది..

(మొదటిపేజి తరువాయి)

తరలించినట్టు అధికారులు తెలిపారు. ద్వారకా జిల్లాలో సుమారు 400కు పైగా రక్షణ శిబిరాలను ఏర్పాటుచేశామని అన్నారు. భుజ్‌లోని జఖౌ ఓడరేవులో పెద్ద సంఖ్యలో పడవలు చేరుకున్నాయి. రాజ్‌కోట్‌లోని రిలే టవర్‌ను కూల్చివేసినట్టు అధికారులు తెలిపారు. తుఫాను ధాటికి కూలిపోయే ప్రమాదం ఉన్నందున టవర్‌ను తొలగించామనీ, త్వరలో కొత్త టవర్‌ను నిర్మిస్తామని ఆకాశవాణి రాజ్‌కోట్ డైరెక్టర్ రమేష్ చంద్ర వివరించారు. ప్రధాని సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైందని, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ సహాయక బృందాలను మోహరించామని కేంద్రమంత్రి పురుషోత్తమ్ రూపాలా పేర్కొన్నారు. గురువారం సాయంత్రం గుజరాత్‌లోని జఖౌ పోర్ట్‌లో తీరాన్ని దాటవచ్చని ఐఎండీ అధికారులు అంచనా వేశారు. ఆ సమయంలో గంటకు 150 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు.

8 రాష్ట్రాల్లో వర్షాలు..

ఈ తుపాను ప్రభావంతో గుజరాత్‌తో పాటు మరో ఎనిమిది రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీంతో కేరళ, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గోవా రాష్ట్రాలతో పాటు డామన్‌డయ్యూ, లక్షద్వీప్, దాద్రానగర్ హవేలీ కేంద్ర పాలిత ప్రాంతాలు అప్రమత్తమయ్యాయి. రాజస్థాన్‌లో జూన్ 16 నుంచి ఈ తుఫాను ప్రభావం ఉండనున్నట్టు వాతావరణ శాఖ తెలిపింది.

రాష్ట్ర ప్రభుత్వ నిర్మాణాలకు అంతర్జాతీయ అవార్డులు

(మొదటిపేజి తరువాయి)

చేశారు. ఇందులో.... డా.బిఆర్.అంబేద్కర్ తెలంగాణ సచివాలయం, యాదగిరి గుట్ట లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం, పోలీస్ కమాండ్ కంట్రోల్ భవనం, దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి, మొజంజాహీ మార్కెట్‌లు 'ఇంటర్నేషనల్ బ్యూటీఫుల్ బిల్డింగ్స్ గ్రీన్ యాపిల్ అవార్డుల'ను అందుకోవడం గొప్ప విషయమని సీఎం తెలిపారు. పర్యావరణ రంగంలో ప్రపంచంలోనే పేరొందిన లండన్‌కు చెందిన ప్రతిష్టాత్మక 'గ్రీన్ ఆర్గనైజేషన్' ఈ అవార్డులను ప్రకటించడం తెలంగాణకు గర్వకారణమని చెప్పారు. దేశంలోనే మొదటిసారిగా ఈ గ్రీన్ అవార్డులను దక్కించుకున్న రాష్ట్రంగా తెలంగాణ నిలవడం ద్వారా, తెలంగాణతో పాటు దేశ ఖ్యాతి ఇనుమడించిందని సీఎం అభిప్రాయపడ్డారు. నూతన తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకుని, ఎక్కడా రాజీ పడకుండా అత్యున్నత ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పర్యావరణ నియమాలకు అనుగుణంగా నూతన కట్టడాల నిర్మాణం, పునరుద్ధరణ జరుగుతున్నదని సీఎం స్పష్టం చేశారు. అందుకు ఈ అవార్డులు నిదర్శనమన్నారు. సకల జనుల సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్రంలో ఆదర్శవంతమైన పాలన కొనసాగుతున్న నేపథ్యంలో, తెలంగాణ ఆచరిస్తున్న ప్రగతి దారులను దేశం అనుసరిస్తున్నదని తెలిపారు. ఇప్పటికే పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు ప్రశంసలు తెలంగాణకు వెల్లువెత్తుతున్న విషయాన్ని ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. ఈ నెల 16న లండన్‌లో ఈ అవార్డులను తెలంగాణ రాష్ట్రానికి అందచేయనున్న సందర్భంగా, ఇందుకు కృషి చేసిన ఆయా శాఖల మంత్రులను, ఉన్నతాధికారులను, సిబ్బందిని సీఎం కేసీఆర్ అభినందించారు.

తమిళనాడు మంత్రి అరెస్టు

(మొదటిపేజి తరువాయి)

ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఆయనకు వీలైనంత త్వరగా కరోనరీ ఆర్టరీ బైపాస్ గ్రాఫ్ట్ సర్జరీ చేయాలని సూచించినట్టు వెల్లడించాయి. కాగా ఆస్పత్రిలో చేరిన సెంథిల్‌బాలాజీని కలవడానికి ఉదయనిధి స్టాలిన్, ఎం సుబ్రమణియన్, ఈవీ వేలు, ఎస్ రేగుపతి సహా పలువురు తమిళనాడు మంత్రులు వెళ్లినా వారిని అనుమతించలేదని సమాచారం. సెంథిల్‌బాలాజీని తమిళనాడు సీఎం ఎంకె స్టాలిన్ పరామర్శించారు. బీజేపీపై ఆయన విమర్శలు గుప్పించారు. రాష్ట్ర సచివాలయంలోని సెంథిల్‌బాలాజీ ఛాంబర్‌లో ఈడీ సోదాలు నిర్వహించటాన్ని ఆయన తప్పుబట్టారు. ఈ సోదాలు ఫెడరలిజం స్ఫూర్తిపై దాడిగా ఆయన అభివర్ణించారు. బీజేపీ ప్రతీకార రాజకీయాల చర్యలను చూస్తున్న ప్రజల మౌనాన్ని తక్కువ అంచనా వేయకూడదన్నారు. 2024 జాతీయ ఎన్నికలు అనే తుఫానుకు ముందున్న ప్రశాంతత బీజేపీని తుడిచిపెట్టేస్తుందని హెచ్చరించారు.

'మట్టి' దొంగలు

యధేచ్ఛగా దోపిడీ.. • నిద్రావస్థలో మైనింగ్, రెవెన్యూ యంత్రాంగం


కటాక్షపూర్ చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు

నవతెలంగాణ- వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో అక్రమ మైనింగ్ దందా నిత్యకృత్యంగా మారింది. అనుమతులుండవు.. ఒకవేళ అనుమతులున్నా, అనుమతించిన దాని కంటే పెద్ద ఎత్తున మైనింగ్ చేస్తూ కోట్ల రూపాయలు అక్రమార్కులు దండుకుంటున్నారు. ఇంత పెద్ద ఎత్తున మొరం దందా జరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం గమనార్హం. అదేమంటే పర్మిట్ ఉందని చెబుతారు.. ఎన్ని క్యూబిక్ మీటర్లకు అనుమతి ఉంది.. ఎన్ని క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించారో తేల్చని పరిస్థితి. ఈ మైనింగ్ దందాలో మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖాధికారులు కుమ్మక్కయ్యారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్థానికులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోక పోవడం శోచనీయం.

హన్మకొండ, ములుగు జిల్లాల పరిధి ఒగ్లాపూర్-ములుగు గట్టమ్మతల్లి గుట్ల వరకు రూ.208 కోట్ల అంచనాతో జాతీయ రహదారి-163కు సంబంధించి 4 వరుసల రహదారి నిర్మాణపు పనులను 'వృద్ధి ఇన్‌ఫ్రాటెక్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్' కంపెనీ దక్కించుకుంది. మరో రూ.92 కోట్లు జీఎస్టీ, భూనిర్వాసితులకు పరిహారానికి కేటాయించారు. దామెర బైపాస్ నుంచి ఆత్మకూరు వరకు 9 కిలోమీటర్లు, నీరుకుల్ల-ములుగు గట్టమ్మ తల్లి గుట్ట వరకు 21 కిలోమీటర్ల మేరకు మొత్తం 30 కిలోమీటర్లు 4 వరుసల రహదారిని నిర్మించాల్సి ఉంది. రోడ్డు విస్తరణ, కల్వర్టుల విస్తరణతోపాటు రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులను ఈ కంపెనీ 2024 జులైలోపు పూర్తి చేయాల్సి ఉంది. ఈ రహదారి పనులకు దామెర మండలం వెంకటాపురం, ఆత్మకూరు మండలం కటాక్షపూర్ చెరువు నుండి పెద్ద ఎత్తున మొరం తవ్వకాలు జరిపి రహదారి నిర్మాణానికి వినియోగిస్తున్న మట్టిని అక్రమంగా దోపిడీ చేస్తోంది. అధికారులు ఇచ్చిన అనుమతులకు భిన్నంగా అధికంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నా మైనింగ్, రెవెన్యూ శాఖాధికారులు పట్టించుకోవడం లేదు. పైగా అధికారులు ఇచ్చే వివరణలు సైతం హాస్యాస్పదంగా ఉన్నాయి.

కటాక్షపూర్ చెరువులో ప్రమాదకరంగా తవ్వకాలు

ఈ జాతీయ రహదారి సమీపంలోని ఆత్మకూరు మండలం కటాక్షపూర్ చెరువులో వృద్ధి కంపెనీ అక్రమంగా మొరం తవ్వకాలు జరిపింది. రెవెన్యూ అధికారులు వృద్ధి కంపెనీకి 14 వేల మెట్రిక్ టన్నుల మొరం తవ్వకానికి తాత్కాలిక అనుమతినిచ్చారు. సదరు కంపెనీ దామెర మండలం వెంకటాపురం గ్రామ పరిధిలో 25,419 మెట్రిక్ టన్నుల మొరాన్ని అక్రమంగా తవ్వి రహదారి నిర్మాణంలో వినియోగించారు. 11,419 మెట్రిక్ టన్నుల మొరాన్ని అక్రమంగా తవ్వి తరలించినందుకు కంపెనీకి రూ.15.52 లక్షల జరిమానాను మైనింగ్ శాఖ విధించింది. కాగా, జాతీయ రహదారికి అత్యంత సమీపంలో చెరువులో ఈ తవ్వకాలు జరపడంతో చెరువులో లోతు పెరిగింది. వర్షాలు పడితే ఈ అక్రమ తవ్వకాలు జరిపిన ప్రాంతంలో లోతు తెలియక చిన్నారులు, వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశముంది. నీటిపారుదల శాఖ, రెవెన్యూ, మైనింగ్ శాఖలు చోద్యం చూస్తుండటంతో పెద్ద ఎత్తున చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపారు. ఈ విషయంలో జిల్లాస్థాయి అధికారులు సైతం ప్రేక్షకపాత్ర పోషించడం అనుమానాలకు తావిస్తుంది. మైనింగ్ దొంగలు ప్రకృతిని విధ్వంసం చేస్తూ కోట్లాది రూపాయలను సంపాదిస్తూ, ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. ఇప్పటికైనా ఈ మట్టి దొంగలను కనిపెట్టి శిక్షించాలని, అక్రమ మైనింగ్ దందాను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

పదేండ్లుగా పెరగని ఆర్టీసీ కార్మికుల వేతనాలు

- రెండో వేతన సవరణలు 2017, 2021 వెంటనే అమలు చేయాలి
- కొత్త సంస్కరణల పేరుతో సంస్థను నిర్వీర్యం చేస్తున్న ఎండీ : టీజేఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ ఆర్టీసీ కార్మికులకు రెండవ వేతన సవరణలు 2017, 2021 జరగకపోవడంతో పదేండ్లుగా ఆర్టీసీ కార్మికులకు వేతనాలు పెరగడం లేదని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే హనుమంతు ముదిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. వేతన సవరణ చేసి ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం టీఎస్ఆర్టీసీ తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి బస్సు భవన్ వరకు ర్యాలీ చేపట్టి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతు మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల పట్ల సీఎం కేసీఆర్ అహంకారపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఆర్టీసీలో యూనియన్లను నియంత్రించి కార్మికులతో 14 గంటల డ్యూటీ చేయిస్తున్నారని, దాంతో పని భారం పెరిగి అనేకమంది కార్మికులు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పెరుగుతున్న జనాభా కనుగుణంగా ప్రజా రవాణా మెరుగుపరచడం కోసం బస్సు డిపోల సంఖ్య పెంచాల్సి ప్రభుత్వం.. డిపోలను తగ్గించడం రాచరిక పాలనకు నిదర్శనమన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఆర్టీసీ కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో యూనియన్లను అనుమతించి ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ కార్మిక సమస్యలపై ఏ రోజూ దృష్టి పెట్టలేదని, పైగా కొత్త కొత్త సంస్కరణల పేరుతో సంస్థను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. మహిళా కార్మికులకు రాత్రి 8 గంటలకు డ్యూటీలు ముగించే విధంగా ప్రతి డిపోలో డ్యూటీలు వేయాలన్నారు. రిటైర్డ్ అయిన ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బహుజన వర్కర్స్ యూనియన్ నాయకులు సుద్దాల సుధాకర్, రాష్ట్ర చీఫ్ వైస్ ప్రెసిడెంట్ డి.వి.కె.రావు, అడ్వైజర్ కృష్ణ, జాయింట్ సెక్రటరీ స్వాములయ్య, కోశాధికారి పీఎస్ఎస్ రావు, హైదరాబాద్ రీజినల్ సెక్రటరీ రాజయ్య, మహిళా నాయకులు సత్యవతి, బుల్లెట్ పాండు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పత్తి విత్తనాల సరఫరా ముఠా అరెస్టు

- రూ.1.60 కోట్ల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం
- ముగ్గురు అరెస్ట్, ఒకరు పరారీ : ఎస్పీ అపూర్వరావు వివరాలు వెల్లడి



నవతెలంగాణ-నల్లగొండ

నకిలీ పత్తి విత్తనాలను సరఫరా చేసే ముఠాను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. కోటీ 80 లక్షల విలువ గల నకిలీ పత్తి విత్తనాలు, ఎర్టిగా కారు, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ అపూర్వరావు తెలిపారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. బుధవారం తెల్లవారుజామున ఎస్ఐ డీ.సైదాబాబు, ఎస్ఐ విజయ్ కుమార్, ఎస్ఐ ఈ.రవి టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, పక్కా సమాచారంతో నార్కట్‌పల్లి ఫ్లై ఓవర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా వస్తున్న ఎర్టిగా కార్‌ను ఆపి తనిఖీ చేశారు. అందులో రెండు విడి విత్తనాలు కలిగిన బస్తాలను పట్టుకొని వ్యవసాయ అధికారులను పిలిపించి చెక్ చేయించారు. అవి నకిలీ పత్తి విత్తనాలని తెలపగా వెంటనే వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. గోరంట్ల నాగార్జున, గడ్డం రవీంద్రబాబు, మెరిగే వేణు.. కర్నాటకలోని కొంత మంది రైతుల దగ్గర నుంచి పత్తి విత్తనాలు తక్కువ ధరకు కొనుగోలు చేసి గుంటూరు జిల్లా దాచేపల్లి దగ్గర స్టోరేజ్ చేసి అక్కడ నుంచి మహారాష్ట్రలోని నాగపూర్‌కి చెందిన రైతులకు ఎక్కువ ధరకు అమ్మేందుకు తరలిస్తుండగా పోలీసులకు చిక్కారు. నలుగురి నిందితుల్లో ముగ్గురిని రిమాండ్‌కు తరలిస్తున్నట్టు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అన్నమయ్య జిల్లాకు చెందిన నరసింహ పరారీలో ఉన్నట్టు ఎస్పీ తెలిపారు. ఈ ముఠాను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన నల్లగొండ డీఎస్పీ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో చిట్యాల సీఐ శివరామ్‌రెడ్డి, నార్కెట్‌పల్లి ఎస్ఐ సైదాబాబు, చిట్యాల ఎస్ఐ రవి, ఎస్ఐ విజయ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ సురేందర్, కానిస్టేబుల్స్ శివ శంకర్, గిరిబాబు, టాస్క్ ఫోర్స్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

కడుపులోనే క్లాత్

- ఆపరేషన్ చేసి మరిచిపోయిన డాక్టర్లు
- సంవత్సరం కాలంగా ఇబ్బంది పడ్డ రోగి
- సాయి రక్ష హస్పిటల్ నిర్వాకం



నవతెలంగాణ-నల్లగొండ

అనారోగ్యంతో ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చేరిన మహిళకు ఆస్పత్రి వైద్యులు నిర్లక్ష్యంగా ఆపరేషన్ చేసి కడుపులో క్లాత్‌ను వదిలేసి కుట్లు వేసి డిశ్చార్జ్ చేశారు. దాంతో ఆ మహిళకు కడుపులో ఇన్ఫెక్షన్ పెరిగి సంవత్సర కాలంగా తీవ్ర ఇబ్బంది పడింది. ఇటీవల ఆమెకు కడుపునొప్పి విపరీతంగా పెరగడంతో హైదరాబాద్‌లోని కామినేనిలో చేరింది. ఆ మహిళకు స్కానింగ్ చేయగా.. కడుపులో క్లాత్ ఉన్నట్టుగా గుర్తించారు. ఈ నిర్వాకం నల్లగొండ జిల్లా కేంద్రంలోని సాయి రక్ష హస్పిటల్‌లో జరిగిందని డాక్టర్ల ద్వారా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలలోకి వెళితే.. మునుగోడుకు చెందిన వసంత ఏడాది కిందట జిల్లా కేంద్రంలోని సాయి రక్ష హాస్పిటల్‌లో అనారోగ్యంతో చేరింది. దాంతో ఆస్పత్రి డాక్టర్లు మహిళకు ఆపరేషన్ చేశారు. ఆసమయంలో కడుపులో క్లాత్ మర్చిపోయారు. హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత వసంత మరోసారి తీవ్ర అనారోగ్యానికి గురై ఏడాది కాలంగా కడుపునొప్పితో బాధపడుతూనే ఉంది. అయితే రెండు రోజుల క్రితం సమస్య తీవ్రతరం కావడంతో హైదరాబాద్ కామినేనిలో చేర్పించగా డాక్టర్లు వసంత కడుపులో క్లాత్ ఉండటం ద్వారా ఇన్ఫెక్షన్ అయ్యిందని, వెంటనే ఆమెకు ఆపరేషన్ చేసి క్లాత్‌ను బయటకు తీశారు. కాగా, పేషెంట్ ప్రాణాలతో చెలగాటమాడిన సాయిరక్ష హాస్పిటల్‌ను సీజ్ చేయాలంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దేవాలయాలు, విద్యాలయాల అభివృద్ధి, శాంతిభద్రతలకు ప్రాధాన్యం

త్వరలోనే మల్కపేట జలాశయాన్ని ప్రారంభిస్తాం : ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్


సిరిసిల్ల 02 శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కేటీఆర్ టీటీడీ ఆలయ చైర్మెన్ వైవి సుబ్బారెడ్డి

నవతెలంగాణ - సిరిసిల్ల

రాష్ట్రంలో విద్యాలయాలను ఎంత అభివృద్ధి చేస్తున్నామో దేవాలయాలను, పోలీసింగ్, శాంతి భద్రత వ్యవస్థను కూడా అదే పద్ధతిలో అభివృద్ధి చేస్తూ ప్రజలకు చేరువ చేస్తున్నామని మంత్రి కేటీఆర్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ పున్ణనిర్మాణ పనులకు బుధవారం తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మెన్ వైవీ సుబ్బారెడ్డితో కలిసి శంకుస్థాపన, భూమిపూజ చేశారు. అనంతరం సిరిసిల్ల జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 80సీసీ కెమెరాలు, కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. టీటీడీ ఆర్థిక సహకారంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రసిద్ధ దేవాలయాలకు పూర్వ వైభవం తేవచ్చని రిక్వెస్ట్ చేసిన వెంటనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మెన్ వైవీ సుబ్బారెడ్డి సానుకూలంగా స్పందించారన్నారు. ఫలితంగా ఇప్పుడు సిరిసిల్లలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం పునరుద్ధరణ పనులు చేపడుతున్నట్టు తెలిపారు. గంభీరావుపేటలో కేజీ టూ పీజీ క్యాంపస్‌ను అభివృద్ధి చేసిన మాదిరిగానే తెలంగాణలోని 26వేల ప్రభుత్వ పాఠశాలలను 'మన ఊరు-మనబడి' కార్యక్రమం కింద అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. మండు వేసవిలో చెరువులు, కుంటలు, నదులు జలకళను సంతరించుకున్నాయని, సీఎం కేసీఆర్ సంకల్పంతో తెలంగాణ రాష్ట్ర సస్యశ్యామలమైదన్నారు. దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలు, మైనారిటీలతో పాటు బ్రాహ్మణ వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అణగారినవర్గాలనే కాదు అగ్రవర్ణ పేదలను కూడా ప్రభుత్వం కడుపులో పెట్టుకుంటుందని స్పష్టం చేశారు.

20రోజుల్లో మల్కపేట జలాశయాన్ని సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. మల్కపేట జలాశయంతో ఎల్లారెడ్డిపేట శాశ్వతంగా సస్యశ్యామలం అవుతుందన్నారు. దేశ జనాభాలో 3శాతం జనాభా కలిగిన తెలంగాణ.. కేంద్ర ప్రభుత్వం గ్రామాలకు అందించే జాతీయ అవార్డుల్లో 30శాతం సాధించిందన్నారు. పట్టణాలు కూడా అదే బాటలో నడుస్తూ 25 అవార్డులు అందుకున్నాయని తెలిపారు. సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేటలో ఆలయాల పున్ణ నిర్మాణానికి సహకరించిన టీటీడీ గంభీరావుపేట సీతారామ ఆలయం పున్ణ నిర్మాణానికి కూడా ఆర్థిక సహాయం అందజేయవలసిందిగా కోరగా టీటీడీ చైర్మెన్ సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. టీటీడీ చైర్మెన్ వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. నాలుగేండ్లుగా బడుగు, బలహీన వర్గాలు, గిరిజనులు ఉండేచోట పెద్ద ఎత్తున ఆలయాలను నిర్మిస్తున్నామన్నారు.

కరీంనగర్‌లో రూ.20కోట్లతో శ్రీ వేంకటేశ్వర ఆలయాన్ని నిర్మిస్తున్నట్టు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. తొమ్మిదేండ్లలో తెలంగాణ రూపురేఖలు మారాయని కొనియాడారు.



క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లను రెగ్యులరైజ్ చేయాలి

- విద్యాశాఖ ఉద్యోగ నోటిఫికేషన్‌ల్లో 30 శాతం వెయిటేజ్ కల్పించాలి : ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నవతెలంగాణ - అడిక్ మెట్

క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సీఆర్‌పీ)లను రెగ్యులరైజ్ చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, సమగ్ర శిక్షా క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దుండిగల్ యాదగిరి డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ అసోసియేషన్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. సమగ్ర శిక్షాలో విధులు నిర్వహిస్తున్న క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వారు నిత్యం రవాణా చేయడానికి రవాణా చార్జీలు కూడా చెల్లించడం లేదని తెలిపారు. సమగ్ర శిక్షాలో విధులు నిర్వహిస్తున్న క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లను రెగ్యులేషన్ చేసి వారికి రవాణాచార్జీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ ఉద్యోగ నోటిఫికేషన్‌లో 30 శాతం వెయిటేజ్ కల్పించాలన్నారు. ఆరోగ్య సంరక్షణ కోసం ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ కార్డులు ఇవ్వాలని కోరారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి క్లస్టర్ రిసోర్స్ పర్సన్ 18 నుంచి 25 పాఠశాలలను ప్రతి నెలా సందర్శిస్తున్నందుకు రవాణాచార్జీలు, ఫోన్ బిల్, నెట్ బిల్ రూపంలో నెలకు రూ. 5000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంపాదిత సెలవులు మినహా ఆరు నెలల ప్రసూతి సెలవులు, సమగ్ర శిక్షా ఉద్యోగులందరికీ అమలు చేయాలన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ.. తెలంగాణలో రెసిడెన్షియల్ పాఠశాలల సంఖ్య పెరిగింది కావున క్లస్టర్‌ల సంఖ్య పెంచాలన్నారు. హెచ్ఆర్ పాలసీ కల్పించాలని కోరారు. ఈ ధర్నాలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేగుల సహదేవ్, కోశాధికారి రవీందర్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి కంచర్ల మహేందర్, కార్యదర్శులు జానకిరామ్, కంబాల సుధాకర్, ఉపాధ్యక్షులు చందు, పాషా, చంద్రశేఖర్, తదితర నాయకులు పాల్గొన్నారు.

కుల గణన కోసం ఉద్యమించాలి

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టాలని, అందుకోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి డాక్టర్ వి. శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్(ఏఐఓబీసీఎస్ఏ) ఆధ్వర్యంలో రూపొందించిన కుల గణన కోసం లక్ష పోస్టు కార్డుల ద్వారా పది లక్షల ట్వీట్‌లతో మహా ఉద్యమాన్ని తీసుకురావాలనే ఉద్దేశంతో 'కుల గణన కోసం ఉద్యమిద్దాం' అనే వాల్ పోస్టర్‌ను హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు కిరణ్‌కుమార్, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రావణ్, తెలంగాణ సాగర సంగం అధ్యక్షుడు శేఖర్ సాగర్, తెలంగాణ గౌడ ఐక్య సాధన సమితి అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్, మహబూబ్‌నగర్ మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాజేంద్ర ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌టీసీసీఐ, క్యూసీఎఫ్ఐ

- సమర్థతను, నాణ్యతే లక్ష్యంగా భాగస్వామ్య ఒప్పందాలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్‌టీసీసీఐ) 106 ఏండ్ల ట్రేడ్, కామర్స్, ఇండస్ట్రీ బాడీ, 41 ఏండ్ల క్వాలిటీ సర్కిల్ ఫోరమ్ ఆఫ్ ఇండియా మంగళవారం రాత్రి వరకు జరిగిన ఒక కార్యక్రమంలో ఒక అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో ఈ కార్యక్రమం జరిగింది.

రెండు సంస్థలు, తమ తమ రంగాల్లో సహకారాన్ని పెంపొందించడానికి, నాణ్యతను, సమర్థతను, శ్రేష్ఠతను పెంచుకోవడానికి కలిసి వచ్చాయి. ఎఫ్‌టీసీసీఐ తరపున ప్రెసిడెంట్ అనిల్ అగర్వాల్, క్యూసీఎఫ్ఐ తరపున డైరెక్టర్ బొడ్డపాటి శ్రీనివాస్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మీలా జయదేవ్, వైస్ ప్రెసిడెంట్ సురేష్‌కుమార్ సింఘాల్ సమక్షంలో పత్రాలపై సంతకాలు చేసి మార్చుకున్నారు. అవగాహనా ఒప్పందాన్ని సంతకం చేయడం సహకారం, నాణ్యతను, సమర్థతను ప్రోత్సహించడంలో ఒక ముఖ్యమైన అడుగు అని ఎఫ్‌టీసీసీఐ ప్రెసిడెంట్ అనిల్‌అగర్వాల్ అన్నారు. భవిష్యత్తుకు నాణ్యతే ఏకైక మార్గమని అన్నారు. ఇది సంస్థకు అధిక ఆదాయాలు, ఉత్పాదకతను నిర్ధారిస్తుందన్నారు. నాణ్యత వ్యర్థాలు, ఖర్చులు నష్టాలను తగ్గించడంలో సహాయపడుతుందని చెప్పారు. నాణ్యత ఖ్యాతిని, బ్రాండ్ విలువను పెంపొందించడానికి సహాయపడుతుందని వివరించారు. జులై 17 నుంచి 19 వరకు 'నాణ్యత, విశ్వసనీయత కోసం బెంచ్‌మార్కింగ్' కార్యక్రమాన్ని నిర్వహించబోతోందన్నారు. క్యూసీఎఫ్ఐ లాభాపేక్ష లేని, రాజకీయ రహిత, జాతీయ వత్తిపరమైన సంస్థ అని, మానవ ప్రయత్నంలోని ప్రతి రంగంలో చురుకైన ప్రమేయం, భాగస్వామ్యం కోసం వాతావరణాన్ని సృష్టించే ఉద్దేశ్యంతో ఏర్పడిన సంస్థ అని బొడ్డపాటి శ్రీనివాస్ అన్నారు. ప్రజల మొత్తం నాణ్యతను అభివృద్ధి చేయడానికి అవసరమైన, అంతర్భాగంగా జీవన నాణ్యతను మెరుగుపరచడానికి పరిధిని విస్తరిస్తుందన్నారు. ఎఫ్‌టీసీసీఐ సీఈఓ ఖ్యాతి నర్వానే, స్కిల్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ అంకిత్ భట్నాగర్, సీనియర్ ఫ్యాకల్టీ సీవీ.రమణ, క్యూసీఎఫ్ఐ టోటల్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ సీఓఓ సునీల్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణదారులను వదిలి గుడిసె వాసులపై ప్రతాపమా?

పేదలకు ఇండ్ల స్థలాలు, ఇండ్లు నిర్మించే వరకు పోరాటం: సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య



నవతెలంగాణ-అశ్వారావుపేట

నిలువ నీడ లేని నిరుపేదలకు స్థలాలు ఇచ్చి, గృహాలు నిర్మించి ఇవ్వాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. ప్రభుత్వ స్థలాల్లో పేదలు వేసుకున్న గుడిసెలను ధ్వంసం చేస్తూ అరాచకాలను సాగిస్తున్నారని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ 14 నుంచి 16 వరకు స్థానిక లహరి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే రాజకీయ శిక్షణా తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. ప్రారంభ సూచికగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన రావు సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం.. సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్.. ఉద్యమంలో భాగస్వాములై పలు అనారోగ్య కారణాలతో మృతి చెందిన నాయకులు, కార్యకర్తలకు సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. అనంతరం సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన ఈ తరగతుల్లో వీరయ్య "రాజకీయ పరిస్థితులు" అనే అంశాన్ని రైతు ప్రతినిధులకు బోధించారు.

ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో 26 జిల్లాల్లో 6 పోరాట కేంద్రాల్లో వేలాది మంది పేదలు ఇండ్లు, ఇండ్ల స్థలాలు కోసం పోరాటం చేస్తుంటే.. రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కైన రెవెన్యూ, పోలీస్ అధికారులు పేదలు గుడిసెలను ధ్వంసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహబూబాబాద్‌లో సోమవారం తెల్లవారుజామున 4 గంటలు నుంచి మంగళవారం మధ్యాహ్నం 2 గంటలు వరకు గుడిసెలు కూల్చే పనిలో ప్రభుత్వ అధికారులు తలమునకలు అయ్యారన్నారు. ఏండ్ల తరబడి ప్రభుత్వ భూములను ఆక్రమించిన పెద్దలను వదిలేసి పేదలు గుడిసెలు కూల్చడం ఏమిటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాస యోజన పథకం ద్వారా, రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ పథకం ద్వారా పేదలకు గృహాలు నిర్మించి ఇవ్వాల్సి ఉన్నప్పటికీ అవి సఫలం కాలేదని అన్నారు. 58 జీఓ ప్రకారం స్వాధీనంలో ఉన్న భూములకు ఇంటి పట్టాలు ఇస్తానని చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్, 59 జీఓ తెచ్చి తిరిగి ధనవంతులకే మేలు చేస్తున్నారని విమర్శించారు. పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు సాధించే వరకు పోరాటం చేయాలని ప్రజా సంఘాల పోరాట వేదిక నిర్ణయించిందని చెప్పారు. ఆ మేరకు ఈ నెల 19 నుంచి 24 వరకు పేదలతో వ్యక్తిగతంగా తహసీల్దార్‌కు దరఖాస్తులు చేయించడం, ధర్నాలు చేపడతామని తెలిపారు. ఈనెల 18 నుంచి 21 వరకు బస్సు యాత్ర చేపట్టి పేదలను సమీకరించి పోరాటాలకు సన్నద్ధం చేస్తామని ప్రకటించారు. చివరిగా జులై 3న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల ముందు మహాధర్నా నిర్వహించి పేదలు గొంతుకగా ప్రభుత్వానికి మొరవినిపిస్తామన్నారు. అనంతరం "రైతు ఉద్యమం" అనే అంశం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన రావు బోధించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసాని ఐలయ్య, మాదినేని రమేష్, వి వెంకటేశ్వర్లు, శెట్టి వెంకన్న, సహాయ కార్యదర్శులు కందాల ప్రమీల, బొంతు రాంబాబు, డి.బాల్ రెడ్డి, ఎం శ్రీనివాస్, బాలరాజు గౌడ్ రాష్ట్ర కమిటీ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యలమంచిలి వంశీ క్రిష్ణ, అన్నవరపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్‌లో స్నానానికి వెళ్లి.. ఇద్దరు చిన్నారులు మృతి



నవతెలంగాణ - ఓదెల/జమ్మికుంట

చెక్‌డ్యామ్‌లో స్నానానికి వెళ్లి ఇద్దరు చిన్నారులు మృతిచెందిన విషాదకర సంఘటన పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలో బుధవారం జరిగింది. స్థానికులు, పొత్కపల్లి ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం తనుగుల గ్రామానికి చెందిన జూపాక అశోక్ కుమారుడు సాత్విక్, కాసర్ల సునీల్ కూతురు నిత్యశ్రీ వేసవి సెలవులకు వీణవంక మండలం కొండపాక గ్రామంలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లారు. బుధవారం ఈ ఇద్దరు పిల్లలతో పాటు మరో నలుగురు పిల్లలు పొత్కపల్లి శివారులోని మానేరు చెక్‌డ్యామ్‌లో స్నానానికి వెళ్లారు. కాగా సాత్విక్(14), నిత్యశ్రీ(12) నీటిలోతు ఎక్కువ ఉన్న ప్రాంతంలో మునిగిపోయారు. విషయం తెలుసుకున్న పొత్కపల్లి ఎస్ఐ రామకృష్ణ వెంటనే తన సిబ్బందితో చెక్ డ్యామ్‌కు చేరుకొని మునిగిన స్థలంలో వెతికించి చిన్నారులను బయటకు తీసి పోలీసు వాహనంలో హాస్పిటల్ తరలించారు.

చిన్నారులను పరీక్షించిన డాక్టర్లు.. వారు మృతిచెందినట్టు ధృవీకరించారు. చిన్నారుల మృతితో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. పాప తల్లి కాసర్ల వందన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.



ఎటుచూసినా 'పల్లె ప్రగతి'

సర్కారు చొరవ..ప్రజల భాగస్వామ్యంతో మునుముందుకు

- పారిశుధ్యం..చెట్ల పెంపకానికి ప్రాధాన్యం
- ప్రతి పంచాయతికీ ప్రతి నెలా నిధుల విడుదల
- తొమ్మిదేండ్లలో స్థానిక సంస్థలకు 94 అవార్డులు

వంద శాతం ఓడీఎఫ్ ప్లస్ గ్రామాలు తెలంగాణలోనే

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలోని ప్రతి ఊరినీ దేశంలోనే ఆదర్శంగా నిలపాలనే సీఎం కేసీఆర్ పట్టుదల ఫలిస్తున్నది. ప్రతినెలా రాష్ట్ర సర్కారు నిధుల విడుదలతో...ప్రజల భాగస్వామ్యంతో 'పల్లె ప్రగతి' స్పష్టంగా కనిపిస్తున్నది. దీంతో మన పల్లెలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి. తొమ్మిదేండ్లలో స్థానిక సంస్థలకు వచ్చిన 94 అవార్డులు అభివృద్ధికి తార్కాణం. రాష్ట్రంలోని అన్ని ఊర్లనూ ఓడీఎఫ్ ప్లస్ గ్రామాలుగా ప్రకటించిన ఏకైక రాష్ట్రంగా తెలంగాణ ఖ్యాతి సాధించింది. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం 'పల్లె ప్రగతి దినోత్సవం' నిర్వహించాలని రాష్ట్ర సర్కారు పిలుపునిచ్చింది. ఈ మేరకు పల్లె ప్రగతిపై రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అందులోని ముఖ్యాంశాలు ఇలా...

అన్నిట్లోనూ ఫస్టే..

- రాష్ట్రంలోని అన్ని గ్రామాలు ఓడిఎఫ్ ప్లస్ గ్రామాలుగా ప్రకటించబడిన ఏకైక రాష్ట్రం తెలంగాణ.
- 1851 అవాస, తండా పంచాయతీలతో కలిపి 4,383 నూతన గ్రామపంచాయతీల ఏర్పాటు.
- 5441 గ్రామాల్లో నూతన గ్రామపంచాయతీ భవనాల కోసం రూ.1088.20 కోట్లు మంజూరు
- ప్రతి ఊరుకీ పంచాయతీ కార్యదర్శులను నియమించిన మొదటి రాష్ట్రం తెలంగాణ.
- ప్రతి గ్రామపంచాయతీలో ట్రాక్టర్, ట్యాంకర్, ట్రాలీ ఏర్పాటు చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ.
- ప్రతి గ్రామపంచాయతీలో నర్సరీ, పల్లె ప్రకృతి వనం, అవెన్యూ ప్లాంటేషన్ ఏర్పాటు చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ.
- ప్రతి గ్రామ పంచాయతీలోనూ వైకుంఠధామం, డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసిన రాష్ట్రం తెలంగాణ ఒక్కటే.
- దేశంలో ఎక్కడా లేని విధంగా 14,456 గ్రామాలలో తెలంగాణ క్రీడా ప్రాంగణాల ఏర్పాటు.
- ప్రతి ఇంటికి నల్లా ద్వారా శుద్ధి చేసిన మంచినీటి సరఫరా చేస్తున్న దేశంలోనే ప్రథమ రాష్ట్ర తెలంగాణ.

అభివృద్ధి ఇలా...

దేశంలో ఎక్కడా లేనివిధంగా కేంద్ర 15వ ఆర్థిక సంఘం నిధులకు సమానంగా రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులను జమచేసి పంచాయతీలకు విడుదల చేస్తున్నది. గ్రామ పంచాయతీలకు 85 శాతం, పంచాయతీలకు 10 శాతం, జిల్లా పరిషత్లకు 5 శాతం నిధులను ప్రభుత్వం అందజేస్తున్నది. అతి తక్కువ జనాభా కలిగిన చిన్న గ్రామపంచాయతీలకు కూడా కనీసం ఐదు లక్షల రూపాయల నిధులు అందుతున్నాయి. సెప్టెంబర్ 2019 నుంచి ఇప్పటివరకు పల్లెప్రగతి కింద రూ.11,162 కోట్ల వ్యయంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. 'పల్లెలే మన దేశానికి పట్టుకొమ్మలు. గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం' అన్న మహాత్మాగాంధీ మాటలను ఆదర్శంగా తీసుకుని రాష్ట్ర సర్కారు ముందుకు పోతున్నది. పట్టణాలతో సమానంగా గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నది. గ్రామాల్లో పారిశుధ్య వ్యవస్థను మెరుగుపర్చేందుకు, పచ్చదనాన్ని పెంచేందుకుగానూ 12,789 గ్రామ పంచాయితీల్లో రూ.1,276 కోట్లలో ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్లను కొనుగోలు చేశారు. పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా ప్రతి పంచాయతీలోనూ డంపింగ్ యార్డు ఉంది. వాటి ద్వారా 36 లక్షల కిలో గ్రాముల కంపోస్ట్ ఎరువు సేకరించి వ్యవసాయానికి వినియోగించబడింది. అంత్యక్రియల కోసం రాష్ట్రంలో 12,769 గ్రామాల్లో వైకుంఠధామాలను ఏర్పాటు చేశారు.

పల్లె ప్రకృతివనాలు..క్రీడా ప్రాంగణాలు

గ్రామాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం, పిల్లలకు ఆటస్థలం, పెద్దలకు నడక అవసరం. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఊరులోనూ ఎకరానికి తగ్గకుండా రాష్ట్రంలో ఇప్పటివరకు 19,472 పల్లె ప్రగతి వనాలు ఏర్పాటయ్యాయి. దీనికి తోడుగా 3297 ఎకరాల విస్తీర్ణంలో 2725 బృహత్ పల్లె ప్రగతి వనాలు వివిధ దశలో ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 9242 కిలోమీటర్ల పొడవైన మల్టీ లేయర్ ప్లాంటేషన్ పూర్తయింది. అన్ని గ్రామాల్లోనూ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసి క్రీడా సౌకర్యాలు కల్పించారు.

ఇంటింటికీ, ప్రతిరోజూ నీటి సరఫరా

సురక్షిత తాగునీటిని సరఫరా చేసి తద్వారా ప్రజల కష్టాలు తీర్చడానికి రాష్ట్ర సర్కారు మిషన్ భగీరథ పథకం తీసుకొచ్చింది. అంటు వ్యాధులు అరికట్టడానికి , ఫ్లోరైడ్ సమస్యలు తొలగించడానికి అది ఎంతో దోహదపడింది. ప్రతిఊరులోనూ ఇంటింటికీ నల్లా సౌకర్యం కల్పించి ప్రతిరోజూ తాగునీటిని సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణనే.

గ్రామీణ విద్యుతు సరఫరా

పల్లె ప్రగతి కార్యక్రమంలో రూ.314.94 కోట్ల ఖర్చుతో 2.99 లక్షల కొత్త విద్యుత్ స్తంభాలను నాటించి, కరెంటు తీగలను బిగించి విద్యుత్ సరఫరా వ్యవస్థను పటిష్టపరిచారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన దళిత, గిరిజన ఆవాస ప్రాంతాలలో 5.39 లక్షల మీటర్ల మూడో వైర్ ను ఏర్పాటు చేసి వీధి దీపాలను అమర్చారు.

పరిపాలన సంస్కరణలు

గతంలో రాష్ట్రంలో 8,690 గ్రామపంచాయతీలుంటే.. 12,769కు రాష్ట్ర సర్కారు పెంచింది. 3,146 ఆదివాసీలు, గిరిజనుల గూడాలు, తండాలను పంచాయతీలుగా మార్చింది. ప్రతి గ్రామానికీ కార్యదర్శిని నియమించింది. జీపీ సిబ్బంది వేతనాన్ని 9500 రూపాయలకు పెంచింది. స్థానిక ప్రజా ప్రతినిధుల గౌరవ వేతనాలు పెంచింది. కొత్త పంచాయితీరాజ్ చట్టం తెచ్చింది. వార్షిక పంచవర్ష ప్రణాళికలు రూపొందించుకునే కొత్త సంప్రదాయాన్ని ప్రారంభించింది. నిధులు, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, ప్రజా ప్రతినిధులపై చర్యలకు చట్టంలో కఠిన నిబంధనలను పెట్టి పరిపాలనలో జవాబుదారీతనాన్ని పెంచింది.

అవార్డులే..అవార్డులు

పంచాయతీరాజ్ శాఖ పనితీరుకి, ప్రతిభకు గీటురాళ్ళుగా అవార్డులు నిలుస్తున్నాయి. తొమ్మిదేండ్ల కాలంలో 94 అవార్డులు దక్కాయి. మిషన్ భగీరథలోనూ అవార్డులను సొంతం చేసుకున్నది.

పల్లె ప్రగతికి ప్రజా సైన్యం

దేశంలోనే తొలిసారిగా గ్రామాల్లో స్టాండింగ్ కమిటీలలో ప్రజలను భాగస్వామ్యం చేసింది. వర్క్స్, శానిటేషన్, స్ట్రీట్ లైట్స్, గ్రీన్ కవర్ కోసం నాలుగు కమిటీలను ఏర్పాటు చేశారు. వాటిలో 8,20,727 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. అందులో 4,03,758 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు.

స్టార్టప్‌లకు సాధికారతే లక్ష్యంగా...

రెనాల్ట్ నిస్సాన్‌తో ఒప్పందం : టీ-హబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాస్‌రావు

- చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్‌గా సుజిత్ జాగిర్దార్ నియామకం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'భారతదేశంలో ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, స్టార్టప్‌లకు సాధికారత కల్పించడానికి రెనాల్ట్ నిస్సాన్ టెక్నాలజీ బిజినెస్ సెంటర్ ఇండియాతో చేతులు కలపడం మాకు సంతోషంగా ఉంది. అత్యాధునిక పరిష్కారాలను పెంపొందించే, టెక్ స్టార్టప్ ల్యాండ్‌స్కేప్‌ను నడిపించే శక్తివంతమైన పర్యావరణ వ్యవస్థను రూపొందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం' అని టీ-హబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాస్‌రావు అన్నారు.

భారతదేశంలోని ప్రముఖ ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్ అయిన టీహబ్, ఓపెన్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ కోసం ప్రపంచ సాంకేతిక, అభివృద్ధి కేంద్రమైన రెనాల్ట్ నిస్సాన్ టెక్నాలజీ బిజినెస్ సెంటర్ ఇండియాతో తన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బుధవారం ప్రకటించింది. స్టార్టప్‌లను ప్రముఖ పరిశ్రమ నిపుణులతో అనుసంధానం చేయడం, ప్రూఫ్-ఆఫ్-కాన్సెప్ట్(పీఓసీ) గ్రాంట్‌లను అందించడం, పరిశ్రమ-ఆధారిత వినియోగ కేసుల కోసం స్టార్టప్‌లతో ఎంగేజ్‌మెంట్‌ను సులభతరం చేసే కార్పొరేట్ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్‌ను అమలు చేయడమే లక్ష్యంగా ఈ ఒప్పందాన్ని చేసుకున్నారు. చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్(సీఐఓ)గా సుజిత్ జాగీర్దార్‌ను నియమించినట్టుగా టీ-హబ్ ప్రకటించింది. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ భాగస్వామ్యం స్టార్టప్‌ల విజయాన్ని ఉత్ప్రేరకపరచడానికి, గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌గా ఇండియా స్థానాన్ని ముందుకు తీసుకురావడానికి నిబద్ధతతో పనిచేస్తున్నామని అన్నారు. ఆర్ఎన్‌టీబీసీఐ మేనేజింగ్ డైరెక్టర్ దేబాషిస్ నియోగి మాట్లాడుతూ, 'నేటి మొబిలిటీ మార్కెట్ కీలకమైన వ్యాపార వ్యూహంగా ఆవిష్కరణలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని అన్నారు. కంపెనీలు వృద్ధి చెందడానికి ఇన్నోవేషన్ సహాయపడుతుందన్నారు. యువ టెక్ స్టార్టప్‌లతో సహకరించడంతో దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ సందర్భంగా చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ సుజిత్ జాగిర్దార్ మాట్లాడుతూ 'నేను టీ-హబ్‌లో సీఐఓగా చేరడానికి సంతోషిస్తున్నాను. ప్రతిభ, ఆవిష్కరణల ప్రపంచ స్థాయి కేంద్రంగా స్థిరపడింది. కొన్ని ఒత్తిడితో కూడిన వ్యాపారం, సామాజిక సవాళ్లను ఎదుర్కోవడానికి గ్రౌండ్ బ్రేకింగ్ పరిష్కారాలను ప్రోత్సహించే మిషన్‌కు సహకరించడానికి నేను ఆసక్తిగా ఉన్నాను' అని అన్నారు. బలమైన పర్యావరణ వ్యవస్థ భాగస్వామ్యంతో స్టార్టప్‌లను విజయవంతంగా స్కేలింగ్ చేస్తున్నామని అన్నారు. టీ-హబ్‌లో వివిధ కార్యక్రమాల ద్వారా 2000 స్టార్టప్‌లపై ప్రభావం చూపిందన్నారు. 600 కంటే ఎక్కువ గ్లోబల్, నేషనల్ కార్పొరేట్ భాగస్వాములను కలిగి ఉందని, స్టార్టప్ స్థాయికి సహాయపడటానికి 2000 మెంటార్ కనెక్షన్‌లను అందించిందని తెలిపారు. స్టార్టప్‌లు, ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ ఇన్నోవేషన్ పర్యావరణ వ్యవస్థల మధ్య సహకారాన్ని కొనసాగిస్తుందని చెప్పారు. స్టార్టప్‌లకు ప్రపంచ మార్కెట్ అవకాశాలను అందిస్తుందని చెప్పారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్ : జగన్మోహన్ రెడ్డి



నవతెలంగాణ -సంతోష్ నగర్

విద్యతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని కరస్పాండెంట్ అండ్ ప్రిన్సిపాల్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా ఎం.ఎం.ఆర్ కాలనీ శ్రీశ్రీ హెూం అల్మాస్గూడ బడంగ్ పేట్ బాలాపూర్ మండలం పరిధిలోని వోకాస్ ఐఐటీ అండ్ మెడికల్ అకాడమిక్ కరస్పాండెంట్ అండ్ ప్రిన్సిపాల్ జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ..విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలను అదిరోహించాలని సూచించారు. ఎక్కడ లేని విధంగా ఐఐటీ అండ్ మెడికల్ అకాడమిక్ ఏ కార్పొరేట్ కళాశాలలో లేని విధంగా చదువును పిల్లలకు అందిస్తున్నామన్నారు. వోకాస్ పాఠశాలలో అడ్మిషన్ కావాలని పలువురు విద్యార్థులు కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాలనా వికేంద్రీకరణపై అవగాహనా సదస్సు



నవతెలంగాణ - హస్తినాపురం

తెలంగాణ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం ఎల్బీనగర్ మున్సిపల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ పంకజ, డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డిల ఆధ్వర్యంలో పాలనా వికేంద్రీకరణపై అవగాహనా సదస్సు నిర్వహించినట్లు హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ డివిజన్ను అభివృద్ధి పథంలో నడిపే విధంగా పరిపాలన వికేంద్రీకరణ పూర్తి స్థాయిలో అమలు అయ్యేలా చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, సర్కిల్ పరిధిలోని వివిధ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు .

16న వార్డు కార్యాలయం ప్రారంభం

- జోనల్ కమిషనర్ పంకజం



నవతెలంగాణ -ఎల్బీనగర్

ఈ నెల 16న డివిజన్‌లోనే నూతన వార్డు కార్యాలయం ప్రారంభం కానుందని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ ఎస్. పంకజం తెలిపారు. కమిషనర్ పంకజం ఆధ్వర్యంలో బుధవారం కాప్రా, ఉప్పల్, హయత్ నగర్, ఎల్బీ నగర్, సరూర్ నగర్ డిప్యూటీ కమిషనర్లు, కార్పొరేటర్లు, వార్డు ఆఫీసర్స్, అధికారులతో కలిసి సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జూన్ 16న డివిజన్లోనే వార్డు కార్యాలయం ప్రారంభం కానుందని..ఈ వార్డు కార్యాలయం నుండి పరిపాలన అందిస్తామని చెప్పారు. ఆ వార్డుకు సంబంధించిన అన్ని శాఖల అధికారులు ప్రజా సమస్యలను తీర్చడానికి అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

వనస్థలిపురం:

' సమస్యలు పరిష్కరించడానికే వార్డు కార్యాలయం'

ప్రజా సమస్యలను పరిష్కరించడానికే వార్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి తెలిపారు. జీహెచ్‌ఎంసీ హయత్ నగర్ సర్కిల్ కార్యాలయంలో ఎల్బీ నగర్ జోనల్ కమిషనర్ పంకజ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొని మాట్లాడారు. నూతన వార్డు కార్యాలయం నుంచి ప్రజా సమస్యల పరిష్కారం జరుగుతుందని..వాటి విధివిధానాల గురించి జోనల్ కమిషనర్ తో చర్చించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్, మారుతీ దివాకర్, కార్పొరేటర్లు చింతల అరుణ సురేందర్ యాదవ్, కొప్పుల నరసింహారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదలకు ఖరీదైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ - మీర్‌పేట్

పేదలకు ఖరీదైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సావాల్లో భాగంగా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ ఓ కన్వెన్షన్ హాల్లో తెలంగాణ వైద్యారోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ వైద్య వ్యవస్థను ప్రక్షాళన చేసి పేదలకు ఖరీదైన వైద్యం ఉచితంగా అందించడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. నీతి ఆయోగ్ సర్వేలో మన రాష్ట్రం వైద్య విభాగంలో 3వ, సౌకర్యాల కల్పనలో మొదటి స్థానంలో నిలిచిందని హర్షం వ్యక్తం చేశారు. కరోనా సమయంలో ప్రాణాలు ఫణంగా పెట్టి పనిచేసిన వైద్యులు, నర్సులు, ఆశా వర్కర్ల సేవలు ఎంతో గొప్పవని కొనియాడారు. ప్రభుత్వ ఆసుపత్రిలో 57 పరీక్షలు ఉచితంగా చేస్తున్నారని వివరించారు. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల పై భారం పడకుండా.. 4 సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను నిర్మిస్తున్నట్లు..అందులో రెండు రంగారెడ్డి జిల్లాలోనే రూ.1200 కోట్ల వ్యయంతో వేయి పడకలు ఉండేలా నిర్మిస్తున్నట్లు తెలిపారు.

రంగారెడ్డి జిల్లా పట్టణ ప్రాంతాల్లో ఇప్పటివరకూ 500 బస్తీ దవాఖానలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కంటి వెలుగులో ప్రజలకు ఇస్తున్న అద్దాలు మన తెలంగాణలో తయారవుతున్నాయన్నారు. గర్భిణీ మహిళల్లో రక్తహీనత సమస్యను దూరం చేయటానికి న్యూట్రిషన్ కిట్లను ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లాకో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయటంతో మెడికల్ సీట్లు కూడా భారీగా పెరిగాయన్నారు. పేదలకు ఉచితంగా బీపీ, షుగర్ ట్యాబ్ లెట్లు అందిస్తున్నట్లు, ప్రతి ఒక్కరీ హెల్త్ ప్రొఫైల్ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్, రంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్ పర్సన్ తీగల అనిత రెడ్డి, కలెక్టర్ హరీష్, మేయర్ దుర్గా దీప్లాల్, డిప్యూటీ మేయర్లు తీగల విక్రమ్ రెడ్డి, ఇబ్రహం శేఖర్, ఆర్డీవో సూరజ్ కుమార్, జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర రావు, తహసీల్దార్ జనార్ధన్ రావు, ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి, కార్పొరేటర్లు, ఆశా వర్కర్లు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ధర్నా



నవతెలంగాణ -చైతన్యపురి

మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్, రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను సకాలంలో అందించాలని సరూర్నగర్ మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేశారు. తర్వాత తహసీల్దార్ అందుబాటులో లేని కారణంగా ఆర్ఐకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కౌన్సిలింగ్ కోసం, రాష్ట్ర ప్రభుత్వం కొన్ని బీసీ కులాలకు లక్ష రూపాయల పథకంలో భాగంగా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కోసం మండల కార్యాలయంలో వేలాది మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఈ నెల 20న చివరి తేది కావడంతో వారందరూ తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని తెలిపారు. సాంకేతి కారణాలతో సర్వర్ డౌన్ కావడంతో అటు విద్యార్థులు, ఇటు బీసీ కుల వృత్తుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరగా సమస్యను పరిష్కరించి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను అందజేయాలని కోరారు. లేనియెడల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్, కృష్ణారెడ్డి, కళ్యాణ్, వంగాల శ్రీకాంత్ రెడ్డి, సలీం, శ్రావణ్, పింటూ, ఇస్మాయిల్, అనుదీప్, యూసుఫ్, శివ, జహంగీర్, విజయ్, నగేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి

- మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ - బడంగ్ పేట్

బ్రాహ్మణుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 10వ డివిజన్ కుర్మల్ గూడలో 'బ్రాహ్మణ భవన్'కు బుధవారం మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు అరవింద్ శర్మ, స్థానిక నాయకులతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 9 ఎకరాల్లో రూ.12 కోట్లతో నిర్మించిన బ్రాహ్మణ భవనాన్ని ఇటీవలే ప్రారంభించుకున్నామని, 15 రోజుల వ్యవధిలోనే మహేశ్వరం నియోజకవర్గంలో బ్రాహ్మణ భవనానికి భూమి పూజ చేయటం సంతోషంగా ఉందన్నారు. వేద, శాస్త్ర పండితుల గౌరవ వేతన భృతి రూ.2500 నుండి రూ. 5000 కు పెంచినట్లు చెప్పారు. అంతేకాదు పండితులు గౌరవ భృతి పొందే అర్హత వయస్సు 75 ఏళ్ల నుండి 65 ఏళ్లకు తగ్గించినట్లు తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గంలో అతి పురాతన, ప్రాచీన దేవాలయాలకు పూర్వ వైభవం తెచ్చేలా సుమారు రూ.8కోట్లతో పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఐఐటీ, ఐఐఎంలో చదివే బ్రాహ్మణ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తింపచేస్తున్నామన్నారు. సంస్కృత కవి, వ్యాఖ్యాత కొలచల మల్లినాథ సూరి పేరున రాష్ట్రంలోనే తొలి సంస్కృత విశ్వవిద్యాలయాన్ని మెదక్ లో ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, డిప్యూటీ మేయర్ ఇబ్రహం శేఖర్, కార్పొరేటర్లు బద్రమోని రోహిణి రమేష్, సూర్లగంటి అర్జున్, పెద్దబావి శోభ ఆనంద్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, నాదర్ గుల్ రైతు సేవా సహకార సంఘం బ్యాంకు చైర్మన్ మర్రి నర్సిహ్మారెడ్డి, డీఈఈ జ్యోతి, నాయకులు భీమిడి జంగారెడ్డి, సంరెడ్డి వెంకట్ రెడ్డి, లిక్కి కృష్ణారెడ్డి, ఈఎల్ వి.అశోక్, దానియేలు, ఎల్చల సుదర్శన్ రెడ్డి, గుర్రం వెంకట్ రెడ్డి, జంగయ్య, బ్రాహ్మణ సంఘాల నాయకులు అరవింద్ శర్మ, ప్రమోద్, మాధవి, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

తెలంగాణను హెల్త్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

- ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి



నవతెలంగాణ -ఉప్పల్

తెలంగాణ రాష్ట్రాన్ని హెల్త్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వైద్య, ఆరోగ్య దినోత్సవం భాగంగా రామంతపూర్ డివిజన్లోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్లో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళా ఆరోగ్యం ఇంటికి సౌభాగ్యం, ఆరోగ్యం మహిళ, గర్భిణుల కోసం కేసీఆర్ న్యూట్రిషన్ కిట్‌లను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ నారాయణరావు, ప్రాజెక్ట్ ఆఫీసర్స్ రమాదేవి, డాక్టర్లు సౌందర్య లత, మంజుల, రమాదేవి, శ్రీనివాస్, మెడికల్ సూపర్‌వైజర్ భోగ ప్రకాష్, మల్కాజిగిరి డాక్టర్లు నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆశా వర్కర్లు, వివిధ శాఖల అధికారులు, మహిళా సంక్షేమ సంఘాల లబ్ధిదారులు, బీఆర్ఎస్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర రెడ్డి, జెసిబి రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జల్సాలు చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

- బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి



నవతెలంగాణ - ఎల్బీనగర్

ప్రజలు సమస్యలతో బాధపడుతూ ఉంటే మరోవైపు బీఆర్ఎస్ నేతలు దశాబ్ది ఉత్సవాల పేరిట జల్సాలు చేస్తున్నారని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు సామ రంగారెడ్డి విమర్శించారు. గడ్డి అన్నారం డివిజన్ లోని పలు ముంపు ప్రాంతాలను బుధవారం కార్పొరేటర్ ప్రేమ్ మహేశ్వర్ రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఈ ముంపు ప్రాంతాలను మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిలు పరిశీలించి..సమస్యను పరిష్కరిస్తామని హామీ కూడా ఇచ్చారని గుర్తుచేశారు. కానీ నేటికీ ఈ సమస్య పరిష్కారం కాలేదని మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే ఒక ఇంజనీర్ మాదిరిగా తానే బాక్స్ డ్రైన్ నాలాలను ఇష్టం వచ్చినట్లు వేయిస్తున్నారని ఆరోపించారు. వర్షాకాలం వస్తున్న తరుణంలో డ్రైనేజీ, నాలా పనులను మొదలుపెట్టడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. బాక్స్ డ్రైన్ పనులు చేపట్టిన కాలనీలు.. శ్రీనగర్ కాలనీ, వివేకానంద కానీలలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా మారిందని...డ్రైనేజీ మొత్తం బ్లాక్ అయ్యి ప్రజలు ఇబ్బందులు పడుతూంటే ఎమ్మెల్యే పట్టించుకోవడంలేదని విమర్శించారు.

కార్పొరేటర్ ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి నియోజకవర్గం వ్యాప్తంగా 98 శాతం డ్రైనేజీ పనులు పూర్తైనట్లు సోషల్ మీడియా లో గొప్పలు చెప్పుకుంటున్నారు. కానీ వాస్తవంగా గడ్డిఅన్నారం డివిషన్లో 40 శాతం పనులే పూర్తయ్యాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు జయ ప్రకాష్, సీనియర్ నాయకులు సి.హెచ్ రామ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, పుట్ట ఓంకార్, సందీప్, సాయి తేజేశ్వర్ రెడ్డి, సుబ్బా రెడ్డి, లక్ష్మి ప్రసాద్, ఉమర్, శివ రామ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడిగా కొలన్ శంకర్ రెడ్డి



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ గ్రామానికి చెందిన కొలన్ శంకర్ రెడ్డిని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడిగా నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఎస్సీ మోర్చా నాయకులు గడ్డం వెంకటేష్ ఆధ్వర్యంలో బుధవారం కొలన్ శంకర్ రెడ్డిని పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించి.. శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శంకర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో మూడు సార్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పని చేసినట్లు చెప్పారు. నాలుగో సారి కూడా అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ బ్యాంక్ డైరెక్టర్ కొంతం సంపత్ రెడ్డి, సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ బడంగ్‌పేట్ కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి జోరాల ప్రభాకర్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ ఎస్సీ మోర్చా అధ్యక్షులు గుండె నాగార్జున బాబు, బీజేవైఎం ఉపాధ్యక్షులు క్యారగారి అరవింద్, కామల్ల కుమార్, నెర్రె గోపాల్, బీజేపీ జిల్లా నాయకులు రామిడి మహేందర్ రెడ్డి, గడ్డం మధుతేజ పాల్గొన్నారు.

అంబేద్కర్ నగర్ కాలనీలో పర్యటన



నవతెలంగాణ- ఎల్బీనగర్

సరూర్ నగర్ డివిజన్‌లోని అంబేద్కర్ నగర్ కాలనీలో బుధవారం యువ నాయకులు కొండల్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రికల్ పోల్స్ విరిగిపోయే పరిస్థితిలో ఉందని కాలనీ వాసులు తమ దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. కాలనీ వాసుల విజ్ఞప్తి, మంత్రి సబితా ఇంద్రా రెడ్డి ఆదేశాల మేరకు సరూర్ నగర్ ఏడీ తిరుపతయ్య తో కలసి కాలనీలో పర్యటించినట్లు చెప్పారు. కరెంట్ తీగలు మనుషుల చేతులకు అందే విధంగా ఉన్నాయని అన్నారు. అనంతరం ఈ సమస్యను వారం రోజుల్లో పరిష్కరిస్తానని ఏడీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ మాజీ యూత్ వింగ్ అధ్యక్షులు లోకసాని కొండల్ రెడ్డి, గౌని శ్రీనివాస్ గౌడ్, వార్డ్ మెంబర్ లోడి నర్సింహా గౌడ్, కిల్లా మైసమ్మ దేవాలయ మెంబర్ రాగం సునీల్ యాదవ్, ప్రత్యూష్, కడారి రాజు యాదవ్, ఫయాజ్, గుఫ్రాన్, దేవరాజ్ పాల్గొన్నారు.

చిన్న వయసులోనే నేరాలు..



నవతెలంగాణ-హయత్‌నగర్

జల్సాలకు అలవాటు పడి చిన్న వయసులోనే నేరాలకు పాల్పడిన ఓ బాలుడిని చైతన్య పురి క్రైమ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎల్బీనగర్ డీసీపీ కార్యాలయంలో బుధవారం ఎల్బీనగర్ జోన్ డీసీపీ సాయిశ్రీ మీడియాకు వివరాలు వెల్లడించారు. 16 ఏండ్ల బాలుడు తాగుడు, జల్సాలకు అలవాటు పడ్డాడు. సులభంగా డబ్బు సంపాదించాలని తాళం వేసి ఉన్న ఇండ్లు, ద్వీ చక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో అతడు చైతన్య పురిలో ఖాజానా క్రాస్ రోడ్ వద్ద పట్టుబడగా.. అతనిపై 10 పాత కేసులు ఉన్నాయని తెలిసింది. వెంటనే అతన్ని అదుపులోకి తీసుకొని..అతని వద్ద నుండి 5.1తులాల బంగారం, 20తులాల వెండి, 5 ద్వీ చక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం వాటి విలువ రూ.46వేలు ఉంటుందని అంచనా వేశారు. ఆ బాలుడిపై 5 కేసులు చైతన్య పురి, మరో 5 కేసులు సరూర్ నగర్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో నమోదయ్యాయి. ఆమె వెంట ఎల్బీనగర్ నగర్ ఏసీపీ శ్రీధర్ రెడ్డి, ఎల్బీనగర్ ఇన్‌స్పెక్టర్ అంజి రెడ్డి, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ రావు, క్రైమ్ ఎస్ఐలు నరేందర్, సురేందర్‌లు ఉన్నారు.

రాజా వర్ధన్ రెడ్డికి పితృ వియోగం



నవతెలంగాణ- సంతోష్ నగర్

ఎల్బీనగర్ నియోజకవర్గం చంపా పేట్ డివిజన్ పరిధిలోని సాయిరాం నగర్ కాలనీకి చెందిన సీనియర్ నాయకులు ఎనుముల రాజా వర్ధన్ రెడ్డికి పితృవియోగం జరిగింది. ఎనుముల మాధవ రెడ్డి(87) అనారోగ్య సమ స్యలతో బుధవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి, నల్ల రఘుమారెడ్డి, డివిజన్ అధ్యక్షులు ముడుపు రాజ్ కుమార్ రెడ్డి, తలారి సత్య ప్రకాష్, చీర తిరుమలేష్, నిషికాంత్ రెడ్డి, గూడూరు గౌతమ్ రెడ్డి, బాలకృష్ణ, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, సభ్యులు, ప్రజాప్రతినిధులు అక్కడికి చేరుకొని మాధవరెడ్డి పార్థివ దేహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక నాయకులు, పెద్దలు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు తదితరులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ఘనంగా వీరేందర్ యాదవ్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ- సంతోష్ నగర్

ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని వినయ్ నగర్ కమ్యూనిటీ హాల్లో బుధవారం హైదరాబాద్ జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి వీరేందర్ యాదవ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు శుభాకాంక్షలు తెలిపి.. పూలమాలలతో, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వెంకట్ రామిరెడ్డి, దయాకర్ రెడ్డి, జిట్టా ప్రసాద్, సత్య ప్రకాష్, వెంకట్ రెడ్డి, సత్య నారాయణ, పార్టీ సీనియర్ నాయకులు, పార్టీ శ్రేణులు, నాయకులు, మిత్రులు బంధువులు పాల్గొన్నారు.



రాష్ట్రానికి తలమానికగా ఎల్బీనగర్ టిమ్స్ హాస్పిటల్

- ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



నవతెలంగాణ-హాయత్ నగర్

రాష్ట్రానికి తలమానికగా ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని చైతన్య పురిలో నిర్మిస్తున్న 1000 పడకల టిమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఉంటుందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మన్సూరాబాద్ పరిధిలో ఉన్న కామినేని హాస్పిటల్ ఆడిటోరియంలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వైద్య, ఆరోగ్య దినోత్సవం సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన మరోవరం టిమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అని , చైతన్య పూరి ఫ్రూట్ మార్కెట్ స్థలంలో దాదాపు రూ.1200 వందల కోట్లతో 1000 పడకల ఆసుపత్రిని కానుకగా ఇచ్చారని కొనియాడారు. బస్తీ, పల్లె దవాఖానలు, తెలంగాణ డయాగ్నస్టిక్స్, ఆరోగ్య శ్రీ, ఎంప్లాయిస్ అండ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీం, ఉచిత డయాలసిస్ కార్యక్రమం, 108 అత్యవసర ఆరోగ్య రవాణా సేవలు, పాలియేటివ్ కేర్, కంటి వెలుగు పథకం కింద మొదటి దశలో 1 కోటి మందికి పరీక్షలు, 40 లక్షల మందికి కంటి అద్దాలు, రెండో దశలో 1 కోటికి పైగా కంటి పరీక్షలు, 29 లక్షల మందికి ఉచితంగా అద్దాల పంపిణీ, పేద, బడుగు, బలహీన వర్గాల వారికి నాణ్యమైన వైద్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని వివరించారు. తెలంగాణ రాష్ట్రం వైద్యారోగ్య రంగంలో సాధించిన ప్రగతి దేశంలోని ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలే కరువైన ఉమ్మడి పాలనలో.. నాటి గడ్డు పరిస్థితుల నుంచి నేడు తెలంగాణలో జిల్లాకో వైద్య, విద్య, పారామెడికల్, నర్సింగ్ కాలేజీలను స్థాపించుకునే దశకు చేరుకున్నామన్నారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్స్, తదితర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయనంద్ గుప్తా, సరూర్ నగర్ ఎంఆర్‌వో జయశ్రీ, వైద్య అధికారులు అనిత, హరిప్రియ, స్వామి, వినోద్, అర్చన, ఫులెందర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'బాల కార్మికులు కనిపిస్తే..1098, 100కు ఫోన్ చేయండి'



నవతెలంగాణ-వనస్థలిపురం

బాల కార్మికులు కనిపిస్తే..1098 లేదా 100కు ఫోన్ చేయాలని వనస్థలిపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి. జలంధర్ రెడ్డి కోరారు. అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం లైట్, జాగృతి అభ్యుదయ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సాహెబ్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా జాగృతి చైర్మన్ భావన శ్రీనివాస్ సభాధ్యక్షతన విద్యార్థులకు అవగాహన చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వనస్థలిపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేరం అంటే ఏమిటి..?, చట్టాలు ఎవరు చేస్తారు, వాటిని అమలు చేసే యంత్రాంగం, అతిక్రమిస్తే పడే శిక్షలేమిటనే విషయాలను విద్యార్థులకు వివరించారు. బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, అధిక సెల్ ఫోన్ వినియోగంతో ఎదురయ్యే అనార్థాలపై పిల్లలను ప్రశ్నలతో ముం చెత్తుతూ, అభినందిస్తూ తనదైన శైలిలో విద్యార్థులను ఉత్తేజ పరిచారు. లైట్ అధ్యక్షులు, హైదరాబాద్ జిల్లా బాలల సంక్షేమ సమితి విశ్రాంత చైర్ పర్సన్ పి.శ్యామలా దేవి మాట్లాడుతూ 14 ఏండ్ల నుంచి 18 ఏండ్ల వయసు యువత ప్రమాదకర పనుల్లో ఉండరాదని చట్టం ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లీలారాణి, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ నవనీ, ఉమేష్ యాదవ్, యాదా రామలింగేశ్వరరావు, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



నవతెలంగాణ- ఘట్కేసర్

ప్రజా ఆరోగ్యమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఘట్కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అన్నారు. ఘట్కేసర్ మున్సిపాలిటీ ప్రభుత్వ ఆసుపత్రిలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల భాగంగా వైద్య ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్మిక ఉపాధి శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి ఆదేశాల మేరకు బుధవారం గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను ప్రభుత్వాసుపత్రిలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముల్లి పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ పుట్టబోయే బిడ్డలో పోషకాహారలోపాన్ని నివారించేందుకు ఆరోగ్య లక్ష్మి పథకంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు పోషకాహారం అందిస్తున్నట్లు తెలిపారు. న్యూట్రిషన్ కిట్‌లో మొత్తం 8 రకాల వస్తువులు ఉంటాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 6.8 లక్షల మంది గర్భిణులకు ఈ రోజు నుంచి కిట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే న్యూట్రిషన్ కిట్ల కోసం ప్రభుత్వం రూ.250 కోట్ల బడ్జెట్ కేటాయించిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పలువుల మాధవరెడ్డి, కౌన్సిలర్లు రమాదేవి, బండారి ఆంజనేయులు గౌడ్, ఎస్.కె జహంగీర్, బండారు వసంత, బేతల నర్సింగ్ రావు, కూతాడి రవీందర్, బీఆర్ఎస్ నాయకులు ఎండి సిరాజ్, వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యురాలు అబ్బ గోని మీనా గౌడ్, ఘట్కేసర్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు బర్ల హరిశంకర్ ముదిరాజ్, మాజీ వార్డ్ సభ్యుడు రహీం, వైద్య అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ స్కూళ్ల అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి'



నవతెలంగాణ - హస్తినాపురం

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని హస్తినాపురం డివిజన్ భూపేష్ గుప్తా నగర్ కాలనీ అధ్యక్షులు, మీకోసం మేమున్నాం ఫౌండేషన్ రూపకర్త నారగోని శ్రీనివాస్ యాదవ్‌లు కోరారు. ప్రాథమిక పాఠశాలలో బుధవారం నిర్వహించిన బడిబాట - సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో టీచర్ల కొరతను దృష్టిలో ఉంచుకొని మీకోసం మేమున్నాం ఫౌండేషన్ ద్వారా వీలైనంత సహాయం చేసే విధంగా తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కందకట్ల శివకుమార్ రెడ్డి, నరేష్ యాదవ్, ప్రధానోపాధ్యాయులు జి. డేవిడ్, ఉపాధ్యాయులు టి. నాగమణి, విజయ్ కుమార్, డి. మాధవి దేవి, ఎం. వేణుగోపాల్, బి, సంఘమిత్ర, పి. సునీత, ఎస్. రాజ్యలక్ష్మి, అంగన్ వాడీ టీచర్లు అనంతలక్ష్మి, రేణుక, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'దశాబ్ది ఉత్సవాలతో ప్రజా ధనం వృథా'



నవతెలంగాణ - ఘట్కేసర్

దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజా ధనాన్ని బీఆర్ఎస్ నేతలు వృథా చేస్తున్నారని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేశపావుల వినోద్ కుమార్ విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. ఘట్కేసర్ మండలంలోనే అతిపెద్ద గ్రామపంచాయతీ అయిన చౌదరిగూడ అంధకారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ గ్రామంలో 40 శాతం పైగా విద్యుత్ దీపాలు లేక ప్రజలు అయోమయానికి గురవు తున్నారని వాపోయారు. ఈ విషయంపై ఎన్నిసార్లు పంచాయతీ ఆఫీస్ లో సర్పంచ్ ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపో యిందన్నారు. ఉత్సవాల పేరుతో ధనాన్ని వృథా చేసే బదులు..అంధకారంగా మారిన చౌదరిగూడలో వెలుగులు నింపాలని కోరారు.

క్షతగాత్రుడిని పరామర్శించిన మాజీ మేయర్ రామ్మోహన్

నవతెలంగాణ-కాప్రా



ఉప్పల్ నియోజకవర్గం జమ్మిగడ్డ నివాసి అయిన చంద్రయ్య యాదవ్ కుమారుడు సాయి యాదవ్ జమ్మిగడ్డ వద్ద జరిగిన లారీ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ఈసిఐఎల్‌లోని శ్రీకర హాస్పటల్ చేరుకొని డాక్టర్లతో మాట్లాడి సాయి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్‌లకు సూచించారు. అవసరం అయితే నిమ్స్ ఆస్పత్రికి తరలిస్తే అక్కడ మెరుగైన వైద్యం అందేలా చూస్తానని అన్నారు. తక్షణ ఆర్థిక సహాయంగా బాధిత కుటుంబానికి రూ. 10,000 అందచేసి ఎల్లవేళలా కుటుంబానికి తోడుగా ఉంటామని హామీ ఇచ్చారు.

లక్ష్మారెడ్డిని కలిసిన చిలుకానగర్ ఆటో యూనియన్ సభ్యులు

నవతెలంగాణ-కాప్రా



బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డిని సైనిక్ పూరిలోని తన కార్యాలయంలో చిలుకానగర్ ఆటో యూనియన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి తమ సమస్యలను పరిష్కరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి తమ దష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధి మాస శేకర్, ఆటో యూనియన్ అధ్యక్షుడు యాదగిరి, రఫిక్, మల్లేశ్, తిరుపతి, వెంకటేశ్,శివ శంకర్, శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రగతి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు తెలియజేయాలి
- జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఒక్కో కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా అత్యద్భుతంగా నిర్వహిస్తున్నామని, అదే విధంగా ఈనెల 15న తెలంగాణ పల్లె ప్రగతి దినోత్సవాన్ని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా బుధవారం నిర్వహించనున్న పల్లె ప్రగతి దినోత్సవానికి సంబంధించి ఏర్పాట్లపై కలెక్టర్ జిల్లా పంచాయతి అధికారి రమణమూర్తికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ జరిగి పదేండ్లవుతున్న ప్రస్తుత తరుణంలో జిల్లాలోని ప్రతీ గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు జాతీయ జెండా ఎగుర వేయాలని సూచించారు. అనంతరం పల్లె ప్రగతి ద్వారా, జిల్లాలోని ఆయా గ్రామాలకు, తండాలకు వచ్చిన నిధుల వివరాలను, అందులో ప్రభుత్వం ద్వారా చేపట్టిన ఆయా సంక్షేమ పథకాలను తెలియజేయాలని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకల ద్వారా ఆయా గ్రామాల ప్రజలకు జరిగిన లబ్ధిని, గ్రామంలో నిర్మించిన మౌలిక వసతుల వివరాలను సమావేశం నిర్వహించి ప్రకటించాలని సూచించారు. రాష్ట్రం రాక ముందు నాటి పరిస్థితులను అద్దం పట్టేలా తెలియజేయాలని అదే సమయంలో ప్రస్తుత 9 ఏండ్ల కాలంలో జరిగిన అభివద్ధి, గ్రామ పారిశుధ్యం, పచ్చదనం, పంచాయతీలకు ట్రాక్టర్లను అందించడం, పక్కా భవనాల నిర్మాణం, అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ, క్రీడా ప్రాంగణాలు, హరితహారం ద్వారా మొక్కల పెంపకం, పల్లెప్రకతి వనాలు, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు వంటి అనేక అభివద్ధి జరిగిన వివరాలను ఫొటోలతో సహా చూపించాల్సిందిగా కలెక్టర్ సూచించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత పల్లెల్లో ఎన్నో వసతులు సమకూరాయని పట్టణాల్లో ఉన్న వారు కూడా తిరిగి తమ సొంత గ్రామాలకు వస్తున్నారని ఈ విషయాలను సభలో వివరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆయా రంగాల్లో జాతీయ స్థాయిలో సాధించిన అవార్డుల వివరాలను తెలియచేయాలని, ప్రజా సంక్షేమానికి, పంచాయతీరాజ్ ద్వారా వస్తున్న నిధుల వివరాలతో ఊరూరా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామంలో జరిగిన అభివద్ధిని తెలియజేస్తూ ఫ్లెక్సీలు పెట్టాలని ఫొటోలతో బ్రోచర్ల మాదిరిగా తయారుచేసి పంచాలన్నారు. ఈ సమావేశంలో పల్లెప్రగతి విజయాలను, జాతీయ స్థాయిలో సాధించిన అవార్డులను పేర్కొనాలన్నారు. పారిశుధ్యం మెరుగు పడటం వల్ల సీజనల్ వ్యాధులు తగ్గిపోయిన తీరును ప్రముఖంగా ప్రస్తావించాల్సిందిగా కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం గ్రామీణ జీవన ప్రమాణాలు పెరిగిన తీరును ప్రస్తావించి ఉత్తమ గ్రామ పంచాయతీల సర్పంచులకు, ఉత్తమ మండలాల ఎంపీపీలకు సన్మానం. చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో జిల్లా పంచాయతీ అధికారి,తో పాటు ఆయా మండలాల ఎంపీడీవోలు, తహశీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ నిబంధలు, సూచనల ప్రకారం పల్లెప్రగతి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకొనేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ ఇల్లు సంతోషంగా ఉంటుంది

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
- రాంగోపాల్‌పేటలో ఆరోగ్య మహిళ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి



నవతెలంగాణ-బేగంపేట్

ఏ ఇంట్లోనైనా మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ ఇల్లు ఎంతో సంతోషంగా ఉంటుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మహిళల ఆరోగ్య సంరక్షణను దష్టిలో ఉంచుకొని ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. బుధవారం రాంగోపాల్ పేట డివిజన్ పాన్ బజార్ లో గల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలో 8 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 2 బస్తీ దవాఖానాలలో ఆరోగ్య మహిళ కార్యక్రమం కింద 57 రకాల పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. షుగర్, బిపి, క్యాన్సర్, సంతాన సమస్యలు, అంటువ్యాధులు వంటి ప్రధానంగా మహిళలు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలకు సంబంధించి పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్యం, సలహాలు అందిస్తారని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వ హాస్పిటల్స్‌ను ఎంతో అభివృద్ధి చేయడం జరిగిందని, అనేక వైద్య సేవలు, పరీక్షలు ఉచితంగా అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. అన్ని రకాల సౌకర్యాలు కల్పించడం వల్ల ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగిందని అన్నారు. కార్పోరేట్ హాస్పిటల్స్‌కు ధీటుగా ప్రభుత్వ హాస్పిటల్స్ లలో మెరుగైన వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నట్టు చెప్పారు. పేద, మధ్య తరగతి ప్రజలను దష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఎంతో బాధ్యతతో వైద్య రంగం అభివద్ధికి విశేష కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్రం మెడికల్ హబ్‌గా మారుతుందని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు, అందిస్తున్న సౌకర్యాల గురించి విస్తత ప్రచారం నిర్వహించి ప్రజలు వినియోగించుకొనే విధంగా చూడాలని మంత్రి వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందిని ఆదేశించారు. హాస్పిటల్ అభివద్ధికి ఇంకా చేపట్టవలసిన చర్యలు ఏమైనా ఉంటే వాటిని పరిష్కరించేందుకు కషి చేస్తానని తెలిపారు. హాస్పిటల్ ముందు రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా హాస్పిటల్‌లో ఉన్న డ్రయినేజీ సమస్యను కూడా మూడు రోజులలో పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. కార్పొరేటర్ సుచిత్ర, మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ గౌడ్, ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ రాజశ్రీ, హాస్పిటల్

ఆదర్శవంతమైన జవహర్‌నగర్‌ను తీర్చిదిద్దుతాం

- మేయర్ మేకల కావ్య
- రూ.30లక్షలతో ప్రగతి పనులు ప్రారంభం



నవతెలంగాణ-జవహర్‌నగర్

ఆదర్శవంతమైన నగరంలా జవహర్ నగర్‌ను తీర్చిదిద్దుతానని మేయర్ మేకల కావ్య అన్నారు. బుధవారం కార్పొరేషన్ లోని 14వ డివిజన్ కార్పొరేటర్ ఆలూరి సంగీతా రాజశేఖర్, 23వ డివిజన్ కార్పొరేటర్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డిల ఆధ్వర్యంలో రూ. 30లక్షలతో ప్రగతి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కార్పొరేషన్‌లో ఎక్కడ చూసిన ప్రగతి పనులతో పరుగులు పెడుతుందని, మంత్రి మల్లారెడ్డి సహకారంతో జవహర్‌నగర్ మోడల్ సిటీగా మారుతుందని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం అంటేనే బీఆర్ఎస్ అని... తెలంగాణ ప్రభుత్వంలోనే సబ్బండ వర్గాలు సంతోషంగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ శ్రీనివాస్ బీఆర్ఎస్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



ఓల్డ్ ఏజ్ హెూమ్‌కు ఎమ్మెల్యే శంకుస్థాపన

నవతెలంగాణ-కాప్రా

ఏఎస్ రావు నగర్ డివిజన్‌లోని ఓల్డ్ ఏజ్ హెూమ్ శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి హాజరై స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్మాణానికి రూ. 5 లక్షల సహాయం చేసిన దాత లక్ష్మణరావును ఎమ్మెల్యే శాలువతో సత్కరించారు . ఈ కార్యక్రమంలో అధ్యక్ష , కార్యదర్శులు రాజేశ్వం రావు, కష్ణమూర్తి, సీనియర్ సిటిజన్స్, బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి, నాయకులు కాసం మహిపాల్ రెడ్డి, కుమారస్వామి, బేతల బాల రాజు, మురళి పంతులు, శ్రీనివాస్ రెడ్డి, ఎనుగు సీతారామరెడ్డి, కాసం వెంకట హరి, రాజిరెడ్డి, గిరి, నరసింహ,రాజు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేగువేరా జయంతి



నవతెలంగాణ-కాప్రా

సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కమలానగర్ జిల్లా పార్టీ ఆఫీస్‌లో ప్రపంచ కమ్యూనిస్టు నాయకుడు విప్లవ యోధుడు చేగువేరా జయంతి సందర్భంగా సభ నిర్వహించారు. ముందుగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోమటి రవి, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, విద్యార్థి నాయకులు సంతోష్‌లు చేగువేరా చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమానికి పార్టీ సీనియర్ నాయకులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. కోమటి రవి మాట్లాడుతూ ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలో ఆరితేరిన విప్లవ యోధుడు చేగువేరా అన్నారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి ఫెడరల్ కాస్ట్రోతో కలిసి క్యూబా విప్లవం జయప్రదానికి గెరిల్లా పోరాట పద్ధతి ద్వారా విజయం సాధించారని చెప్పారు. తను 38 సంవత్సరాలు బతికినా కష్టజీవుల పోరాటాలలో నిరంతరం చేగువేరా నిలుస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సభికులందరూ చేగువేరా చిత్రపటానికి పూలను అర్పించి నివాళిగా నినాదాలు చేశారు. పార్టీ సీనియర్ నాయకులు శ్రీమన్నారాయణ, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, సామాజిక ఉద్యమ నేత ప్రసాద్ బాబు, జి శివరామకష్ణ, ఆర్ ఎస్ ఆర్ ప్రసాద్, శోభా, గౌసియా, రవి, బంగారు నర్సింగరావు, ఉన్నికృష్ణన్, సాంబశివరావు, జాన్ తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ అన్నానగర్‌లో షీ టాక్స్



నవతెలంగాణ-కంటోన్మెంట్

తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మెన్ మన్నె క్రిశాంక్ కంటోన్మెంట్‌లోని అన్నానగర్‌లో షీ టాక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు 40 మంది యువతులు ఈ కార్యక్రమములో పాల్గొన్నారు వివిధ అంశాలపై తమ ఆలోచనలను పంచుకున్నారని, వారి ఆలోచనలను వినడం చాలా ఆనందంగా ఉందని క్రిశాంక్ అన్నారు అలాగే ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళలకు చేపడుతున్నటువంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు కూడా వారికి వివరించారు. అంతకుముందు, దళిత బంధుపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని యువతులు క్రిశాంక్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల, రేణుక, స్వాతి, గౌతమి, హారిక, మీనా, దివ్య, ఆశ , శ్రీలత, శివాని తదితరులు పాల్గొన్నారు..



సనత్‌నగర్‌లో ఆరోగ్య మహిళా కార్యక్రమం

నవతెలంగాణ-బేగంపేట్

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశాల మేరకు బుధవారం సనత్ నగర్‌లో యూపీహెచ్‌సీ, ఈఎస్ఐ యూపీహెచ్‌సీ ఆరోగ్య మహిళా కార్యక్రమంలో కార్పొరేటర్ కోలను లక్ష్మీ బాల్ రెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో పథకాలను తీసుకువచ్చారని తెలిపారు. కార్పొరేట్ హాస్పిటల్స్‌లోనే కాకుండా గవర్నమెంట్ హాస్పిటల్స్‌లో ఎన్నో రకాల వైద్య సదుపాయాలు ముఖ్యమంత్రి చొరవతో మంత్రి తలసాని సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలో చేసి చూపించారన్నారు. రోజు రోజుకి మహిళలు, గర్భిణులు అనేక రకాల ఉచిత వైద్య పరీక్షలు చేయించుకొని సంతోషంగా ఉంటున్నారని ఆనందం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో సనత్ నగర్ యూపీహెచ్‌సీ డాక్టర్ సౌమ్య, ఈఎస్ఐ యూపీహెచ్‌సీ డాక్టర్ శిల్ప పీహెచ్ఎన్‌లు, ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు, ఆశ వర్కర్స్, డివిజన్ అధ్యక్షులు కోలను బాల్ రెడ్డి, పుష్పలత, ఝాన్సీ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నాం

- కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి



నవతెలంగాణ-నాచారం

కార్మిక రాజ్య బీమా ఈఎస్ఐ ఆస్పత్రి ద్వారా కార్మికులకు మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. బుధవారం నాచారం ఈఎస్ఐ ఆస్పత్రిలో తెలంగాణ వైద్య ఆరోగ్య దినోత్సవంలో భాగంగా రక్తదాన శిబిరాన్ని ఈఎస్ఐ లేబర్ వార్డ్ లేబరేటరీ ఆఫ్ మెడిసిన్ ఫిజియోథెరపీలను ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ



దశాబ్ది ఉత్సవాలలో భాగంగా అన్ని రంగాలను అభివృద్ధి వైపు తీసుకుపోయే బాధ్యతను ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టడం అభినందనీయమని అన్నారు. కరోనా లాంటి విపత్తుకర పరిస్థితులలో వైద్య ఆరోగ్య రంగాలు ఎదురొడ్డి నిలబడి ప్రజలకు సేవలు అందించి దేశానికి ఆదర్శంగా నిలిచాయని గుర్తు చేశారు. నాచారం ఈఎస్ఐ కార్మికులకు ఆరోగ్య హబ్బుగా మారుస్తామని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఎస్ఐ ఆస్పత్రి సూపరిటెండెంట్ డాక్టర్ కమల, ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్, వైద్యులు, నర్సులు, ఆస్పత్రి బోర్డు డైరెక్టర్ వేముల మారయ్య జిల్లా గ్రంథాలయ చైర్మెన్ దుర్గా దయాకర్ రెడ్డి, కార్పొరేటర్లు పన్నాల దేవేందర్ రెడ్డి, జెర్రిపోతుల ప్రభుదాస్, బీఆర్ఎస్ నాయకులు మేకల ముత్యంరెడ్డి, అంజి, రాజు, రమేష్, పాల్గొన్నారు.

హ్యాట్రిక్ ప్రభుత్వం బీఆర్ఎస్ దే : మంత్రి

మేడ్చల్ కలెక్టరేట్ : రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని మంత్రి మల్లారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని 7వ వార్డు నాసిన్ చెరువు నుంచి వికాస్ నగర్ పార్కు వరకు రూ. 73 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న బీటీ రోడ్డుకు శంకుస్థాపన, మున్సిపల్ చైర్పర్సన్ వసూపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్‌తో కలిసి హరిదాస్ పల్లి రోడ్డులో దమ్మాయిగూడ మున్సిపాల్టీకి కేటాయించినా శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు సుమారు రూ.1 కోటితో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివద్ధి చెందుతుందన్నారు. రాష్ట్రం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. గతంలో జవహర్ నగర్ డంపింగ్ యార్డు నుంచి దుర్వాసన వచ్చేదని బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కోట్ల రూపాయలు కేటాయించి దుర్వాసన రాకుండా ఏర్పాట్లు చేస్తున్నదన్నారు. దమ్మాయి గూడా మున్సిపాల్టీలో ప్రధాన సమస్యలు పరిష్కరిం చేందుకు తన వంతు సహకారం చేస్తున్నానని తెలిపారు. వైస్ చైర్మెన్ మాదిరెడ్డి నరేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ స్వామి, కౌన్సిలర్లు నాను నాయక్ , నాగయపల్లి సుజాత ,కొత్త హేమలత ,మంగళ్ పూరి వెంకటేష్ , కొత్త సురేఖ ,మాదిరెడ్డి పావనిరెడ్డి, సంపంన్ బోల్ స్వప్న ,గురువెల్లి వెంకటరమణ, పాండాల అనురాధ, వసుపతి రమేష్ ,మాదిరెడ్డి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గొల్నాక డివిజన్ సీపీఎల్ గేట్ ఎదురుగా ఉన్న జైస్వాల్ గార్డెన్ వద్ద గత 15 రోజులుగా డ్రయినేజీ పొంగి పొర్లుతూ ఉన్నప్పటికీ జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్ డిపార్మెంట్ అధికారులు పట్టించుకోవట్లేదని బీజేపీ నాయకులు బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు. నవతెలంగాణ-సిటీబ్యూరో

ఘనంగా జేఎస్ఆర్ పుట్టినరోజు వేడుకలు

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

బీఆర్ఎస్ కీసర మండల అధ్యక్షుడు జలాల్ పురం సుధాకర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. తన పుట్టినరోజు పురస్కరించుకుని పంచాయతీ కార్మికులకు కొత్త బట్టలు ,వృద్ధాశ్రమంలోని అనాథలకు బిర్యానీ ప్యాకెట్‌లను అందజేశారు. మండలంలోని బీఆర్ఎస్ నేతలు పెద్ద ఎత్తున తరలివచ్చి కేక్ కట్ చేసి శాలువాతో సన్మానించారు.



ఎయిర్‌పోర్టు మెట్రో కోసం ప్రీ బిడ్ సమావేశం

నవతెలంగాణ-సిటీబ్యూరో



తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎయిర్‌పోర్ట్ మెట్రో ప్రాజెక్టును చేపట్టిన విషయం తెలిసిందే. 31 కి.మీ మీటర్ల పొడవైన ఎయిర్‌పోర్టు మెట్రో ప్రాజెక్టుకు ఈపీసీ కాంట్రాక్టర్ ఎంపిక కోసం(ఇంజనీరింగ్, సేకరణ, నిర్మాణం) ఆహ్వానించిన గ్లోబల్ టెండర్లకు కొనసాగింపుగా బుధవారం ప్రీ-బిడ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాతీయ, అంతర్జాతీయ కంపెనీలైన ఎల్అండ్‌టీ, అల్స్టోమ్, సిమెన్స్, టాటా ప్రాజెక్ట్స్, ఇరకాన్, ఆర్వీఎన్ఎల్, బీఈఎంఎల్, పాండ్రోల్ రహీ పాల్గొన్నాయి. ఈ సందర్భంగా హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి బిడ్డర్‌లకు ఎయిర్‌పోర్ట్ మెట్రో ప్రాజెక్ట్ ప్రాముఖ్యత, పలు ముఖ్యమైన అంశాలను వివరించారు. రూ.6,250 కోట్ల ప్రాజెక్ట్‌లో హెచ్ఎండీఏ, జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్ ద్వారా 10శాతం సహకారంతో పాటు తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా నిధులు సమకూరుస్తుందని, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఈ ప్రాజెక్టు పురోగతిని పర్యవేక్షిస్తున్నారని ఎన్వీఎస్ రెడ్డి ఈ సందర్భంగా బిడ్డర్లకు చెప్పారు. ఎయిర్‌పోర్టు మెట్రో ప్రాజెక్టు చేపట్టే కాంట్రాక్టర్ సెప్టెంబర్ నుంచి గ్రౌండ్ వర్క్‌ను తప్పనిసరిగా ప్రారంభించి.. మూడేండ్లలో పూర్తి చేయాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. అనంతరం మెట్రో ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి బిడ్డర్ల సందేహాలపై సుదీర్ఘంగా చర్చించారు. వారు అడిగిన వాటికి ఎన్వీఎస్ రెడ్డితో పాటు అతని సాంకేతిక బృందం సమాధానం చెప్పారు. అనంతరం మెట్రో ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి బిడ్డర్ల ప్రశ్నలు, సందేహాలపై సుదీర్ఘంగా చర్చించగా.. వాటిపై ఎన్వీఎస్ రెడ్డితో పాటు అతని సాంకేతిక బృందం సవివరంగా చెప్పారు. ఈ సమావేశంలో హెచ్ఏఎంఎల్ అడ్వైజర్(సివిల్ ఇంజనీరింగ్) సుబోధ్ జైన్, చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ డీవీఎస్ రాజు, చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ బి.ఆనంద్ మోహన్, జనరల్ మేనేజర్ ఎం.విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్ఈ వై సాయప రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ (రైల్వే) జేఎస్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

కోఠి ఈఎన్‌టీ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని కోఠి ఈఎన్‌టీ హాస్పిటల్‌లో బుధవారం తెలంగాణ వైద్య ఆరోగ్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్, ఆర్ఎంఓ డాక్టర్ జయ మనోహరి, డాక్టర్ ఎల్.సుదర్శన్ రెడ్డి, డాక్టర్ సంపత్ కుమార్ సింగ్, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ఆశిష్ దొర, ఆఫీస్ సూపరింటెండెంట్ సునీల్, సీనియర్ అసిస్టెంట్ బి.రాజు, జూనియర్ అసిస్టెంట్ రవి, ఎల్‌టీ రాజేందర్, టి.రాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఉస్మానియా ఆస్పత్రి డాక్టర్, వైద్య సిబ్బందికి అవార్డులు

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని పానీపూర క్లస్టర్ డాక్టర్ మల్లీశ్వరి ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఉస్మానియా హాస్పిటల్ డాక్టర్ మాధవి, హెచ్ఎన్ శిరీష రాణి, ఎస్ఎన్ రూబియానా, నాగవేణి, ధనలక్ష్మి, బాసప్ప, శారదా సురేఖలకు అవార్డును, ప్రశంస పత్రాలను ఉస్మానియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్, ఎస్‌పీహెచ్ఓ డాక్టర్ మల్లేశ్వరి, నర్సింగ్ సూపరింటెండెంట్ సుజాత రాథోడ్ అందజేశారు.

అన్ని సౌకర్యాలతో వార్డు కార్యాలయాలను సిద్ధం చేయాలి

- సమీక్షా సమావేశంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-సిటీబ్యూరో



నూతనంగా ఏర్పాటు చేయనున్న వార్డు కార్యాలయాల్లో అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఈనెల 16 నుంచి నగరంలో 150 కార్పొరేట్ పరిధిల్లో వార్డు కార్యాలయాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో వార్డు పరిపాలనపైన బుధవారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, కమిషనర్ లోకేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ఈనెల 16న వార్డు కార్యాలయాల ప్రారంభోత్సవాలకు మంత్రులను, ఎమ్మెల్సీలను, శాసనసభ్యులను, కార్పొరేటర్‌లను, మేయర్, డిప్యూటీ మేయర్లను ముఖ్య అతిథులుగా ఆహ్వానించాలని సూచించారు. వార్డు కార్యాలయం ఉదయం 8:30 గంటలకు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని వార్డు కార్యాలయలను సుందరంగా తీర్చిదిద్దాలనీ, కార్యాలయాల ముందు టెంట్, మైక్, షామియానా వేయ్యాలన్నారు. జోనల్ కమిషనర్‌లు ప్రతీ వారం వార్డు కార్యాలయాలను పర్యవేక్షించాలన్నారు. ఈ సమావేశంలో ఇంజినీర్ ఇన్ చీఫ్ జీయాఉద్దిన్, జోనల్ కమిషనర్లు శ్రీనివాస్ రెడ్డి, రవి కిరణ్, మమత, పంకజ, సామ్రాట్ అశోక్, డిప్యూటీ కమిషనర్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో ఆమ్ ఆద్మీ అద్భుతమైన పెరుగుదల



నవతెలంగాణ-హిమాయత్ నగర్

దేశవ్యాప్తంగా ఆమ్ ఆద్మీ సామ్రాజ్యం వేగంగా విస్తరించడంతో పాటు తెలంగాణలో అద్భుతమైన పెరుగుదల కనిపిస్తుందని ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ పేర్కొన్నారు. అవినీతి, నేరపూరిత, మతపరమైన స్వభావాలతో ప్రజలు విసిగిపోయి, నిజాయితీ, ప్రత్యామ్నాయ రాజకీయాల ఆలోచనతో ఉన్న ఆమ్ ఆద్మీని ప్రత్యేకంగా ప్రజలు ఆదరిస్తున్నారని తెలిపారు. బుధవారం హిమాయత్‌నగర్, లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏఐటీయూసీ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ మాజీ నాయకులు రుద్రాక్ష మల్లేష్ నేతృత్వంలో సలావుద్దీన్, ఆనంద్, ఎండి.ఫరూక్ తో పాటు పలువురు డాక్టర్ దిడ్డి సుధాకర్ సమక్షంలో ఆమ్ ఆద్మీలో చేరారు. ఈ సందర్భంగా దిడ్డి సుధాకర్ ఆప్ ఖండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. నూతనంగా ఆప్ తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలు సామాన్య ప్రజలపై తీవ్ర ప్రభావాన్ని చూపాయన్నారు. ప్రజలు జీవించ లేని స్థితిలోకి నెట్టివేశాయన్నారు. నేడు రోజువారీ జీవితం, జీవనోపాధిపై ఎక్కువ శ్రద్ధ కనబరుస్తూ ఢిల్లీ మాదిరిగా సంక్షిప్త పాలన కోరుకుంటున్నారని తెలిపారు. ఇటీవలే జరిగిన ఎన్నికల్లో పంజాబ్‌లో విజయం సాధించడంతో పాటు కొన్ని రాష్ట్రాల్లో ఎమ్మెల్యేలుగా గెలవడంతో ఓట్ల శాతం పెరిగి ఆమ్ ఆద్మీకి జాతీయ పార్టీగా హోదా లభించిందని గుర్తు చేశారు. ఇది దేశ ప్రజలకు బీజేపీ ఆధిపత్యాన్ని సవాలు చేయగల పార్టీ ఆప్ ఒక్కటే అనే ఆశను రేకెత్తించేలా చేసిందన్నారు. అవినీతికి వ్యతిరేకంగా నిలుస్తూ, రోడ్లు, ఉచిత విద్యుత్, నీరు, ఆరోగ్యం, విద్య అందిస్తున్న ఆప్ ప్రభుత్వాలను చూసి దేశ ప్రజలు ఇది ప్రజల సమస్యలను పరిష్కరించే రాజకీయ పార్టీగా స్వాగతిస్తున్నారన్నారు. తెలంగాణ అంతటా బలమైన పార్టీ నిర్మాణాన్ని చేపడుతున్నామనీ, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ సత్తా చాటుతుందని చెప్పారు. స్వచ్ఛ రాజకీయాలను కోరుకునే సామాన్య పౌరులకు ఆప్ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆప్ తెలంగాణ ప్రొఫెషనల్ కమిటీ కన్వీనర్ జి.హరిచరణ్, రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు ఎండి.మజీద్, డా.పుట్ట పాండు రంగయ్య, నేతలు అఫ్జల్, జావేద్ షరీఫ్, ఫణి భూషణ్, సోహైల్, తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని ఆవిష్కరణల దిశగా అడుగులు వేయాలి



నవతెలంగాణ-ఓయూ

ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని మరిన్ని ఆవిష్కరణల దిశగా శాస్త్రవేత్తలు, పరిశోధకులు ముందడుగు వేయాలని ఓయూ వీసీ ప్రొ.రవీందర్ సూచించారు. పరిశోధనల కోసం ఓయూలో ఉన్న మౌళిక వసతులకు అదనంగా బయో డైవర్సిటీ పరిరక్షణ కేంద్రం, మైక్రోబియల్ ఫర్మెంటేషన్ కేంద్రం, 3డి ప్రింటింగ్, జాతీయ సంకలిత తయారీ కేంద్రం ఏర్పాటు అయ్యాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. "భారతీయ దక్కోణంలో జీవ వైవిధ్యాన్ని కొలిచే జన్యు పద్ధతుల అప్లికేషన్ అండ్ అవకాశాలు పరిమితులు" అనే అంశంపై ఓయూలో రెండు రోజుల పాటు జరగనున్న కార్యశాలల్లో పాల్గొనేందుకు వచ్చిన బంగోర్ విశ్వవిద్యాల అధ్యాపకులు ఓయూ వీసీతో మర్యాదపూర్వకంగా బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కార్యశాలలలో భాగస్వాములుగా ఉన్న బ్రిటన్‌లోని బంగోర్ విశ్వవిద్యాలయం మాలిక్యులర్ ఎకాలజీ, ఎవల్యూషన్ అధ్యయన కేంద్రం, ఓయూ బయోడైవర్శిటీ అధ్యయన, పరిరక్షణ కేంద్రాలకు ప్రొఫెసర్ రవిందర్ శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ దృక్కోణంలో ప్రస్తుతం జీవవైవిధ్యంలో అంతరాలను గుర్తించటం, సమర్థవంతమైన పర్యవేక్షణ, పరిరక్షణ కోసం జన్యు పద్ధతులను అన్వేషించటం, అన్వయించటం ఈ కార్యశాల ముఖ్య ఉద్దేశాలు. ఔత్సాహిక పరిశోధకుల కోసం వచ్చే ఏడాది బంగోర్ విశ్వవిద్యాలయంతో కలిసి ప్రవేశపెట్టే నూతన కోర్సు ప్రణాళికను ఈ కార్యశాలలో తుదిరూపం ఇవ్వనున్నారు. జీవరాశి మనుగడకు జీవవైవిధ్యం ఎంతో అవసరమని సమావేశంలో పాల్గొన్న బంగోర్ విశ్వవిద్యాలయ మాలిక్యులర్ ఎకాలజీ అండ్ ఎవల్యూషన్ అధ్యాపకులు డాక్టర్ అనితా మల్హోత్రా అభిప్రాయపడ్డారు. దేశంలో జీవవైవిధ్యంలో సమృద్ధిని సాధించిందని గుర్తు చేశారు. భారత్‌లో తాను పర్యటించటం ఇది రెండో సందర్భమనీ, ఇక్కడి ప్రజలు, సంస్థల సహకారం ఎంతో ఉత్సాహాన్నిస్తుందని ఆనందం వ్యక్తం చేశారు. అంతరించిపోతున్న జాతులను కాపాడుకోవటంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏకీకృతం చేయాలని అంతరించి పోతున్న జాతుల సంరక్షణ ప్రయోగశాల ప్రధాన శాస్త్రవేత్త ప్రొఫెసర్ కార్తికేయన్ వాసుదేవన్ అన్నారు. జంతు ప్రదర్శన శాలలతో ప్రాజెక్టులను నిర్వహించడంలో తన అనుభవాన్ని వివరించారు. పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లకు కొత్త కెరీర్‌లు ఆచరణీయమైనవిగా పరిగణించవచ్చని అన్నారు. ఈ సమావేశాన్ని ఓయూ బయోడైవర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సి.శ్రీనివాసులు సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో అంతరించిపోతున్న జాతుల సంరక్షణ ప్రయోగశాల సీనియర్ ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ జి.ఉమాపతి, సీసీఎంబీ జెనోమిక్స్-బయో ఇన్ఫర్మేటిక్స్ శాస్త్రవేత్త డాక్టర్ వసీం ఉద్దీన్, ఒడిశాలోని వైల్డ్ లైఫ్, బయోడైవర్సిటీ పరిరక్షణ కేంద్రం నుంచి డాక్టర్ అశోక్ కుమార్ మల్లిక్, యూకేలోని కార్డిఫ్ విశ్వవిద్యాలయ వాటర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ నుంచి డాక్టర్ విలియం బి.ఫెర్రీ, బంగోర్ విశ్వవిద్యాలయం నుంచి సారా మాగ్గిని, ఓయూ ఐసీఎస్ఎస్ఆర్ డైరెక్టర్ ప్రొ.సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.



రాష్ట్ర అభివృద్ధిలో ఆరోగ్య శాఖ కీలక పాత్ర

నవతెలంగాణ-అంబర్‌పేట

రాష్ట్ర అభివృద్ధిలో ఆరోగ్యశాఖ కీలకపాత్ర పోషిస్తుందని బీఆర్ఎస్ అంబర్ పేట ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్ రెడ్డి అన్నారు. బుధవారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాలో భాగంగా వైద్య ఆరోగ్య దినోత్సవం కార్యక్రమంలో భాగంగా నల్లకుంట ఫీవర్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎడ్ల సుధాకర్ రెడ్డి హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్, ఆర్ఎంఓ, నర్సులు, హాస్పిటల్ సిబ్బందిని శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా హాస్పిటల్‌కు వీల్ చైర్స్‌ను డొనేట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏ విభాగానికి ఆ విభాగంలో ప్రత్యేక వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందిని నియమించినట్టు తెలిపారు. గతంలో వివిధ పరీక్షల కోసం ప్రభుత్వ వైద్యులు.. ప్రయివేటు ల్యాబ్‌లకు పంపేవారనీ, ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేస్తున్న టీ డయాగ్నోస్టిక్ హబ్, రేడియోలజీ ల్యాబ్‌లను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గరిగంటి రమేష్, మాజీ కార్పొరేటర్ పులి జగన్, మాజీ శిశు సంక్షేమ శాఖ రీజనల్ డైరెక్టర్ సుశీల రెడ్డి, రాష్ట్ర మహిళా నాయకురాలు దేవిరెడ్డి విజిత రెడ్డి, యువ నాయకులు నాగేష్ గౌడ్, మురళీకృష్ణ, ఉద్యమ నాయకులు జీవన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్లకు మహర్దశ : ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

నవతెలంగాణ-అంబర్‌పేట



అంతర్గత రోడ్ల నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. బుధవారం బాగ్ అంబర్ పేట డివిజన్ పరిధిలోని డీడీ కాలనీలో రూ.58 లక్షలతో చేపట్టిన బీటీ రోడ్లను ఎమ్మెల్యే బాగ్ అంబర్ పేట కార్పొరేటర్ బి.పద్మ వెంకటరెడ్డితో కలిసి శంకుస్థాపన చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం కోసం రూ.కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. ముఖ్యంగా ప్రజలకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించినట్టు పేర్కొన్నారు. ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించి వారి సమస్యలను పరిష్కరించడమే ప్రధాన కర్తవ్యమన్నారు. గతంలో ఎన్నడూ చూడని విధంగా రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, మంచి నీరు, విద్యుత్ పార్కుల రూపురేఖలు మార్చామని తెలిపారు. రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే భారత స్వాతంత్ర్య సమరయోధురాలు, సంఘ సంస్కర్త దుర్గాబాయి దేశముఖ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు చంద్రమోహన్, సీనియర్ నాయకులు మోర శ్రీరాములు ముదిరాజ్, ఎడ్ల నరేందర్ రెడ్డి, కనివేట నర్సింగరావు, రమేష్ నాయక్, అరుణ్ కుమార్ రెడ్డి, కంచె మహేష్, శ్రీనివాస్ యాదవ్, మిరియాల రవీందర్, కిషోర్ కుమార్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ శ్రీనివాసరావుకు ఉత్తమ ఆయుర్వేద సేవా అవార్డు ప్రదానం

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని హరిహరా కళాభవన్‌లో నిర్వహించిన తెలంగాణ వైద్య ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కింగ్ కోఠి ఆయుర్వేద పాలి క్లినిక్ సీనియర్ ఆయుర్వేద వైద్యులు శ్రీనివాసరావుకు ఉత్తమ ఆయుర్వేద వైద్య సేవా అవార్డు, ప్రశంస పత్రంను హైదరాబాద్ జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటి అందజేశారు.

మూడో రోజుకు ప్రొ.అన్సారీ శాంతియుత దీక్ష

నవతెలంగాణ-ఓయూ



వరుసగా మూడో రోజు తనకు నో డ్యూస్ సర్టిఫికేట్ ఇవ్వాలని మాజీ ఓయూ ఆర్ట్స్ కళాశాల లింగ్విస్టిక్ హెడ్ ప్రొ.అన్సారీ కోరారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీలో ఆయన చేపట్టిన శాంతియుత దీక్ష మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ప్రొ.అన్సారీ మాట్లాడుతూ ఓయూ వీసీ ప్రొ.రవీందర్ మే 31వ తేదీన రిటైర్మెంట్ అయితే రెండు రోజుల్లో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆయనకు నో డ్యూస్ సర్టిఫికేట్ ఇచ్చారు. ఓయూలోని విదేశీ విద్యార్థుల నిధి రూ.35 లక్షలు డిపార్ట్మెంట్ హెడ్స్‌కి ఇవ్వకుండా, వారి అనుమతి తీసుకోకుండా అప్పటి ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్, ప్రస్తుత ఓయూ వీసీ ప్రొ.రవీందర్ నిధులను దారి మళ్లించారనీ, గతంలో లింగ్విస్టిక్ డిపార్ట్మెంట్‌లో అకాడమిక్ కన్సల్టెంట్‌గా పని చేసిన డా. శర్మకి ఏడాది తరగతులు చెప్పకున్నా, అప్పటి ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ హోదాలో ప్రస్తుత వీసీ జీతం ఇచ్చారన్నారు. దీనికి లింగ్విస్టిక్ డిపార్ట్మెంట్ హెడ్ నుంచి రిక్వెస్ట్ లెటర్ కూడా తీసుకోలేదనీ, ఓయూ వీసీ ప్రస్తుతం వైస్ చైర్మన్‌గా ఉన్న దారుతుల్ మారీఫ్‌లో దాదాపు రూ.కోటీ 20 లక్షల అవినీతి జరిగిందనీ, దీనిపై ప్రస్తుతం సీసీఎస్ లో కేసు నడుస్తుందన్నారు. కొన్నిరోజుల క్రితం అన్ని ప్రధాన పత్రికల్లో దీని గురించి వచ్చిందనీ, ఇన్నీ ఆరోపణలు ఉన్న ఓయూ వీసీ రిటైర్మెంట్ కాగానే రెండు రోజుల్లో ఆయనకు ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ నో డ్యూస్ సర్టిఫికేట్ ఇచ్చారు. కానీ లింగ్విస్టిక్ డిపార్ట్మెంట్‌కి చెందిన ఒక ల్యాప్‌టాప్ కనపడటం లేదనీ, అందుకే నాకు నో డ్యూస్ సర్టిఫికేట్ ఇవ్వలేదన్నారు. ఓయూ వీసీ, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ అనడం హాస్యాస్పదం అన్నారు. ల్యాప్ ట్యాప్ తన దగ్గర లేదనీ, గతంలో డిపార్ట్మెంట్లో పని చేసిన ఒక టీచర్ దగ్గర ఉందనీ, నేను ప్రస్తుత హెడ్ ప్రొ.స్వాతికి తెలిపాను. ఆ టీచర్ నుంచి రికవరీ చేసుకోకుండా నన్ను బాధ్యున్ని చేయడం న్యాయమా అని ప్రశ్నించారు. ఇలాంటి చిన్న చిన్న కారణాలతో నో డ్యూస్ సర్టిఫికేట్ ఇవ్వకుండా 5 నెలల నుంచి తనను మానసికంగా వేధిస్తున్నారని అన్సారీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలు విద్యార్థి సంఘాల నాయకులు ప్రొ.అన్సారీకి మద్దతు తెలిపారు. ఇకనైనా బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



రాజకీయాలకతీతంగా అభివృద్ధి : ఎమ్మెల్యే ముఠా గోపాల్

నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గంలో ఎన్నికలతో సంబంధం లేకుండా అభివృద్ధియే లక్ష్యంగా పని చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బుధవారం ముషీరాబాద్ డివిజన్లోని బ్రహ్మగారి ఆలయం వీధి, ఈదమ్మ ఆలయం వీధిలో రూ.11లక్షలతో మంచినీటి పైపైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే డివిజన్ కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్, జలమండలి డీజీఎం మోహన్రాజ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో మంచినీటి సమస్య తలెత్తకుండా యుద్ధ ప్రాతిపదికన పెరిగిన జనాభాకు అనుకూలంగా కొత్త పైప్లైన్లు ఏర్పాటు చేస్తున్నామని తెలి పారు. అవసరమైన చోట డ్రయినేజీ పైప్ లైన్లు వేస్తామన్నారు. ఎలాంటి సమస్యలు ఉత్పన్నమైనా తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరి స్తామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ముషీరాబా ద్‌లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ, ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు నర్సింగ్ ప్రసాద్, ఆకుల అరుణ్ కుమార్, ఉపాధ్యక్షులు పిల్ల ప్రశాంత్, లక్ష్మణ్ గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు శివ ముదిరాజ్, దీన్ దయాల్ రెడ్డి, గౌరీశంకర ఆలయ కమిటీ చైర్మన్ శ్రీదర్చారి, ఎస్సీసెల్ అధ్యక్షుడు సదా, మహిళా కమిటీ అధ్యక్షురాలు శోభ, మేరి, తదితరులు పాల్గొన్నారు.



నీట్ ఫలితాల్లో ఎస్.ఆర్ విద్యార్థుల ప్రతిభ


నవతెలంగాణ-ముషీరాబాద్

నీట్-2023 ఫలితాల్లో ఎస్సార్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తమమైన వైద్య విద్య పొందడానికి అర్హత సాధించినట్టు చైర్మన్ వరద రెడ్డి తెలిపారు. ఎస్ఆర్ కళాశాల చైర్మన్ వరద రెడ్డి బుధవారం రాంనగర్ విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులకు బట్టీ చదువులు కాకుండా ఎస్సార్ విద్యా సంస్థల అద్భుతమైన అకాడమిక్స్, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో అత్యుత్తమ విద్యాబోధన అత్యుత్తమ ర్యాంకులకు దోహదపడిందన్నారు. ఆయేషా ఫాతిమా 1940వ ర్యాంక్ సాధించినట్టు తెలిపారు. 720 మార్కులకు గాను చౌహాన్ మైథిలి 492, దాసరి విష్ణువర్ధన్ 453, జె.సియారాణి 435, అగర్వాల్ రాధిక 410 యోగితా పవర్ 395 రాథోడ్ అక్షయ 367, తాండూరి నందిత 364, బొల్లి అభినయశ్రీ 360తో మొత్తం తొమ్మిది మంది విద్యార్థులు నీటి 2023 కి అర్హత సాధించినట్టు పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కళాశాల చైర్మన్ వరదరెడ్డి, డైరెక్టర్ సంతోష్ రెడ్డి, మధుకర్ రెడ్డి, జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్స్ కె.బ్రహ్మం, జైపాల్ రెడ్డి, అరవింద్, అధ్యాపకులు అభినందించారు.

టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ప్రశాంతం

నవతెలంగాణ-సిటీబ్యూరో

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. హైదరాబాద్ జిల్లావ్యాప్తంగా 49 కేంద్రాల్లో పదో తరగతి సప్లిమెంటరీ విద్యార్థులు సజావుగా పరీక్ష రాశారు. తొలిరోజు జరిగిన ఫస్ట్‌లాంగ్వేజ్ పేపర్-1 పరీక్షను 3,270 మంది రాయాల్సి ఉండగా.. 2,501 మంది హాజరు కాగా.. 76.48శాతం నమోదైంది. 769 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. హైదరాబాద్ జిల్లా పరిధిలో 14 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ ఏర్పాటు చేయగా.. ఆయా బృందాలు పరీక్షల నిర్వహణపై తనిఖీలు చేశారు. తొలి పరీక్షలో ఎక్కడా కూడా మాల్ ప్రాక్టీస్ జరగలేదని జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఇక అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసుల బందోబస్తు చర్యలు చేపట్టారు.



అర్హులందరికీ వెంటనే పట్టాలు ఇవ్వాలి



నవతెలంగాణ-ఓయూ

జీవో 58 కింద దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ వెంటనే పట్టాలు ఇవ్వాలనీ, పేదల ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇస్తామన్న రూ.3 లక్షలను రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేస్తూ లాలాపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియం ఎదుట బుధవారం సీపీఐ(ఎం), సీపీఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ(ఎం) సికింద్రాబాద్ జోన్ కన్వీనర్ ఎం.అజయ్ బాబు, సీపీఐ సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ జీవో 58 క్రింద దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ వెంటనే పట్టాలు ఇవ్వాలన్నారు. గతేడాది దరఖాస్తు చేసుకున్న వారికి సగం మందికే పట్టాలు ఇచ్చారనీ, ఇంకా చాలా మందికి ఇవ్వలేదనీ, ఇప్పటికైనా దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదల ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇస్తానంటున్న రూ. 3 లక్షలను రూ.5 లక్షలను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం), సీపీఐ నాయకులు గోపాల్, కిరణ్ కుమార్, లతీఫ్, సీనియర్ నాయకులు కృష్ణమూర్తి, భీమయ్య, రాములమ్మ లక్ష్మి, ఆండాలు, రాజ్‌కుమార్, పుల్లమ్మ శ్రీనివాస్ మున్నా, రవి, రాములు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల వద్ద ఆందోళన

నవతెలంగాణ-ఓయూ



బాచుపల్లి నారాయణ గర్ల్స్ క్యాంపస్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న వంశిత (16) ఆత్మహత్యకు పాల్పడిందన్న సమాచారం తెలుసుకున్న తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ మిడతనపల్లి విజయ్ ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణ, శ్రీ చైతన్య లాంటి కార్పొరేట్ కళాశాలను తెలంగాణ నుంచి తరిమికొట్టాలన్నారు. చదువుల ముసుగులో అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల ప్రాణాలను బలిగొంటున్నారన్నారు. కళాశాలలో ఏజీఎం అనే వ్యవస్థను పెట్టి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారనీ, సకాలంలో ఫీజులు చెల్లించకపోతే తోటి విద్యార్థుల ముందు మానసికంగా వేధిస్తున్నారనీ, కొంతమంది ఏజీఎంలు విద్యార్థినిలను లైంగికంగా వేధిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ప్రతి ఏడాదీ పదుల సంఖ్యలో విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడుతుంటే ఈ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కార్పొరేట్ విద్యాసంస్థల నుంచి పెద్ద మొత్తంలో ప్రభుత్వానికి అందాల్సిన అన్ని రకాల లాంఛనాలు అందుతున్నాయనీ, ఫలితంగానే ఇంటర్మీడియట్ బోర్డు కండ్లకు గంతులు కట్టుకుని తమాషా చూస్తుందన్నారు. పర్మిషన్ లేని బిల్డింగ్‌లలో శ్రీ చైతన్య, నారాయణ కళాశాలల పేరిట అక్రమంగా క్లాసులు, హాస్టల్లు నిర్వహిస్తున్నారని తెలిపారు. విద్యార్థిని వంశిత మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలనీ, వంశిత కుటుంబానికి నారాయణ విద్యా సంస్థలు రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. శ్రీ చైతన్య, నారాయణ లాంటి కార్పొరేట్ కళాశాల ఫీజులు దోపిడీపై వెంటనే కమిటీ వేసి ఫీజులను క్రమబద్ధీకరించాలనీ, కార్పొరేట్ కళాశాలల అక్రమ దోపిడీని, వేధింపులను అరికట్టాలన్నారు. లేదంటే ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నవీన్, అశోక్, రవి, నరేందర్, సురేష్, రవిబాబు, కిరణ్, ఉపేందర్, ఆంజనేయులు, నిరంజన్, సుమన్, శివకుమార్, అనిల్, మహేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి నోముల ప్రకాశ్

నవతెలంగాణ-ఓయూ



సికింద్రాబాద్ నియజకవర్గంలో మచ్చలేని నాయకునిగా పేరున్న నోముల ప్రకాష్ కాంగ్రెస్ గూటికి చేరారు. బుధవారం సీతాఫల్‌మండి నామాలగుండు నుండి తన అనుచరులతో భారీ ర్యాలీతో గాంధీభవన్‌కు తరలివెళ్లి మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ నేతృత్వంలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా నోముల ప్రకాష్ మాట్లాడుతూ కొన్ని కారణాల వల్ల తాను కొంత రాజకీయాలకు దూరంగా ఉన్న మాట వాస్తవమేనని కానీ ఇప్పుడు వదిలేది లేదన్నారు. తాను లోకల్‌గా ఎన్నో అభివృద్ధి పనులు చేశామని స్థానికులకు అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో తన ముందుకు సాగుతుందని ఆయన అన్నారు. ప్రస్తుత నాయకులు పాత అభివృద్ధి పనులకు కొత్తగా రంగులు పూసి అభివృది చేస్తామని చంకలు గుద్దుకుంటున్నారని విమర్శించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌కు పునర్ వైభవం తీసుకువచ్చి కాంగ్రెస్ జండా ఎగురవేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో నాగులూరి కృష్ణకుమార్ గౌడ్, షకీల్ అహ్మద్, దీపక్ జాన్, జగ్గు, మయ బ్రహ్మ నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలి

- తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్ రెడ్డి
- ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద రిలే నిరాహారదీక్ష



నవతెలంగాణ-అడిక్‌మెట్

న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలి అని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. న్యాయవాదులపై పెరిగిపోతున్న దాడులను అరికటేందుకు ప్రత్యేక న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ న్యాయవాదుల సురక్ష సమితి (టిఎంఎస్ఎస్) ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద సమితి అధ్యక్షుడు అశోక్, ఉపాధ్యక్షుడు ఎ. సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి హైమద్, సంయుక్త కార్యదర్శి రాకేష్ కులకర్ని, కోశాధికారి దేవందర్ పాటు సమితి సభ్యులు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఈ దీక్షకు తెలంగాణ నాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్తన్ రెడ్డి, సౌత్ ఇండియా అడ్వకేట్ జేఏసీ అధ్యక్షుడు సుధానాగేందర్, న్యాయవాదులు నాగుల శ్రీనివాస యాదవ్ సుదీర్ శ్రీవాత్సవ్, యశ్వంత్ రంగారెడ్డి జిల్లా కోర్టు కౌన్సిల్ సభ్యులు రమేష్ నిజాముద్దీన్, పరశురాం, స్వర్ణలత, సమీరాలు హాజరై మాట్లాడారు. రాష్ట్ర సాధనలో న్యాయవాదులు కీలక పాత్ర పోషించారన్నారు. రాష్ట్ర ఉద్యమ సయంలో 22 వేల మంది న్యాయవాదులు ఉంటే నేడు 10వేలకు పైగా ఉన్నారని తెలిపారు. రాజకీయ నాయకులు, రియల్టర్‌లు తమ స్వార్థం కేసులో ఓడిపోతామనే భయంతో న్యాయవాదులపై దాడులకు పాల్పడుతుండటమే కాకుండా కొన్ని చోట్ల న్యాయ వాదులను దారుణంగా హత్యచేశారని తెలిపారు. కేంద్ర రాష్ట్రాల్లో న్యాయవాదులపై దాడులు జరగకుండా వెంటనే స్పందించి న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.. ఈ చట్టం తీసుకువచ్చేంత వరకు న్యాయవాదులు చేసే పోరాటానికి తమ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ నిరాహార దీక్షలో కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, అన్ని జిల్లాల నుంచి న్యాయవాదులు పాల్గొన్నారు.

అవని స్వచ్ఛంద సంస్థ ఆర్థిక సాయం

నవతెలంగాణ-కూకట్ పల్లి



అవని స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు శిరీష సత్తూర్, స్థానిక 124 డివిజన్ కేటీఆర్ కాలనీలో నివసించే భారతి అనే పేద విద్యార్థిని కోసం రూ.5 వేలు శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరికెపూడి గాంధీ చేతులమీదుగా అందించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ, డివిజన్‌లోని పేద బాలికల విద్య కోసం అవసరమైనటువంటి సదుపాయాలు, ప్రభుత్వం ద్వారా అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అవని స్వచ్ఛంద సంస్థ నుంచి పేద బాలికల విద్య కోసం సహాయం అందిస్తున్న శిరీషని అభినందించారు. ఈ కార్యక్రమంలో అవని స్వచ్ఛంద సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శంభీపూర్ రాజును కలిసిన నూతన సంక్షేమ సంఘం సభ్యులు

నవతెలంగాణ-దుండిగల్



కుత్బుల్లాపూర్ సర్కిల్ రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఏపీహెచ్‌బీ కాలనీ నూతన సంక్షేమ సంఘం సభ్యులు ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని బుధవారం శంభీపూర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలతో కలిసికట్టుగా సమన్వయంతో ఉండి ముందుకెళ్ళాలన్నారు. కాలనీలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఏర్వ సాయికిరణ్ (బంటి), ప్రధాన కార్యదర్శి సాయిబాబా, కోశాధికారి షేక్ శ్రీను భాష, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య, ఆరోగ్య రంగంలో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్

- మంత్రి మల్లారెడ్డి
- మేడ్చల్‌లో వైద్య ఆరోగ్య దినోత్సవం
- కుత్బుల్లాపూర్‌లో "తెలంగాణ వైద్యారోగ్య దినోత్సవం"లో పాల్గొన్న ఎమ్మెల్యే కేపి వివేకానంద్



నవతెలంగాణ-మేడ్చల్

వైద్య ఆరోగ్య రంగంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. రాష్ట్ర అవతరణ దశబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం మేడ్చల్ పట్టణంలోని శ్రీ గార్డెన్స్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు జరిగేవి కావనీ ఇప్పుడు నూటికి 90శాతం వరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే నార్మల్ డెలివరీలు జరుగుతున్నాయని అన్నారు. ఆడపిల్ల పుడితే రూ.13వేలు, మగ బిడ్డ పుడితే రూ.11 వేలు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి మల్లారెడ్డి ప్రారంభించారు. ఈ కిట్‌లో 14 రకాలైన వస్తువులను అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఆరోగ్య మహిళ కార్యక్రమం కూడ ప్రారంభించినట్లు చెప్పారు. ప్రతి మంగళవారం ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రత్యేకంగా మహిళ డాక్టర్లచే కేవలం మహిళలకే చూసే విధంగా ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని వెల్లడించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి మెమంటోలు ఇచ్చి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ శరత్ చంద్ర రెడ్డి, డిఎంహెచ్ ఓ పుట్ల శ్రీనివాస్, అదనపు కలెక్టర్ నర్సింహా రెడ్డి, ఆర్డీవో రవి, మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపికా నర్సింహారెడ్డి, ఎంపీపీలు రజిత రాజ మల్లారెడ్డి, ఎల్లుభాయ్ బాబు, జడ్పిటిసి శైలజ విజయానందా రెడ్డి, హారిక మురళి గౌడ్, వైస్ చైర్మెన్ రమేష్ ,కౌన్సిలర్లు, కో అప్షన్ సభ్యులు, వైద్యరోగ్య శాఖ అధికారులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మర్రి నర్సింహ రెడ్డి, జగన్ రెడ్డి, శేఖర్ గౌడ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దవాఖానల్లో కార్పొరేట్ వైద్యం : ఎమ్మెల్యే

జగద్గిరిగుట్ట :

బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో ప్రభుత్వ దవఖానాల్లో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుతున్నాయని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నిర్వహించిన "తెలంగాణ వైద్యారోగ్య దినోత్సవ" వేడుకలు ఘనంగా జరిగాయి. ఐడీపీఎల్‌లోని వైఎంఎస్ హరీష్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కేపి వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైద్యారోగ్య రంగంలో గడిచిన తొమ్మిదేండ్లలో తెలంగాణ సాధించిన అద్భుత ప్రగతిని వివరిస్తూ రూపొందించిన ప్రత్యేక ఏవీని వీక్షించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కేసీఆర్ కిట్‌ను అద్భుతంగా వివరిస్తూ చేసిన ప్రత్యేక స్కిట్‌ను వీక్షిస్తూ అనంతరం కేసీఆర్ కిట్, కంటివెలుగు, డయాలసిస్, టుబెక్టోమీ, ఆరోగ్య శ్రీ పథకం లబ్ధిదారులు ప్రభుత్వం ద్వారా తమకు జరిగిన మేలును తెలియజేస్తూ సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు దేవుళ్ళతో సమానం అన్నారు. కరోనా కష్టకాలంలో తమ ప్రాణాలను సైతం లెక్క చెయ్యకుండా వైద్యులు అందించిన సేవలు అభినందనీయం అన్నారు. వైద్య రంగానికి తెలంగాణ సర్కారు పెద్దపీట వేస్తుందని గడిచిన తొమ్మిదేండ్లలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 2014 కు ముందు పీహెచ్‌సీ 2ఉంటే ప్రస్తుతం 5 అని, 2014లో ఒక్క బస్తీ దవాఖాన లేదని, ఇప్పుడు ప్రజల వద్దకే వైద్యాన్ని అందించాలని 19 ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 2014లో పల్లె దవాఖాన ఒక్కటి లేదని ప్రస్తుతం 17 ఉన్నాయన్నారు. కంటి వెలుగు పథకం ద్వారా 2,28,330 స్క్రీనింగ్ మాత్రమే కాకుండా 73,574 మంది లబ్ధిదారులకు కంటిచూపును సరిచేయడానికి అద్దాలు కూడా అందించడం జరిగిందన్నారు. అంతే కాకుండా గర్భిణులకు నేడు న్యూట్రిషన్ కిట్‌లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. చివరగా ఉత్తమ ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, ఉత్తమ స్టాఫ్ నర్సులు, ఉత్తమ లాబ్ టెక్నీషియన్‌లు, ఉత్తమ డాక్టర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ఆనంద్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నిర్మల, సీడీపీఓ హెప్సిబ, డాక్టర్ నవనీత ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, డివిజన్ల అధ్యక్షులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ సమస్యకు శాశ్వత పరిష్కారం



- ఎమ్మెల్యే వివేకానంద్
- ఎమ్మెల్యేకు మహదేవపురం వాసులు సన్మానం

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారం డివిజన్ పరిధిలోని మహదేవపురంలో గత ఐదేండ్లుగా పెండింగ్‌లో ఉన్న ఇండ్ల పర్మిషన్(రెవిన్యూ) సమస్య కేపి వివేకానంద్ చొరవతో శాశ్వతంగా పరిష్కారం అయిన సందర్భంగా కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఏర్పాటు చేసిన అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా స్థానిక కాలనీవాసులు మాట్లాడుతూ మహదేవపురం సర్వే నెంబర్ 329/4 నుండి 329/10 వరకు నిషేధిత జాబితాలో ఉన్నందున కాలనీ వాసులు ఇండ్ల నిర్మాణానికి అనుమతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని సంబంధిత సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీనిపై తక్షణమే స్పందించి ప్రత్యేక చొరవ చూపి మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్, జోనల్ కమిషనర్ వి.మమత దృష్టికి సమస్యను తీసుకెళ్ళి సదరు సమస్యపై ఎమ్మెల్యే చర్చించారు. కాలనీ వాసులకు ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పుడు ఇండ్ల నిర్మాణానికి అనుమతులు వచ్చాయని సంతోషం వ్యక్తపరిచారు. అనంతరం కాలనీవాసులు ఎమ్మెల్యేను శాలు వాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి వివేకానంద్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కా రానికి ఎప్పుడూ మొదటి ప్రాధాన్యతనిస్తానని కాలనీ వాసులు ఐకమత్యంతో ఉంటే ఎటువంటి ఇబ్బందులనైనా అధిగమించవచ్చని అన్నారు. కాలనీలో నిధులకు కొరత లేకుండా అనేక అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో కూడా ఎటువంటి సహాయ సహకారాలకైనా ముందుండి సమస్యలను పరిష్కరి స్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా "మెడికల్ డే" వేడుకలు



- కార్పొరేటర్ రావుల శేషగిరి

నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్‌లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు పండగ జరుగుతుందని గాజుల రామారం డివిజన్ కార్పొరేటర్ రావులశేషగిరి అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఐటీ మంత్రి కేటీఆర్, శాసనమండలి విప్, ఎమ్మెల్సీ మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, శంబిపూర్ రాజు పిలుపు మేరకు బుధవారం గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి ఆధ్వర్యంలో డివిజన్ పరిధి దేవేందర్ నగర్‌లో జరిగిన వైద్య శిబిరాన్ని ప్రారంభించి "మెడికల్ డే వేడుకలు" ఘనంగా జరుపుకున్నారు. ముందుగా గాజుల రామారం చౌరస్తాలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగజీవన్ రావ్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన నివాసం శ్రీనివాస్ నగర్ నుండి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి సుమారు 50 కార్లలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రం అన్ని రంగాలలో పురోభివృద్ధి సాధించిందని 2024 ఎన్నికల్లో 100కు పైగా సీట్లు సాధించి మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు.

మదర్సా చిన్నారులకు దుస్తుల పంపిణీ



- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలోని పాండు బస్తీకి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త భాస్కర్ నూతన గృహ ప్రవేశం సందర్భంగా మదర్సా చిన్నారులు 20 మందికి ఉచితంగా దుస్తులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్యఅతిథిగా పాల్గొని తన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపి, సేవా కార్యక్రమానికి ముందుకు వచ్చినందుకు అభినందించారు. ఈ కార్యక్ర మంలో మాజీ కౌన్సిలర్, స్థానిక డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చేగువేరా జయంతి సందర్భంగా ప్రగతి నగర్‌లోని సుందరయ్య భవన్‌లో బుధవారం ఎస్ఎఫ్ఐ బాచుపల్లి కమిటీ ఆధ్వర్యంలో చేగువేరా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు భగత్ నాయకులు శివ చందు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుండిగల్

జన్మదినం సందర్భంగా మొక్కలు నాటిన కృష్ణవేణి కృష్ణ

నవతెలంగాణ-దుండిగల్

గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా బుధవారం దుండి గల్ పురపాలక చైర్-పర్సన్ శంభీపూర్ కృష్ణవేణి క్రిష్ణ జన్మదిన సందర్భంగా దుండి గల్ మున్సిపల్ కార్యాలయంలో మొక్కను నాటారు. అనంతరం కార్యాలయంలో పలువురు అధికారులు, సిబ్బంది, చైర్ పర్సన్ కృష్ణవేణి కృష్ణ తో భారీ కేక్‌కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ పద్మారావు, కమిషనర్ సత్యనారాయణ, కౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, మాడాస్ వెంకటేష్, మహేందర్ యాదవ్, సాయి యాదవ్, భారత్ కుమార్, పాక్స్ డైరెక్టర్ అర్కల జీతాయ్య, జనరల్ తదితరులు పాల్గొన్నారు.



శంభీపూర్ క్రిష్ణవేణి క్రిష్ణ పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక పూజాలు

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ బహదూర్ పల్లిలోని సాయి నాథ్ సొసైటీలో గల సాయి బాబా ఆలయం, శివాలయ లో బుధవారం దుండిగల్ పురపా లక చైర్-పర్సన్ శంభీపూర్ క్రిష్ణవేణి క్రిష్ణ జన్మదిన సందర్భంగా వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ పద్మారావు, కౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, ఎల్లుగారి సత్యనారాయణ, భారత్ కుమార్, పాక్స్ డైరెక్టర్ అర్కల జీతయ్య, నాయకులు తిరుమలేష్, జీ.మల్లేష్, సద్దాం, జనార్ధన్ మోర హరీష్, తదితరులు పాల్గొన్నారు.



పేద విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థల చేయూత

- ప్రధానోపాధ్యాయురాలు కల్పన రెడ్డి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



పేద విద్యార్థులకు చేయూతనందించడం కోసం స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని చెన్నారెడ్డినగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కల్పన రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా కుత్బుల్లాపూర్ సర్కిల్, రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధి చెన్నారెడ్డి నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం అక్షరాభ్యాస దినోత్సవం నిర్వహించారు. పాఠశాలలో కొత్తగా చేరిన విద్యార్థిని విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులుచే అక్షరాభ్యాసం చేయిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివే విద్యార్థుల పట్ల సేవలు చేయాలనే సంకల్పంతో ముందుకు వచ్చి విద్యార్థులకు కావలసిన ఆట వస్తువులు ,పెన్నులు ,పెన్సిళ్లు, నోటు బుక్స్, ఇతరత్రా సామాగ్రి ,సమ కూర్చడంతో పాటు కంప్యూటర్లు మరమ్మ తులు చేయించా రని వారికి పేరుపేరునా ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంవత్సరం నూతనంగా 20 మంది పిల్లలు చేరారని పాఠశాలలో మొత్తం 100 మందికి పైగా విద్యార్థులు ఉన్నారని వారికి మంచి విద్య బోధన అందజేసి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దు తామన్నారు. పంచశీల ఫౌండేషన్ అధ్యక్షులు జింకల వెంకటేష్ ముదిరాజ్ మాట్లాడుతూ గత కొన్నేండ్లుగా ఈ పాఠశాల విద్యార్థులకు తమకు తోచినంతలో సేవలం దిస్తున్నామని భవిష్యత్తులో కూడా సేవలు విస్తృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి, రచయిత వాకిటి రామిరెడ్డి, శ్రీ సాయి గణేష్, ఉత్స వకమిటీ ప్రతినిధులు రాజేశ్వర్, సూర్య నారాయణ, రాములు, సామాజిక కార్యకర్త ఇక్కుర్తి నారాయ ణరావు, పాఠశాల ఉపాధ్యాయులు పార్వ తి, మధు సూదన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు కేరాఫ్ లిటిల్ స్కాలర్స్ హై స్కూల్

నవతెలంగాణ కుత్బుల్లాపూర్



చింతల్ పద్మానగర్ ఫేస్ 1 లోని లిటిల్ స్కాలర్స్ హైస్కూల్ మధ్యతరగతి విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపుతూ వారి ఉజ్వల భవిష్యత్తుకు కృషి చేస్తున్నామని పాఠశాల కరస్పాండెంట్ రఘు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థులకు విద్య అందించాలనే లక్ష్యంతో తమ పాఠశాల నెలకొల్పామన్నారు , పాఠశాల ప్రారంభించినప్పటి నుంచి నేటి వరకు ఫలితాలలో తమ విద్యార్థులు సత్తా చాటుతున్నారన్నారు. ఈ సంవత్సరం పదో తరగతి పరీక్ష ఫలితాలలో తమ పాఠశాల విద్యార్థులు జీపీఏ 10/10 ఆరుగురు విద్యార్థులు సాధించి ప్రథమ స్థానంలో నిలవగా, పరీక్షకు హాజరైన విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు, చదువులో విద్యార్థులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో తమ పాఠశాలలో ప్రతీ సంవత్సరం జీపీఏ 10/10 సాధించిన విద్యార్థులకు ఐదువేల రూపాయల నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. ఇలాంటి అద్భుత ఫలితాలు సాధించేందుకు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యా బోధన, ప్రాథమిక స్థాయి నుంచి ప్రతీ విద్యార్థి ఇంగ్లీష్ మాట్లాడడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని, ప్రతి తరగతి గదిలో పరిమిత సంఖ్యలో విద్యార్థులను ఉంచి ఏ రోజు చెప్పింది ఆరోజు చదివిస్తామన్నారు. స్మార్ట్ క్లాసుల పై ప్రత్యేక శ్రద్ధ ఉంటుందన్నారు. ఇలాంటి అద్భుత ఫలితాల సాధించడానికి కృషి చేసినటువంటి పాఠశాల ఉపాధ్యాయులకు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

వార్డు కార్యాలయంలో వసతులు కల్పిస్తాం

- కార్పొరేటర్ కొలుకుల జగన్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



వార్డు కార్యాలయంలో ప్రజా ఉపయోగకరమైన సకల వసతులు కల్పిస్తామని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. బుధవారం గాజులరామారం సర్కిల్ జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప సమీపంలో నూతనంగా నిర్మించిన వార్డు కార్యాలయం శుక్రవారం ప్రారంభిస్తున్న సందర్భంగా ఏర్పాట్లను బుధవారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిగిలి ఉన్న పనులను సత్వరమే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అధికారులు, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈ నెల 16న నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో నిర్వహించనున్న తెలంగాణ పట్టణ ప్రగతి దినోత్సవం, అదే విధంగా 19న తెలంగాణ హరితోత్సవం వేడుకల నిర్వహణలో భాగంగా బుధవారం మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి అధ్యక్షతన కమీషనర్ రామకృష్ణ రావు, కార్పొరేటర్లు,అధికారులతో కలిసి సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆ రోజు నిర్వహించే వివిధ కార్యక్రమాలు, విధి విధానాలు, అందుకు తగు చర్యలు వంటి విషయాలపై ప్రజాప్రతి నిధులు,అధికారుల సలహాలు సూచనలతో సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఎన్ ఎం సి ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నవతెలంగాణ-దుండిగల్

టీఎన్జీవో ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు



- విజయవంతం చేసిన మహిళ ఉద్యోగులకు ధన్యవాదాలు: డాక్టర్ ముజీబ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎం. హుస్సేని(ముజీబ్) ఆధ్వర్యంలో ప్రత్యేకంగా మహిళా ఉద్యోగుల కోసం బుధవారం నాంపల్లిలోని ఆ సంఘం కార్యాలయంలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సును నిర్వహి ంచారు. ఈ సదస్సులో వందలాది మహిళా ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేశారు. ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ జయలత ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది మహిళా ఉద్యోగులకు రకరకాల క్యాన్సర్ల గురించి, వాటిని ముందస్తుగా ఎలా గుర్తించాలనే అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా వారికి స్క్రీనింగ్ టెస్ట్‌లు చేసి తగు సలహాలిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వాణిజ్య పన్నుల శాఖ నీతూ ప్రసాద్ ఐఏఎస్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ జయలత, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డీఐజీలు ట్వింకిల్ జాన్, సుభాషిణి, పెన్షన్ పేమెంట్ జాయింట్ డైరెక్టర్ వసుంధర, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ జిల్లా రిజిస్ట్రార్ వల్లి సుబ్బలక్ష్మి, సీమ ముజీబ్, సుజాత, జానకి హాజరై మహిళల కోసం ప్రత్యేక సదస్సును నిర్వహించినందుకు జిల్లా కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ముజీబ్ మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సీఎం కేసీఆర్ పిలుపు మేరకు జిల్లా సంఘం తరపున అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగానే మహిళా సదస్సు అని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి టి.హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. బంగారు తెలం గాణ కోసం పాటుపడుతున్న సీఎం వెంట ప్రభుత్వ ఉద్యోగులందరూ ఉంటారని, ఉద్యోగుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్ర మంలో జిల్లా కార్యదర్శి విక్రమ్ కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు కె.ఆర్. రాజ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు వరద రాజు, కుర్రాడి శ్రీనివాస్, ఖాలెద్ అహ్మద్, వైదిక్ శస్త్ర, శంకర్, ముఖీమ్, శ్రీధర్, ఎంఎన్‌జె క్యాన్సర్ ఆస్పత్రి యూనిట్ అధ్యక్షురాలు అరుణ జ్యోతి, కార్యదర్శి శివ కుమార్, చంద్ర శేఖర్, వివిధ యూనిట్ల అధ్యక్షా, కార్యదర్శులు మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో ఆన్‌లైన్‌లో ప్రవేశాల పద్ధతిని వెనక్కి తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ డిమాండ్
- అల్వాల్‌లోని తెలుగు తల్లి విగ్రహం వద్ద నిరసన

నవతెలంగాణ-సిటీబ్యూరో



రాష్ట్రంలో ఈ విద్యాసంవత్సరం నుంచి బీసీ కళాశాల వసతిగృహాల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామన్న ప్రభుత్వం నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అల్వాల్‌లోని తెలుగు తల్లి విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు బ్యాగరి వెంకటేష్ మాట్లాడుతూ ఒక విద్యార్థి హస్టల్ సీటు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనే క్రమంలో మూడు ఆప్షన్లు ఇవ్వాలనీ, సదరు విద్యార్థికి సీటు కేటాయించిన చోటే చేరాలనే నిబంధన పెట్టడం దారుణమని మండిపడ్డారు. ఈ చర్యతో విద్యార్థులు హస్టల్స్‌లో చేరే పరిస్థితి ఉండదని వాపోయారు. మూడు వసతిగృహాలు ఎంచుకోవడానికి విద్యా కేంద్రాలలో మాత్రమే ఉన్నాయని, గ్రామీణ ప్రాంతాల్లో లేకపోవడంతో విద్యార్థులు చేరే అవకాశం లేదన్నారు. ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్లు అంటే హస్టల్స్ ఎత్తివేయాలని కుట్ర చేయడమేన్నారు. కళాశాలలో అడ్మిషన్ పొందిన ప్రతీ విద్యార్థికి సీటు కల్పించాలని ఎస్ఎఫ్ఐ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. బీసీ విద్యాశాఖ తీసుకున్న ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలనీ, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిస్తామన్నారు. అద్దె భవనాల్లో వసతి గృహాల్లో సౌకర్యాలేమితో పాటు నాణ్యమైన భోజనం అందించకుండా వాటిని ఎత్తివేసే కుట్ర చేయడం దుర్మార్గమని, పాత పద్ధతిలోనే హస్టల్స్ అడ్మిషన్లు చేయాలని డిమాండ్ చేశారు.

నవచిత్రం

పరశురామ్ దర్శకత్వంలో మరో సినిమా

'గీత గోవిందం' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత విజయ్ దేవరకొండ, పరశురామ్ కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కనుంది. ఈ సినిమాను నిర్మాతలు దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తుండగా, క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వాసు వర్మ వ్యవహరించనున్నారు. ఈ కాంబినేషన్ పై ఇప్పటికే అంచనాలు పెరిగాయి.



మృణాల్ ఠాకూర్, విజయ్ దేవరకొండ, శ్యామ్ ప్రసాద్ రెడ్డి

బుధవారం హైదరాబాద్‌లో ఈ సినిమా ఘనంగా ప్రారంభమైంది. హీరో, హీరోయిన్లు విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్‌పై నిర్మాత శ్యామ్ ప్రసాద్ రెడ్డి క్లాప్ కొట్టగా, ఫస్ట్ షాట్‌ను గోవర్ధన్‌రావు దేవరకొండ డైరెక్ట్ చేశారు. ఫైనాన్షియర్ సత్తి రంగయ్య కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమా షూటింగ్ త్వరలోనే మొదలు కానుంది. 'సీతారామం' సినిమాలోని తన పర్ఫార్మెన్స్‌తో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్న మృణాల్ ఠాకూర్ ఈ సినిమాలో విజయ్ సరసన హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీ వేంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై నిర్మితమవుతున్న 54వ చిత్రమిది.

మెప్పించే సరికొత్త కాన్సెప్ట్

వరల్డ్ ఫోకస్ పిక్చర్ పతాకంపై ఆర్.కె బ్రోస్ సమర్పణలో బాసి దర్శకత్వంలో బి.సతీష్ నిర్మిస్తున్న చిత్రం 'ప్రేమ అనే నేను'. ఈ చిత్రం ఇటీవలే షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా నిర్మాత బి.సతీష్ మాట్లాడుతూ, 'కొత్త ఆర్టిస్టులతో ఈ సినిమా చేశాం. కాకినాడ, ఉప్పాడ, మచిలీపట్నం, వైజాగ్ సముద్ర ప్రాంతాల్లో షూట్ చేశాం. మెప్పించే సరికొత్త కాన్సెప్ట్‌తో ఈ సినిమా చేస్తున్నాం. తప్పకుండా అందరికీ నచ్చుతుంది' అని తెలిపారు.
'అందరి సపోర్ట్‌తో సినిమా చాలా బాగా వచ్చింది. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే చిత్రం ఇది' అని దర్శకుడు బాసి అన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఉండే కుర్రాడిగా మంచి పాత్ర చేశానని, నటనకు స్కోప్ ఉన్న పాత్ర అని హీరో ఆర్‌కె బ్రోస్ చెప్పారు.



బాసి, ఆర్‌కె బ్రోస్, బి.సతీష్

మనసు మాట వినదే



అపర్ణ జనార్ధనన్, రోహిత్ బెహల్

క్లాసిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లతో ఆకట్టుకున్న దర్శకుడు కె దశరథ్ అందిస్తున్న కథతో తెరకెక్కుతున్న చిత్రం 'లవ్ యూ రామ్'. ఈ చిత్రానికి డివై చౌదరి దర్శకత్వం వహిస్తున్నారు. డివై చౌదరి, కె దశరథ్ కలిసి మన ఎంటర్‌టైన్‌మెంట్స్, శ్రీ చక్ర ఫిలింస్ బ్యానర్ లపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రోహిత్ బెహల్, అపర్ణ జనార్ధనన్ జంటగా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, టీజర్, పాటకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.తాజాగా ఈ చిత్రం నుంచి 'మనసు మాట వినదే' పాటని అగ్ర కథానాయకుడు నాగార్జున లాంచ్ చేశారు. కె వేద ఈ పాటని లవ్లీ మెలోడీగా కంపోజ్ చేయగా, దివ్య మాలిక శ్రావ్యంగా అలపించారు. వరికుప్పల యాదగిరి సాహిత్యం అందించిన ఈ పాటలో లీడ్ పెయిర్ కెమిస్ట్రీ అందంగా ఉంది. సుధాకర్ బొర్రా (బేనస్సీ), డి నాగేశ్వరరావు సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి కిషోర్ గోపు, శివ మొక్క స్క్రీన్ ప్లే అందించారు. ప్రవీణ్ వర్మ మాటలు రాశారు. బెనర్జీ, ప్రదీప్, కాదంబరి కిరణ్, కార్టూనిస్ట్ మల్లిక్, మీర్, కె దశరథ్, డివై చౌదరి, ప్రభావతి వర్మ, శాంతి దేవగుడి తదితరులు నటిస్తున్న ఈచిత్రానికి డీవోపీ: సాయి సంతోష్, సంగీతం: కె వేద, ఎడిటింగ్: ఎస్.బి ఉద్ధవ్, ఆర్ట్: గురు మురళీకృష్ణ.

దసరా కానుక

బాలకృష్ణ, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'భగవంత్ కేసరి'. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మిస్తున్న ఈ చిత్ర టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. టీజర్ గత రికార్డులను బద్దలు కొట్టింది. ఈ సినిమాలో శ్రీలీల కీలక పాత్రలో నటిస్తోంది. ఆమె పుట్టిన రోజు సందర్భంగా మేకర్స్ ఈ సినిమాలోని శ్రీలీల ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. అందమైన చిరునవ్వుతో శ్రీలీల పోస్టర్ అందర్నీ ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తుండగా, అర్జున్ రాంపాల్ పవర్‌ఫుల్ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తు న్నారు. విజయదశమి (దసరా) కానుకగా ఈ చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: అనిల్ రావిపూడి, సంగీతం: ఎస్ థమన్.



శ్రీ లీల

ఇంద్రజాలం మొదలైంది



జై క్రిష్, ఇంద్రసేన

ఇంద్రసేన హీరోగా, జై క్రిష్ మరో ప్రధాన పాత్రలో పూర్విన్స్ మీడియా సమర్పణలో నిఖిల్ కె. బాల స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'ఇంద్రజాలం'. బుధవారం ఈ చిత్ర ప్రారంభ కార్యక్రమాలు రామానాయుడు స్టూడియోలో ఘనంగా జరిగాయి. ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ కోర్టులో న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్న ఆర్. మాధవరావు కెమెరా స్విచ్చాన్ చేయడంతో ఈ సినిమా ప్రారంభమైంది. ఈ సందర్భంగా మీడియాతో హీరో ఇంద్రసేన మాట్లాడుతూ, 'నేను నటించిన 'శాసనసభ' మూవీ నాకు మంచి పేరు తెచ్చిపెట్టింది. అమెజాన్ ప్రైమ్‌లో ఆ సినిమా చూసిన నిఖిల్ ఈ చిత్రంలో నాకు అవకాశం కల్పించారు' అని తెలిపారు.
'ఇది నాకు తొలి ప్రాజెక్ట్. ఇదొక క్రైమ్ థ్రిల్లర్‌తో కూడిన ప్రేమకథ. ఆద్యంతం ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా స్క్రీన్‌ప్లే ఉంటుంది. ఫస్ట్ నుంచీ ఫుల్ కామెడీ ఉంటుంది. ఇందులో ఇద్దరు హీరోయిన్స్ ఉంటారు. ఒకరిని మాత్రం 10 రోజుల్లో రివీల్ చేస్తాం. మరొక హీరోయిన్‌ను చివరి వరకూ సస్పెన్స్‌గానే ఉంచుతాం. రెండు షెడ్యూల్స్‌లో సినిమా పూర్తవుతుంది. ఒక షెడ్యూల్ బొంబాయిలో చేస్తాం. మరొకటి హైదరాబాద్‌లో చేస్తాం. .జూలై మూడో వారం నుంచి షూటింగ్‌కి వెళ్తాం' అని దర్శక, నిర్మాత నిఖిల్ చెప్పారు.

మాతృత్వం గొప్పతనం తెలిపే చిత్రం

నాని మూవీ వర్క్స్ అండ్ రామా క్రియేషన్స్ పతాకంపై విశ్వ కార్తికేయ, ఆయుషి పటేల్ హీరో, హీరోయిన్లుగా రమాకాంత్ రెడ్డిని దర్శకుడిగా పరిచయం చేస్తూ డాక్టర్ కె.చంద్ర ఓబుల్ రెడ్డి, జి మహేశ్వరరెడ్డి, కాటం రమేష్ సంయుక్తంగా నిర్మిస్తున్న ప్రొడక్షన్ నెం.1 చిత్ర పూజా కార్యక్రమాలు అన్నపూర్ణ స్టూడియోలో ఘనంగా ప్రారంభమయ్యాయి. నటులు సుమన్ స్క్రిప్ట్ అందించగా, హీరో, హీరోయిన్లపై చిత్రీకరించిన తొలి షాట్‌కు నిర్మాత కె.ఎస్ రామారావు క్లాప్ కొట్టారు. దర్శకుల సంఘం అధ్యక్షులు కాశీ విశ్వనాథ్ కెమెరా స్విచ్ ఆన్ చేసారు. దర్శకులు నీలకంఠ గౌరవ దర్శకత్వం వహించారు.
నిర్మాతలు మాట్లాడుతూ,' స్త్రీ తల్లి అవ్వడం ఒక అదృష్టం. ఆ అదృష్టాన్ని సరిగ్గా వినియోగించు కోకపోతే ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయనేది ఈ చిత్ర కథాంశం. జూలై మొదటి వారంలో షూటింగ్ ప్రారంభించి, సెప్టెంబర్‌లో మూవీ రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నాం' అని తెలిపారు. దర్శకుడు రమాకాంత్ రెడ్డి మాట్లాడుతూ,'ఫుల్ థ్రిల్లర్ సెంటిమెంట్‌తో వస్తున్న ఈ సినిమా అన్ని వర్గాల వారికీ కచ్చితంగా నచ్చుతుంది' అని చెప్పారు. 'ఇలాంటి మంచి సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు ధన్యవాదాలు' అని హీరో విశ్వ కార్తికేయ తెలిపారు. హీరోయిన్ పాత్రకు చాలా ఇంపార్టెన్స్ ఉందని ఆయుషి పటేల్ చెప్పారు.



విశ్వ కార్తికేయ, ఆయుషి పటేల్

అద్భుతమైన గ్రామీణ నేపథ్య కథ

విగ్నేష్ రెడ్డి గవి, శ్రీ ఆశ్రిత కీలక పాత్రలు పోషిస్తున్న చిత్రం 'రాజా రమ్యం'. ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ బుధవారం రిలీజ్ చేశారు. ప్రనిల్ గౌరీ పాగ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాకు ఆర్యన్ గండికోట కథ, స్క్రీన్ ప్లే అందించారు. కోకొండ జయచందర్ రెడ్డి, సంజయ్ రెడ్డి, అనిల్ పల్లాల నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని గావి ఫిలిమ్స్, సిల్లీ మాంక్స్ స్టూడియోస్ పై తెరకెక్కిస్తున్నారు
ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్ ఒక విలేజ్ బ్యాక్ గ్రౌండ్‌లో ఇద్దరు విద్యార్థులు సైకిల్ మీద కలిసి వెళ్తున్న సన్నివేశాన్ని మనం చూడొచ్చు. రొటీన్‌కు భిన్నంగా ఉన్న ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ ద్వారా మనం ఒక అద్భుతమైన విలేజ్ డ్రామాను చూడబోతున్నాం అనే విషయం క్లియర్‌గా అర్థమవుతుంది. ఒక అద్భుతమైన కథను ప్రేక్షకులకు ఈ సినిమా అందించనుంది.
ఈ మధ్యకాలంలో వచ్చిన ఎన్నో సినిమాలు రూరల్ డ్రామాలు కాగా, అదే కోవకు చెందిన ఈ సినిమా కూడా ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటోంది అని చిత్ర యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం : చరణ్ అర్జున్, ఎడిటర్ : ప్రదీప్ ఆర్ మోరం, డీ ఓ పి : ప్రవీణ్ కె బంగారి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : కిరణ్ రామానుజం, ఆర్ట్ : వెంకటేష్, లైన్ ప్రొడ్యూసర్ : ప్రసాద్ బిల్లకుర్తి, కొరియోగ్రాఫర్ : మోహన్ కృష్ణ, డైలాగ్స్ : అనిల్ మల్లెల, వి.సూర్య, సాహిత్యం : చరణ్ అర్జున్, లక్ష్మీ ప్రియాంక.



శ్రీ ఆశ్రిత, విగ్నేష్‌రెడ్డి గవి

నేడు లాసెట్ ఫలితాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో లా కోర్సుల్లో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల కోసం నిర్వహించిన లాసెట్ రాతపరీక్షల ఫలితాలు గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు హైదరాబాద్‌లో విడుదల కానున్నాయి. ఈ ఫలితాలను ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి విడుదల చేస్తారని లాసెట్ కన్వీనర్ బి విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ డి రవీందర్, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ వి వెంకటరమణ, కార్యదర్శి ఎస్ శ్రీనివాసరావు హాజరవుతారని పేర్కొన్నారు.

టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

- మొదటిరోజు 77.27 శాతం హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు ఒక ప్రకటన విడుదల చేశారు. బుధవారం మొదటిరోజు ఫస్ట్ లాంగ్వేజ్ (గ్రూప్-ఎ), ఫస్ట్ లాంగ్వేజ్ పార్ట్-1 (కాంపోజిట్ కోర్సు), ఫస్ట్ లాంగ్వేజ్ పార్ట్-2 (కాంపోజిట్ కోర్సు) పరీక్షకు 11,489 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారిలో 8,878 (77.27 శాతం) మంది హాజరయ్యారని తెలిపారు. 2,611 (22.73 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని వివరించారు. మొదటిరోజు పరీక్ష ప్రశాంతంగా నిర్వహించామని తెలిపారు.

ముగ్గురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై ఐటీ మెరుపు దాడులు

- వీరిలో ఇద్దరు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ
- మొత్తం 60 ప్రాంతాల్లో సోదాలు



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :
రాష్ట్రంలో మరోసారి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల ఆస్తులపై ఆదాయపు పన్ను శాఖ (ఐటీ) బుధవారం మెరుపుదాడులను నిర్వహించింది. ఐటీ అధికారులు టార్గెట్ చేసినవారిలో ఇద్దరు ఎమ్మెల్యేలు, ఒక పార్లమెంటు సభ్యుడు ఉన్నారు. వీరికి సంబంధించి మొత్తం 60 ప్రాంతాల్లో ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఐటీ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదాయపు పన్ను చెల్లింపుల్లో భారీ ఎత్తున అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలపై మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి నివాసాలు, కార్యాలయాలపై ఐటీ అధికారులు ఉదయం నుంచే దాడులను ప్రారంభించారు. మొత్తం 59 బృందాలుగా ఏర్పడిన ఐటీ అధికారులు హైదరాబాద్, సైబరాబాద్, భువనగిరితో పాటు పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. కొండాపూర్‌లోని ప్రభాకర్‌రెడ్డికి చెందిన విల్లాతో పాటు సమీపంలోని అతని కార్యాలయాల్లో సోదాలు నిర్వహించారు. అలాగే, జూబ్లిహిల్స్‌లోని ఎమ్మెల్యే జనార్ధన్‌రెడ్డి నివాసంతో పాటు అతనికి చెందిన కూకట్‌పల్లిలోని జేసీ బ్రదర్స్ షోరూమ్‌తో పాటు ఇతర కార్యాలయాల్లో కూడా సోదాలు జరిపారు. అలాగే, భువనగిరి ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి బావ, భువనగిరి మాజీ తహశీల్దార్ అయిన మోహన్‌రెడ్డి నివాసంలో సోదాలు ప్రారంభించిన అధికారులు అక్కడ లభించిన పత్రాలతో కొత్తపేట్‌లోని శేఖర్‌రెడ్డి నివాసంతో పాటు భువనగిరిలోని ఆయన రియల్‌ఎస్టేట్ కార్యాలయాల్లోనూ దాడులు చేశారు. అంతేగాక సదరు ప్రజాప్రతినిధుల సమీప కుటుంబసభ్యులు, స్నేహితుల నివాసాల్లోనూ ఐటీ అధికారులు దాడులు జరిపి సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గత మూడేండ్ల కాలంలో చెల్లించిన ఆదాయపు పన్ను రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే, వారి కార్యాలయాల్లోని ఆదాయపు పన్ను చెల్లింపులకు సంబంధించి కంప్యూటర్‌లోని హార్డ్ డిస్కులను కూడా స్వాధీనం చేసుకున్నారు. దాడులు జరుపుతున్న సమయంలో తమకు సెక్యూరిటీగా ఐటీ అధికారులు కేంద్ర బలగాలను వెంట తెచ్చుకున్నారు. రాత్రి పొద్దుపోయేంత వరకు కూడా ఈ సోదాలు కొనసాగాయి.
బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని, ప్రజాప్రతినిధులను బదనాం చేయడానికే బీజేపీ నాయకత్వం అక్రమంగా ఐటీ దాడులను చేయిస్తున్నదని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. ఎన్నికలు సమీపిస్తున్నవేళ బీఆర్ఎస్‌ను నేరుగా ఎదుర్కోలేక ఇలాంటి చౌకబారు ఎత్తుగడలకు బీజేపీ పాల్పడుతున్నదని ఆయన విమర్శించారు.

నీట్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థుల సత్తా

ఆలిండియా టాపర్‌గా వరుణ్ చక్రవర్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్-2023) ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు సత్తాచాటారు. ఆలిండియా టాపర్‌గా శ్రీచైతన్య విద్యార్థి బోర వరుణ్ చక్రవర్తి 720కి 720 మార్కులను సాధించి ఓపెన్ కేటగిరీలో ప్రథమ ర్యాంకు కైవసం చేసుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్, ఇన్ఫినిటీ లెర్న్ ఫౌండర్ సుష్మ మాట్లాడుతూ ఎస్ వరుణ్ 715 మార్కులతో తొమ్మిదో ర్యాంకును సాధించారన్నారు. శశాంక్ కుమార్ 14వ ర్యాంకును, రఘురామ్ రెడ్డి 15వ ర్యాంకును పొందారని వివరించారు.
ఆలిండియా ఓపెన్ కేటగిరీలో టాప్ 15లోపు నాలుగు, టాప్ 50లోపు తొమ్మిది, టాప్ 100లోపు 15 ర్యాంకులను తమ విద్యార్థులు సాధించారని చెప్పారు. వివిధ కేటగిరీల్లోనూ టాప్ 10లోపు 11, టాప్ 100లోపు 79 ర్యాంకులు ఒక్క శ్రీచైతన్య విద్యార్థులు ఈ ఘనత పొందారని అన్నారు. 700 మార్కులు ఆపైన 54 మంది విద్యార్థులు పొందారని అన్నారు. ఇది శ్రీ చైతన్య ఆధిపత్యానికి నిదర్శనమన్నారు. అందువల్లే దేశ వ్యాప్తంగా నీట్ ప్రవేశాల కోసం విద్యార్థులు శ్రీచైతన్యను కోరుకుంటున్నారన్నారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి శ్రీ చైతన్య విద్యాసంస్థల అధినేత బిఎస్ రావు అభినందించారని వివరించారు.



టాప్ ర్యాంకర్స్‌తో శ్రీ చైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్స్ శ్రీమతి సుష్మ & శ్రీమతి సీమ

ఒక్కసారైనా రక్తదానం చేయండి : గవర్నర్ తమిళిసై

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రతి ఒక్కరూ జీవితంలో ఒక్కసారైనా రక్తదానం చేయాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ పిలుపునిచ్చారు. బుధవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.
దాతలను అభినందించి సర్టిఫికెట్లను అందజేసారు. అత్యధికసార్లు రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదానం విజయవంతం చేయడంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని తెలిపారు.ఇందుకోసం అపోహలు తొలగించి అవగాహన కల్పించడం ఆవశ్యమని స్పష్టం చేశారు. రక్తదానమే జీవనదానమని అభివర్ణించారు.
ఈ కార్యక్రమంలో గవర్నర్ కార్యదర్శి కె. సురేంద్రమోహన్, రెడ్ క్రాస్ రాష్ట్ర చైర్మెన్ అజయ్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి టెంపుల్‌కు గ్రీన్ యాపిల్ అవార్డు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

లండన్‌లోని గ్రీన్ ఆర్గనైజేషన్ అందించే ప్రతిష్టాత్మక గ్రీన్ యాపిల్ అవార్డు యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహా స్వామి దేవాలయానికి దక్కడం పట్ల దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఇది రాష్ట్రానికి దక్కిన అపూర్వ గౌరవమని పేర్కొన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

ధర్మపురి స్ట్రాంగ్ రూం తాళాల మాయంపై
ఈసీ కమిటీ నివేదిక


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ధర్మపురి శాసనసభ స్థానానికి 2018లో ఎన్నికలు జరిగాక ఈవీఎంలు, ఫైళ్లను భద్రం చేసిన స్ట్రాంగ్ రూమ్స్‌కు సీల్ వేయడంలో జరిగిన లోపాలపై కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన కమిటీ హైకోర్టుకు నివేదిక సమర్పించింది. స్ట్రాంగ్ రూంలో భద్రపరిచే అంశాలపై విధానపరమైన లోపాలు ఉన్నాయని ఆ కమిటీ గుర్తించింది అప్పటి జగిత్యాల జిల్లా ఎన్నికల అధికారి (కలెక్టర్) ఎ.శరత్, నియోజకర్గ రిటర్నింగ్ అధికారి భిక్షపతి, డిప్యూటీ జిల్లా ఎన్నికల అధికారి రాజేశం ఈసీ సూచనలను అమలు చేయలేదని పేర్కొంది. రెండు తాళాలు వేయాలన్న ఈసీ ఆదేశాల్ని అమలు చేయలేదని స్పష్టం చేసింది. రిటర్నింగ్ అధికారి నుంచి తాళాలు తీసుకోడానికి రాజేశం ఆసక్తి చూపలేదనీ, తర్వాత వచ్చిన ఎన్నికల అధికారులు రవి, యాస్మిన్‌లు కూడా తాళాలు తీసుకోలేదని చెప్పింది. రెండు తాళాలు వేసి ఒక తాళాన్ని ఎన్నికల అధికారి వద్ద ఉంచుకోవాలన్న నిబంధనను అమలు చేయలేదని పేర్కొంది. ధర్మపురి నియోజకవర్గం నుంచి కొప్పుల ఈశ్వర్ (మంత్రి) ఎన్నికను కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన లక్ష్మణ్‌రావు సవాల్ చేసిన కేసులో ఆ తాళాలు తీయాలని గతంలో హైకోర్టు ఆదేశించింది. స్ట్రాంగ్ రూం తాళాలు కనబడకపోవడంపై విచారణ చేపట్టాలని ఈసీని ఆదేశించింది. దీంతో ఈసీ ముగ్గురితో కమిటీని ఏర్పాటు చేసి విచారించింది. కమిటీ నివేదికలో స్ట్రాంగ్ రూంకు వేయాల్సిన తాళాలు తహసీల్దార్ కార్యాలయంలోని సీలు లేని ఒక చిన్న పెట్టెలో ఉన్నట్టు కూడా కమిటీ తన నివేదికలో పేర్కొంది. ఈ నివేదికపై హైకోర్టు విచారణ చేపట్టనుంది.

ఆటలు

టాప్‌లో అశ్విన్
రహానే, శార్దూల్‌కు చోటు..

ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్ విడుదల



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) టెస్టు ర్యాంకింగ్స్‌లో టీమిండియా స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ మరోసారి టాప్ లేపాడు. అలాగే ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి) ఫైనల్లో మెరుగైన ఆటను ప్రదర్శించిన అజింక్య రహానే, శార్దూల్ ఠాకూర్‌లు ర్యాంకింగ్స్‌లో చోటు దక్కించుకున్నారు. రహానే 37వ స్థానంలో, శార్దూల్ 94వ స్థానంలో ఉన్నారు. డబ్ల్యూటీసీ ఫైనల్లో రహానే 89, 46 రన్స్ చేయగా, శార్దూల్ కీలకమైన హాఫ్ సెంచరీ చేశాడు. ఇక టెస్టు బౌలర్లలో రవిచంద్రన్ అశ్విన్ టాప్ బౌలర్‌గా నిలిచారు. ఆస్ట్రేలియాకు చెందిన ముగ్గురు బ్యాటర్లు టాప్ ప్లేస్ కొట్టేవారు. ఆ జాబితాలో స్టీవ్ స్మిత్, ట్రావిస్ హెడ్, మార్నస్ లబుషేన్ ఉన్నారు. గాయం నుంచి కోలుకుంటున్న వికెట్ కీపర్ రిషబ్ పంత్ మాత్రం ర్యాంకింగ్స్ లిస్టులో టాప్‌లో ఉన్నారు. పంత్ పదో ర్యాంక్‌లో ఉండగా, రోహిత్.. కోహ్లీలు 12, 13వ స్థానాల్లో ఉన్నారు. బ్యాటింగ్‌లో 903 రేటింగ్ పాయింట్లతో లబుషేన్ తొలిస్థానంలో ఉన్నాడు. డబ్ల్యూటీసీ ఫైనల్లో 121, 34 రన్స్ కొట్టిన స్మిత్(885) రెండో స్థానాన్ని ఆక్రమించాడు. ఇక మరో సెంచరీ హీరో ట్రావిస్ హెడ్(884) మూడో స్థానంలో ఉన్నాడు. ముగ్గురు టాప్ బ్యాటర్లు ఒకే దేశానికి చెంది ఉండడం చాలా అరుదు. గతంలో 1984లో ఒకసారి ఇలా జరిగింది. విండీస్ ప్లేయర్లు గ్రీనిడ్జ్, క్లైవ్ లాయిడ్, లారీ గోమ్స్‌లు టాప్ ప్లేస్ కొట్టేశారు.

సానుకూలంగా స్పందిస్తాం

విద్యుత్ కార్మికుల సమస్యలపై సీఎమ్‌డీ డీ ప్రభాకరరావు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారంపై సానుకూలంగా స్పందిస్తామని టీఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకరరావు అన్నారు. బుధవారంనాడిక్కడి మింట్‌కాపౌండ్‌లోని విద్యుత్ కార్మిక భవనంలో 1104 యూనియన్ ముద్రించిన 2023 వేతన సవరణ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ కార్మికులు మరింత కష్టించి పనిచేయాలనీ, తమ సేవల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలని అన్నారు. విద్యుత్ కార్మికుల కష్టాన్ని ప్రభుత్వం గుర్తించిందనీ, ఏ శాఖకు ఇవ్వని ప్రాధాన్యత ఇస్తున్నదనీ, ఆ ఉనికిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. 1104 యూనియన్ ప్రధాన కార్యదర్శి జీ సాయిబాబు మాట్లాడుతూ ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్ సమస్యను ప్రస్తావించి, పరిష్కరించాలని కోరారు. 2022 ఏప్రిల్ తర్వాత ఉద్యోగంలో చేరిన వారికి వేతన వ్యత్యాసం ఉన్నదనీ, దాన్ని సవరించాలని చెప్పారు. అన్‌మ్యాన్డ్ కాంట్రాక్ట్ కార్మికులకు స్కిల్డ్ వేతనాలు చెల్లించాలనీ, టీఎస్ఎస్‌పీడీసీఎల్ పరిధిలో సొసైటీ ద్వారా వేతనాలు తీసుకుంటున్న 136 మందిని ఆర్టిజన్లుగా గుర్తించి, నూతన పేస్కేల్స్ అమలు చేయాలని కోరారు. ప్రమోషన్లు ఇవ్వాలనీ, కన్వర్షన్ ఉద్యోగులకు స్కీనింగ్ టెస్ట్ నుంచి మినహాయింపు ఇవ్వాలనీ, సీనియన్ ఫోర్‌మెన్ పోస్టులు ఇవ్వాలనీ, ఆర్టిజన్లకు మెడికల్ ఇన్‌వ్యాలిడ్ స్కీం వర్తింపచేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ జీ రఘుమారెడ్డి, యూనియన్ కార్యవర్గ సభ్యులు ఎస్ సుధీర్, కార్యనిర్వాహక అధ్యక్షులు జీ వరప్రసాద్, సలహాదారులు ఆర్ జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గర్వంగా ఉంది-మంత్రి వేముల

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలోని ఐదు నిర్మాణాలకు అంతర్జాతీయ అవార్డులు రావడం గర్వంగా ఉందని రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనికతకు ఈ అవార్డులు నిదర్శనమని చెప్పారు. తన శాఖ అధ్వర్యంలో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం, యాదగిరి గుట్ట లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం, ఇంటిగ్రేటెడ్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్లకు 'ఇంటర్నేషనల్ బ్యూటీఫుల్ బిల్డింగ్స్ గ్రీన్ యాపిల్ అవార్డులు' లభించాయని సంతోషం వ్యక్తం చేశారు. నిర్మాణ నాణ్యత ప్రమాణాల్లో ఎక్కడా రాజీ పడకుండా పర్యావరణ హితంగా ఈ భవనాల నిర్మాణం జరిగిందనీ, ఫలితంగా తెలంగాణ ఖ్యాతి విశ్వవ్యాప్తం అయిందన్నారు.

22న తెలంగాణ అమరుల స్మారక చిహ్నాం ప్రారంభం

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ముగింపు రోజైన 22వ తేదీ అమరులస్మారక చిహ్నాం సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నట్టు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లపై బుధవారంనాడాయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ హుస్సేన్ సాగర్ ఒడ్డున రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ నిర్మాణాన్ని చేపట్టిందన్నారు. ప్రారంభ కార్యక్రమానికి సంబంధించి రూట్‌మ్యాప్‌ను ఆయన పరిశీలించారు. ఆరోజు నిర్వహించాల్సిన సాంస్కృతిక కార్యక్రమాలు, సభ, ఆహూతులు, పార్కింగ్ ఏర్పాట్లు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి, అధికారులకు బాధ్యతలు అప్పగించారు. సమావేశంలో డీజీపీ అంజనీకుమార్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ స్పెషల్ సెక్రెటరీ విజయేంద్ర బోయి, ఈఎన్సీ గణపతిరెడ్డి, సమాచార శాఖ కమిషనర్ అశోక్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ హఫీజ్, ఇఇ నర్సింగరావు, భాషా సంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికష్ణ తదితరులు పాల్గొన్నారు.

వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ ప్రైజ్ మనీ భారీగా పెంపు

సింగిల్స్ విజేతకు రూ.24.44కోట్లు, రన్నరప్‌కు రూ.12.22కోట్లు



లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఆటగాళ్లకిచ్చే ప్రైజ్ మనీ మరోసారి భారీ పెరిగింది. గత ఏడాదితో ఈసారి ఆటగాళ్లకిచ్చే ప్రైజ్‌మనీని 11.2 శాతం పెంపు దల చేస్తున్నట్లు ఇంగ్లండ్ లాన్ టెన్నిస్ అండ్ క్రోకెట్ క్లబ్ (ఎఇఎల్ టిసి) నిర్వాహకులు బుధవారం ఓ ప్రకట నలో వెల్లడించారు. దీంతో ఈ ఏడాది మొత్తం 44.7మిలియన్ పౌండ్స్(రూ.465కోట్లు) ప్రైజ్ మనీని అందజేయనున్నారు. సింగిల్స్ విజేత 2.35 మిలియన్ పౌండ్స్(రూ.24.44కోట్లు), రన్నరప్ విజేత రూ.1.175మిలియన్ పౌండ్స్ (రూ.12.22కోట్లు) ప్రైజ్ మనీ అందుకోనున్నారు. ఇది గత ఏడాదితో పోల్చిచూస్తే 1.7మిలియన్ పౌండ్స్, అంతకు ముందు ఏడాదితో పోల్చిచూస్తే 2మిలియన్స్ పౌండ్స్ అధికం. అలాగే పురుషుల, మహిళల డబుల్స్ విజేతలకు అందజేసే ప్రైజ్ మనీని 10.7 శాతం పెంపుదల చేశారు. వీల్‌ఛైర్ మరియు క్వాడ్ వీల్‌ఛైర్ సింగిల్స్, డబుల్స్ విజేతలకు అందజేసే ప్రైజ్ మనీని 20శాతం పెంపుదల చేశారు. 2019లో తొలిసారి ఆటగాళ్లకు అందజేసే ప్రైజ్ మనీని పెంచిన నిర్వాహకులు తాజాగా మరోసారి భారీగా ప్రైజ్ మనీని పెంపుదల చేశారు. అలాగే క్వాలిఫయింగ్ టోర్నీలో ఆటగాళ్లకిచ్చే ప్రైజ్ మనీలోనూ 14.5శాతం పెంపుదల కనిపించింది. ఇక మెయిన్ డ్రా తొలిరౌండ్ విజేత 10శాతం పెంపుదలతో 55వేల పౌండ్స్(రూ.57లక్షలు) అందుకోను న్నాడు. గత ఏడాది తొలిరౌండ్ విజేతకు 10.7శాతం ప్రైజ్ మనీ దక్కితే.. అది ఈసారి 20శాతానికి పెరిగింది. ఈ మేరకు ఆల్ ఇంగ్లండ్ క్లమ్ ఛైర్మన్ ఇవాన్ హెవిట్ అధికారికంగా ప్రైజ్ మనీ పెంపుదల విషయాన్ని వెల్లడించారు.

ప్రిక్వార్టర్స్‌కు శ్రీకాంత్, లక్ష్యసేన్

ఇండోనేషియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ



జకార్తా : ఇండోనేషియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ ప్రి క్వార్టర్‌ఫైనల్లోకి లక్ష్యసేన్, కిదాంబి శ్రీకాంత్ ప్రవేశించాడు. బుధవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో లక్ష్యసేన్ 21-17, 21-13తో అమెరికాకు చెందిన 8వ సీడ్ లీ-జి-జియావోపై, కిదాంబి శ్రీకాంత్ 21-13, 21-19తో చైనాకు చెందిన లూ-జంగ్-జూ(చైనా)పై వరుససెట్లలో గెలిచారు. ఇక మహిళల సింగిల్స్‌లో ఆకర్షి కశ్యప్ 10-21, 4-21తో 2వ సీడ్ కొరియాకు చెందిన అన్-సే-యంగ్ చేతిలో చిత్తుగా ఓడగా.. మరో పోటీలో ప్రియాంశు రాజ్‌వత్‌కు తొలిరౌండ్‌లో వాకోవర్ లభించింది. ప్రత్యర్థి 3వ సీడ్ విదిత్‌శరణ్(థాయ్‌లాండ్) తొలి మ్యాచ్ ఆడకుండా వైదొలిగాడు. దీంతో ప్రియాంశు ప్రి క్వార్టర్స్‌కు చేరిన సంగతి తెలిసిందే.

న్యూజిలాండ్‌కు ఎదురుదెబ్బ

వన్డే ప్రపంచకప్‌కు బ్రేస్‌వెల్ దూరం?



లండన్: న్యూజిల్యాండ్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆల్‌రౌండర్ మైకెల్ బ్రేస్‌వెల్ వన్డే ప్రపంచకప్‌కు దూరం కానున్నాడు. ఇంగ్లండ్ కౌంటీల్లో వార్సెస్టర్‌షైర్ తరఫున ఆడుతున్న బ్రేస్‌వెల్.. యార్క్‌షైర్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో బ్యాటింగ్ చేస్తూ తీవ్రంగా గాయపడ్డాడు. 11 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద తీవ్రంగా గాయపడి రిటైర్డ్ హర్ట్‌గా పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత పరీక్షల్లో అతని కుడి కాలి మడమ దగ్గర తీవ్రమైన గాయమైనట్లు తేలింది. దీంతో ఈ 32ఏళ్ల ఆల్‌రౌండర్‌కు ఇంగ్లండ్‌లోనే శస్త్రచికిత్స చేయనున్నారు. ఈ ఆపరేషన్ తర్వాత కనీసం రెండు వారాల విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుందట. అనంతరం స్వదేశం వెళ్లిపోనున్న బ్రేస్‌వెల్.. అక్కడ ఆరు నుంచి ఎనిమిది నెలలపాటు రెస్ట్ తీసుకోవాలని వైద్యులు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే ఈ ఏడాది చివర్లో భారత్ వేదికగా జరిగే వన్డే వరల్డ్ కప్‌లో అతను ఆడటం జరగదు.

109 పాలిటెక్నిక్ కాలేజీల్లో 25,290 సీట్లు

పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 109 పాలిటెక్నిక్ కాలేజీల్లో 25,290 సీట్లున్నాయని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, పాలిసెట్ ప్రవేశాల కన్వీనర్ నవీన్ మిట్టల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో 56 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో 12,450 సీట్లు, 53 ప్రయివేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో 12,840 సీట్లున్నాయని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ ప్రక్రియ బుధవారం ప్రారంభమైందని తెలిపారు. ఆన్‌లైన్‌లో ప్రాథమిక సమాచారం, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, ధ్రువపత్రాల పరిశీలన కోసం స్లాట్ బుకింగ్ ప్రక్రియ షురూ అయ్యిందని వివరించారు. మొదటిరోజు 10,369 మంది అభ్యర్థులు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకున్నారని తెలిపారు. ఈనెల 16 నుంచి ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అదేరోజు వెబ్‌ఆప్షన్ల నమోదు ప్రక్రియ ప్రారంభమై 21 వరకు అవకాశముంటుందని వివరించారు. పూర్తి వివరాలకు హ్ట్జూం:7/ఒజూశీశ్రీఎవ్.అఱఎ.ఱఅ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

మళ్లీ ఉమ్మడి పౌర స్మృతి చిచ్చు

- సూచనలు కోరిన లా కమిషన్

న్యూఢిల్లీ : ఉమ్మడి పౌర స్మృతిపై 22వ లా కమిషన్ ఆఫ్ ఇండియా బుధవారం కొత్తగా సూచనలను కోరింది. ప్రజలు, మత సంస్థలతో సహా వివిధ భాగస్వామ్యుల నుంచి సూచనలను ఆహ్వానించింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. గతంలోని 21వ లా కమిషన్ కూడా ఈ అంశాన్ని పరిశీలించి, వివిధ భాగస్వామ్యుల నుంచి సూచనలను ఆహ్వానించింది. ఆగస్టు 2018లో 'కుటుంబ చట్టాల సంస్కరణలు'పై ఒక సంప్రదింపు పత్రాన్ని కూడా విడుదల చేసింది. అయితే ఈ అంశం యొక్క ఔచిత్యాన్ని, ప్రాముఖ్యతను, వివిధ కోర్టుల తీర్పులను దృష్టిలో ఉంచుకుని ఈ విషయాన్ని మళ్లీ చర్చకు తీసుకుని వస్తున్నట్టు తాజా లా కమిషన్ తెలిపింది. దేశంలో ప్రస్తుతం ఉమ్మడి పౌర స్మృతి అవసరం లేదని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బిఎస్ చౌహాన్ నేతృత్వంలోని 21వ లా కమిషన్ తెల్చి చెప్పింది. దేశంలో ప్రబలంగా ఉన్న బహుళత్వంతో లౌకికవాదానికి ఎలాంటి ముప్పు లేదని పేర్కొంది. అయినా దాన్ని మళ్లీ మళ్లీ ప్రజల ముందుకు తెచ్చేందుకు, విద్వేషాలు సృష్టించేందుకు మోడీ సర్కార్ ప్రయత్నిస్తూనే వుంది.

పునరంకితం

టీఎస్ఆర్టీసీ ఈయూ 9వ ఆవిర్భావ వార్షికోత్సంలో నేతలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారంకోసం ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) పునరంకితం అవుతుందని పలువురు నేతలు అన్నారు. బుధవారంనాడిక్కడి రాష్ట్ర కార్యాలయంలో ఈయూ 9వ ఆవిర్భావ వార్షికోత్సవం జరిగింది. యూనియన్ ప్రధాన కార్యదర్శి కే రాజిరెడ్డి యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యదర్శి డీ గోపాల్, టీఎస్ రెడ్డి, ఏఎస్ రెడ్డి, జీ కృష్ణ, ఆర్ కిషన్‌గౌడ్, జీ కుపిన్, జీ శ్యామ్యూల్, లింగస్వామి, బంగారం, ఏ లాజరస్, ఎమ్ రాఘవేంద్రరావు, సీహెచ్ కృష్ణారావు, బీ యాదయ్య, వీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఆర్టీసీ కార్మికుల రెండు వేతన సవరణలు, సీసీఎస్, పీఎఫ్ బకాయిలు, యాజమాన్య వేధింపులు, గుర్తింపు సంఘం ఎన్నికలు సహా పలు అంశాలను ప్రస్తావించారు. వాటి పరిష్కారానికి యాజమాన్యం, ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

బీసీలకు కాంగ్రెస్, ఇతర పార్టీల మోసం

- మోడీ ప్రధాని అయ్యాకే ఎన్‌సీబీసీకి రాజ్యాంగ హోదా : కె.లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్‌తో సహా ఇతర పార్టీలన్నీ బీసీలకు మోసం చేశాయని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. మోడీ ప్రధాన మంత్రి అయ్యాకనే ఎన్‌సీబీసీకి రాజ్యాంగ హోదా లభించిందని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 2017లో కాంగ్రెస్‌తో పాటు మిగతా పార్టీలు ఎన్‌సీబీసీ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేశాయని విమర్శించారు. కేంద్ర విద్యాలయాల్లో కూడా బీసీలకు రిజర్వేషన్ ఇచ్చిన ఘనత మోడీ సర్కారుదేనన్నారు. బెంగాల్, తెలంగాణ, బీహార్ ప్రభుత్వాలు బీసీ వ్యతిరేకమని ఆచరణలో తేలిందని చెప్పారు. ముస్లిం ఓట్ల కోసం బీసీ రిజర్వేషన్లను మారుస్తున్నదని విమర్శించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కూడా ఇదే పని చేశారన్నారు. మైనార్టీలకు రిజర్వేషన్లు అని చెప్పి సిక్కు, జైన్ లాంటి వారిని ఎందుకు కలపలేదని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలులోనూ బీసీ విద్యార్థులకు అన్యాయం జరుగుతున్నదన్నారు.

సీఆర్టీల సేవలను క్రమబద్ధీకరించాలి

- లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతాం...: శివ నాయక్




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో గత 18 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ ఉపాధ్యాయుల (సిఆర్టీ) సర్వీస్‌లను క్రమబద్ధీకరించాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని గిరిజన ఆశ్రమ పాఠశాల కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల జాతీయ కార్యదర్శి శివ నాయక్ హెచ్చరించారు. హైదరాబాద్ లోని మాసబ్‌ట్యాంక్ గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం ముందు బుధవారం కాంటాక్ట్ ఉపాధ్యాయులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005 నుంచి 1804 మంది గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఇచ్చిన హామి ప్రకారం వారందరినీ క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈ నెల 22, 23 తేదీలలో సమావేశమై భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.ఈ ధర్నాలో గిరిజన ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల సంఘం జాతీయ అధ్యక్షులు అజ్మీర శివ నాయక్, రాష్ట్ర అధ్యక్షులు సోమేశ్ నాయక్, వర్కింగ్ అధ్యక్షులు వినీత్ రావు జాదవ్, ఉపాధ్యక్షులు గోడం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సీమ నాయక్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఇఎపి సెట్‌లో బాలికలదే హవా

- టాప్ టెన్‌లో బాలురు
- ఇంజినీరింగ్‌లో 76.32 శాతం
- అగ్రికల్చర్‌లో 89.65 శాతం ఉత్తీర్ణత

అమరావతి: ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన ఉమ్మడి ప్రవేశ పరీక్షల (ఇఎపిసెట్) ఫలితాల్లో బాలికలు పైచేయి సాధించారు. ఇందుకు సంబంధించిన ఇఎపిసెట్ ఫలితాలను విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో బుధవారం విడుదల చేశారు. ఇంజినీరింగ్ విభాగంలో బాలురు కంటే బాలికలు 3.99 శాతం, అగ్రికల్చర్‌లో బాలురు కంటే 0.99 శాతం అధికంగా ఉత్తీర్ణులయ్యారు. అయితే రెండు విభాగాల్లో టాప్ టెన్‌లో బాలురే పైచేయి సాధించారు. ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో మొదటి పది స్థానాలు బాలురే సాధించారు. బాలికలు ఒక్కరు కూడా లేరు. మే 15 నుంచి 19 వరకు జరిగిన ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షకు 2,3,180 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 2,24,724 మంది పరీక్ష రాయగా, 1,71,514 (76.32 శాతం) మంది అర్హత సాధించారు. 92,267 మంది బాలికలు పరీక్ష రాయగా, 72,589 మంది (78.67 శాతం) అర్హత పొందారు. మే 23, 24 తేదీల్లో జరిగిన అగ్రికల్చర్ విభాగం ప్రవేశ పరీక్షకు 1,00,559 మంది దరఖాస్తు చేసుకోగా, 90,573 మంది పరీక్ష రాశారు. వీరిలో 81,203 (89.65 శాతం) మంది అర్హత సాధించారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని చెప్పారు. అందుకనే సత్ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి విద్యార్థీ ప్రపంచ స్థాయికి ఎదగాలన్నది సిఎం ఆశయమని అన్నారు. ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ సీట్ల కేటాయింపు వివరాలు ఎఐసిటిఇ నుంచి అనుమతి రావాలని చెప్పారు. కాబట్టి జులై 15 నుంచి ఇఎపిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభించాలని భావిస్తున్నామని తెలిపారు. యూనివర్సిటీల్లో పోస్టుల భర్తీకి సంబంధించిన కేసు నాలుగేళ్ల నుంచి కోర్టు పరిధిలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ కె రామ్మోహన్‌రావు, కార్యదర్శి నజీర్ అహ్మద్, సెట్ల కన్వీనర్ ఎం సుధీర్ రెడ్డి, ఇఎపిసెట్ ఛైర్మన్ జి రంగా జనార్ధన, కన్వీనరు శోభా బిందు పాల్గొన్నారు.





విడిగానా, ఉమ్మడిగానా ఇంకా తేల్చుకోలేదు

వారాహి యాత్ర ప్రారంభంలో పవన్ కల్యాణ్

కాకినాడ: ఈసారి ప్రజలు దీవించి అవకాశమిస్తే అవినీతిలేని ప్రజా ప్రభుత్వాన్ని స్థాపిస్తామని జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. విడిగా వస్తానో, ఉమ్మడిగా వస్తానో ఇంకా నిర్ణయించుకోలేదని, ముఖ్యమంత్రి పదవి ఇస్తే సంతోషంగా స్వీకరిస్తానని వ్యాఖ్యానించారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని అన్నవరంలో బుధవారం ఉదయం ఆయన పూజలు చేసి వారాహి యాత్రను ప్రారంభించారు. అక్కడి నుంచి ర్యాలీగా కత్తిపూడి చేరుకొని రాత్రి జరిగిన సభలో వారాహి వాహనంపై నుంచి మాట్లాడారు. ఈసారి అసెంబ్లీలో అడుగు పెట్టకుండా తనను ఎవరు ఆపుతారో చూస్తానని సవాల్ విసిరారు. పరిపాలించేవాడు నిజాయితీపరుడుగా, బాధ్యతగా లేకపోతే కచ్చితంగా ప్రశ్నిస్తానన్నారు. ఎన్ని రకాలుగా ఇబ్బందులు పెట్టినా పార్టీని నడుపుతానని తేల్చి చెప్పారు. గెలిచిన ఒక్క సీటూ లాక్కున్నారని, అయినా వైసిపి నాయకులు భయపడుతున్నారని అన్నారు. వచ్చేది క్లాస్ వార్ అంటూ జగన్ అమాయక వ్యక్తిలా నటిస్తున్నారని విమర్శించారు. పార్టీని నడపడానికే తాను సినిమాలు చేస్తున్నానన్నారు. క్లాస్ వార్ ఎవరు చేస్తున్నారో ప్రజలు గమనించాలని, ఈ రాష్ట్రం కోసం నిలబడే వ్యక్తులు కావాలని బలంగా కోరుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత కూడా ఆంధ్రా నాయకులకు బుద్ధి రావడం లేదన్నారు. వారాహి యాత్రపై ఆంక్షలు పెట్టి పోలీసులు అడ్డుకోవాలని చూశారని విమర్శించారు. దోపిడీదారులు, అవినీతిపరులపైనే తన పోరాటమని తెలిపారు. రాష్ట్రంలో అవినీతి, అరాచక పాలన సాగుతోందని, రాష్ట్రాన్ని దోచుకుతింటూ ప్రజలను దోపిడీ చేస్తూ తనను టార్గెట్ చేస్తున్నారని విమర్శించారు. మద్యపాన నిషేధం అమలు చేయలేదని, సిపిఎస్‌ను రద్దు చేయలేదని జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎనిమిదిసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్తి పన్నును విపరీతంగా పెంచిందని, అభివృద్ధిని పక్కనపెట్టి పన్నుల భారాలు మోపుతోందని విమర్శించారు. స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కరవయ్యాయన్నారు. కీలక పోస్టులన్నీ ఒకే సామాజిక తరగతికి పరిమితం చేయడం సరికాదని తెలిపారు. అన్ని సామాజిక తరగతులకూ ప్రాధాన్యత ఉండాలన్నారు. అమరావతి ఒక కులానికే చెందినది అనుకుంటే ఆనాడే ఎందుకు వ్యతిరేకించలేదని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని ప్రశ్నించారు. వైసిపికి పోలవరం ఎటిఎం లాంటిదని ఆరోపించారు. భవిష్యత్‌లో వైసిపిని ఎదుర్కొనేది జనసేన మాత్రమేనన్నారు. ఎపికి అమరావతే రాజధానిగా ఉంటుందని తెలిపారు. కానీ, మూడు రాజధానులంటూ జగన్ నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో నవంబర్ లేదా డిసెంబర్‌లో ఎన్నికలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. గొప్ప వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకొని రాజకీయాల్లోకి వచ్చానని, ఒక్కసారి అసెంబ్లీకి పంపాలని విజ్ఞప్తి చేశారు.

సీఏఏ, ఎన్‌ఆర్‌సీపై నాటకాన్ని ప్రదర్శించిన బీదర్ పాఠశాలపై దేశద్రోహం కేసు కొట్టివేత

బెంగళూరు : కర్నాటకలోని బీదర్‌లో ఉన్న సాహీన్ పాఠశాలపై పోలీసులు నమోదు చేసిన దేశద్రోహం కేసును ఆ రాష్ట్ర హైకోర్టు బుధవారం నాడు కొట్టివేసింది. 2020లో పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌర రిజిస్టరు (ఎన్‌ఆర్‌సీ) నేపథ్య కథాంశాలతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ తీరును ఎండగడతూ ఈ పాఠశాలలో చిన్నారులు ఒక వ్యంగ్య నాటకాన్ని ప్రదర్శించిన సంగతి తెలిసింది. 2020 జనవరి 21న పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా నాలుగో తరగతి పిల్లలు ఈ నాటకాన్ని ప్రదర్శించారు. ఎన్‌ఆర్‌సీ ధ్రువీకరణ కోసమంటూ తనను ఎవరైనా ఏదైనా పత్రాన్ని అడిగితే పాదరక్షలతో కొడతానని నాటకంలో పాత్రదారిగా ఉన్న ఒక బాలిక హెచ్చరిస్తుంది. భరతమాత ముద్దుబిడ్డలమైన తాము ఈ దేశ పౌరులమని నిరూపించుకునేందుకు ప్రత్యేక డాక్యుమెంట్లేవీ చూపించనవసరం లేదని, తాము భారతీయులమని చెప్పుకోవడానికి ఎవ్వరి వద్దా ధ్రువీకరణలు పొందనవసరం తమకు లేదని ఈ నాటకంలోని ఇతర పాత్రదారులు కూడా స్పష్టం చేస్తారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At Navatelangana Printers Private Limited, Laxmidas Bhavan, Phase-2, Plot No. 8&9, Surana X Road, Near Mint Compound, Ida, Charlapally, Medchal-Malkajgiri District-500051, Published At Navatelangana Printers Private Limited, Laxmidas Bhavan, Phase-2, Plot.8&9, Surana X Road, Near Mint Compound, Ida, Charlapally, Medchal-Malkajgiri District-500051, Telangana State, Editor : R.Sudha Bhaskar. TELTEL/2015/60815

శాస్త్రీయత లోపించిన చదువులు

శాస్త్రీయ అక్షరాస్యత, విమర్శ నాత్మక ఆలోచన, సాక్ష్యం-ఆధారిత తార్కికతను పెంపొందిం చడంలో విద్య కీలక పాత్ర పోషిస్తుంది. ఆవర్తన పట్టిక, జీవ పరిణామం వంటి ముఖ్యమైన శాస్త్రీయ భావనలను తీసివేయడం వలన విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనలతో నిమగ్నమై సహజ ప్రపంచాన్ని అర్థం చేసుకునే సామర్థ్యాన్ని నిలువరించారు. పాఠశాల పాఠ్యపుస్తకాల నుంచి కీలకమైన శాస్త్రీయ భావనలను తీసివేయడం వల్ల పాఠశాల విద్య, ఉన్నత విద్య లేదా శాస్త్రీయ పరిశోధనల మధ్య అంతరం ఏర్పడవచ్చు. విద్యార్థులు అధునాతన శాస్త్రీయ భావనలను గ్రహించడానికి కష్టపడవచ్చు లేదా ప్రాథమిక అంశాలలో బలమైన పునాది అవసరమయ్యే శాస్త్రీయ రంగాలలో వృత్తిని కొనసాగించవచ్చు. భారతదేశంలో, విద్యా సంవత్సరం ప్రారంభంలో ఈ నెలలో పాఠశాలకు తిరిగి వచ్చే 16ఏళ్ల లోపు పిల్లలకు ఇకపై పరిణామం, మూలకాల ఆవర్తన పట్టిక లేదా శక్తి వనరుల గురించి బోధించబడదు. 15-16 సంవత్సరాల మధ్య వయస్సు గల విద్యార్థులు పాఠ్యాంశాల నుండి పరిణామం తీసివేయబడుతుంది అనే వార్త గత నెలలో విస్తృతంగా నివేదించబడింది, దీనికి నిరసనగా వేలాది మంది ప్రజలు ఒక పిటిషన్‌పై సంతకం చేశారు. అయితే శక్తి వనరులు పర్యావరణ స్థిరత్వం వంటి ఇతర పునాది అంశాలతో పాటు ఆవర్తన పట్టికలో ఒక అధ్యాయం కూడా కత్తిరించబడింది. విద్యార్థులకు ఇకపై కొన్ని కాలుష్యం-వాతావరణ సంబంధిత అంశాలను బోధించరు. జీవశాస్త్రం, రసాయన శాస్త్రం, భౌగోళిక శాస్త్రం, గణితం అలాగే భౌతిక శాస్త్రాలకు కోతలున్నాయి. మొత్తం మీద, ఈ మార్పులు దేశంలోని పాఠశాలల్లోని 134 మిలియన్ల 11-18 సంవత్సరాల వయస్సు పిల్లలను ప్రభావితం చేస్తాయి. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (NCERT) - భారతీయ పాఠశాల పాఠ్యాంశాలు పాఠ్య పుస్తకాలను అభివద్ధి చేసే పబ్లిక్ బాడీ- మేలో ప్రారంభమైన కొత్త విద్యాసంవత్సరానికి సంబంధించిన పాఠ్య పుస్తకాలను విడుదల చేయడంతో గత నెలలో ఎంత మార్పు జరిగిందో స్పష్టమైంది. సాధారణంగా 15-16 సంవత్సరాల వయస్సు గల 10వ తరగతి విద్యార్థుల కోసం ఆవర్తన పట్టికలోని ఒక అధ్యాయం సిలబస్ నుండి తీసివేయబడింది. శక్తి వనరులు, సహజ వనరుల స్థిరమైన నిర్వహణపై మొత్తం అధ్యాయాలు కూడా తొలగించ బడ్డాయి. 19వ శతాబ్దంలో విద్యుత్ మరియు అయస్కాంతత్వంపై అవగాహనకు మైకేల్ ఫెరడే చేసిన కృషి ఒక చిన్న విభాగం కూడా తరగతి-10 సిలబస్ నుండి తొలగించబడింది. నాన్-సైన్స్ కంటెంట్‌లో, ప్రజాస్వామ్యం, వైవిధ్యంపై అధ్యాయాలు, రాజకీయ పార్టీలు, ప్రజాస్వామ్యానికి సవాళ్లు తొలగించబడ్డాయి. అలాగే పారిశ్రామిక విప్లవంపై ఒక అధ్యాయం తొలగించబడింది.

పాఠశాల పాఠ్యపుస్తకాల నుంచి ఆవర్తన పట్టిక, పరిణామం తొలగించబడితే, అనేక సంభావ్య పరిణామాలు ఉండవచ్చు. ఆవర్తన పట్టికను తీసివేయడం వలన విద్యార్థులు మూలకాల సంస్థ లక్షణాలను అర్థం చేసుకునే ప్రాథమిక సాధనాన్ని కోల్పోతారు. ఇది రసాయన శాస్త్రం సంబంధిత శాస్త్రీయ రంగాలపై వారి అవగాహనకు ఆటంకం కలిగిస్తుంది.



జీవశాస్త్రంలో పరిణామం అనేది ఒక పునాది భావన, జీవితం వైవిధ్యం పరస్పర అనుసంధానాన్ని అర్థం చేసుకోవడానికి ఫ్రేమ్‌వర్క్‌ను అందిస్తుంది. పాఠ్యపుస్తకాల నుంచి ఆవర్తన పట్టిక పరిణామాన్ని తీసివేయడం వల్ల గణనీయమైన వివాదాలు బహిరంగ చర్చలు జరిగే అవకాశం ఉంది. పరిణామం సృష్టి కథల మధ్య సంబంధం ఒకరి దృక్పథం వ్యాఖ్యానాన్ని బట్టి మారవచ్చు. కొన్ని మతపరమైన సృష్టి కథలు, పరిణామం, శాస్త్రీయ సిద్ధాంతానికి విరుద్ధంగా ఉండవచ్చు, అన్ని మత వ్యక్తులు లేదా మతపరమైన సంప్రదాయాలు వారి సృష్టి కథలు ఖచ్చితంగా అక్షరార్థం లేదా చారిత్రక కోణంలో అర్థం చేసుకోలేదని గుర్తించడం ముఖ్యం. మత గ్రంథాలు విశ్వం స్వభావం దానిలో మానవత్వం స్థానం గురించి లోతైన సత్యాలను తెలియజేసే సంకేత లేదా రూపక కథనాలను కలిగి ఉన్నాయనే ఆలోచనను చాలా మంది ప్రజలు స్వీకరిస్తారు. పరిణామ సిద్ధాంతం భూమిపై జీవ వైవిధ్యానికి బాగా మద్దతునిచ్చే వివరణగా శాస్త్రీయ సమాజంలో విస్తృతంగా ఆమోదించబడిందని గమ నించాలి. పురాజీవ శాస్త్రం, జన్యు శాస్త్రం తులనాత్మక అనాటమీ తో సహా వివిధ శాస్త్రీయ రంగాల నుండి విస్తృతమైన అను భావిక ఆధారాలతో దీనికి మద్దతు ఉంది. సహజ ఎంపిక జన్యు వైవిధ్యం ద్వారా కాలక్రమేణా జాతులు క్రమంగా ఎలా మారతాయో వైవిధ్యభరితంగా ఎలా మారతాయో పరిణామ సిద్ధాంతం వివరిస్తుంది. అయినప్పటికీ, అనేక మతపరమైన వ్యక్తులు సమూహాలు పరిణామం వారి మత విశ్వాసాలతో సహా శాస్త్రీయ అవగాహన రెండింటినీ స్వీకరించడం గమనించ దగ్గ విషయం. వారు సైన్స్ లేదా మతాన్ని వాస్తవికత విభిన్న అంశాలను అర్థం చేసుకోవడానికి అనుకూలమైన మార్గాలుగా చూస్తారు. ఈ వ్యక్తుల కోసం, సృష్టి కథలు సాహిత్యపరమైన చారిత్రక ఖాతాల కంటే లోతైన ఆధ్యాత్మిక లేదా తాత్విక సత్యాల యొక్క ప్రతీకాత్మక లేదా రూపక వ్యక్తీకరణలుగా చూడవచ్చు. విభిన్న దృక్కో ణాలను గౌరవించడం శాస్త్రీయ మతపరమైన సంఘాల మధ్య అవగాహన అలాగే పరస్పర గౌరవాన్ని పెంపొందించే సంభాషణలో పాల్గొనడం చాలా అవసరం. అనేక మతపరమైన సంప్రదాయాలు తమ విశ్వాసాలను శాస్త్రీయ ఆవిష్కరణలతో పునరుద్ధరించటానికి మార్గాలను కనుగొన్నాయి, విశ్వాసం, సహజ ప్రపంచం దాని ప్రక్రియల పట్ల ప్రశంసలు రెండింటికీ చోటు కల్పిస్తాయి.

సైన్స్ అధ్యాపకులు ముఖ్యంగా పరిణామం తొలగింపు గురించి ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా 14-15 సంవత్సరాల వయస్సు గల 9వ తరగతి విద్యార్థులకు సిలబస్ నుంచి జీవులలో వైవిధ్యం ఒక అధ్యాయం, 'మనం ఎందుకు అనారోగ్యం పాలవుతాం' అనే అధ్యాయం తొలగించబడింది. పరిణామానికి డార్విన్ చేసిన కృషి, శిలాజాలు ఎలా ఏర్పడతాయి మానవ పరిణామం అన్నీ 10వ తరగతి విద్యార్థులకు వార సత్వం పరిణామం అనే అధ్యాయం నుండి తొలగించ బడ్డాయి. భారతదేశంలో, ప్రతి విద్యార్థికి సైన్స్ బోధించే చివరి సంవత్సరం 10వ తరగతి. చివరి రెండు సంవత్సరాల విద్యలో (విశ్వవిద్యాలయం ముందు) జీవశాస్త్రం అధ్యయనం చేయడానికి ఎంచుకున్న విద్యార్థులు మాత్రమే టాపిక్ గురించి నేర్చుకుంటారు. పాఠ్యాంశాల సవరణ ప్రక్రియలో పారదర్శకత లోపించిందని నిపుణులు చెబుతున్నారు. కానీ పరిణామం విషయంలో, "భారతదేశంలోని మరిన్ని మత సమూహాలు పరిణామ వ్యతిరేక వైఖరిని తీసుకోవడం ప్రారంభించారు". 4,500 కంటే ఎక్కువ మంది శాస్త్రవేత్తలు, ఉపాధ్యా యులు, సైన్స్ ప్రచార సంస్థలు, పౌర సంస్థలు, సైన్స్ కమ్యూనికేటర్లు తొలగించిన పాఠ్యాంశాలను పునరుద్ధరించ డానికి అప్పీల్‌పై సంతకం చేశారు.

- డాక్టర్ ముచ్చుకోట సురేష్‌బాబు

విద్యారంగంపై చిత్తశుద్ధేది?



ప్రభుత్వ పాఠశాలలు రాష్ట్రంలో ఈ సంవత్సరం కూడా సమస్యలతోనే స్వాగతం పలికాయి. కేజీ టూ పీజీ కోసం ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్టు చెబుతున్నా క్షేత్రస్థాయి అమలులో అనేక లోపాలు విద్యార్థులు, తల్లిదండ్రులను వేధిస్తూనే ఉన్నాయి. ఈ పోటీ ప్రపంచంలో నిలదొక్కు కోవాలంటే విజ్ఞానమే సరైన మార్గం. కానీ ఆ విద్యను సర్కార్ అరకొర వసతుల మధ్య నెట్టుకురావడం ఆందోళన కలిగించే అంశం. విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నామని చెబుతున్న సర్కార్ అమలులో చిత్తశుద్ధి కొరవడింది. రాష్ట్ర వ్యాప్తంగా 26,065 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో చదువుతున్న విద్యార్థుల సంఖ్య సుమారుగా 28లక్షల మంది ఉన్నారు. వీరికి లక్ష వరకు టీచర్స్ భోదిస్తున్నారు. కానీ ఇంకా 28,511 ఖాళీగా ఉన్న పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయలేదు. అసెంబ్లీలో 5,571మంది టీచర్ పోస్టులు మంజూరు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు కనీసం ఉత్తర్వులు కూడా జారీ చేయలేదు. ఖాళీగా ఉన్న పోస్టులు స్కూల్ అసిస్టెంట్ 7,111, ఎస్జీటీ 6,975 పోస్టులు , పీజీటీ 99, సంస్కృతంలో 23 పోస్టులు, ఆర్ట్ డ్రాయి ంగ్‌లో 331, క్రాఫ్ట్ ఇన్‌స్పెక్టర్ 443, ఎంఈఓ 484 పోస్టులకు గాను 467 పోస్టులు ఖాళీగా ఉన్నాయి, ప్రధానోపా ధ్యాయులు 2043 ఖాళీ, డిప్యూటీఈఓ 62 పోస్టులుకుగాను, 58 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అదనపు పోస్టులు రిటైర్మెంట్, ప్రమోషన్లు, బదిలీల కారణంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకుండానే విద్యాసంవత్సరం ప్రారంభమైంది. ఇంగ్లీష్ మీడియం విద్యను కూడా బోధించడం కోసం టీచర్లు మరింత అవసరం. నాణ్యమైన విద్య అందిం చాలంటే, అందరికీ ఇంగ్లీషులో బోధన చేయాలన్న రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకుండా, ప్రభుత్వ బడులును బాగుపరచడం కష్టతరం.



తాటికొండ రవి
9177302248

రాష్ట్రవ్యాప్తంగా 8,980 ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు మూత్రశాలలు లేవని ప్రభుత్వ నివేదికలు చెబుతున్నాయి. విద్యహక్కు చట్టం ప్రకారం ప్రతి స్కూల్లో బాలబాలికలకు వేరువేరుగా మరుగుదొడ్లు మూత్రశాలలు ఉండాలని నిబంధనలు ఉన్న, ఎక్కడ కూడా అమలు జరగడం లేదు. బాలికలకు టాయిలెట్స్ లేని రాష్ట్రాలతో పోల్చడంలో మన రాష్ట్రం రెండవ స్థానంలో ఉంది. తరగతి గదులు అధ్వాన్నంగా ఉన్నాయి. తలుపులు, కిటికీలు లేని గదులు, కంపు కొడుతున్న మరుగుదొడ్లు, నీటి వసతులు లేని టాయిలెట్లు, పైపెచ్చులుడుతున్న పాత భవనాలు, నెర్ర లిచ్చిన గోడల మధ్య విద్యాభ్యాసం కొనసాగుతుండటం బాధాకరం. శిథిలావస్థకు చేరుకున్న సర్కారు బడులను మరమ్మతులు చేయకుండానే తరగతులను నిర్వహిస్తున్నారు. దీంతో కొంతమంది ప్రయివేటు స్కూళ్లను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారు. మరికొంతమంది చదవు కొనుక్కోలేక, సర్కార్ బడుల్లో చదవలేక డ్రాపౌట్స్‌గా మారుతున్నారు. పైగా ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థుల హాజరు శాతం ఎక్కువగా ఉందని చూపడానికి అధికారులు నానాయాతన పడుతున్నారు. దీనికి జిల్లా విద్యాధికారులే తప్పుడు ప్రకటనలు, ప్రచారాలు చేయడం ఎంతవరకు సమంజసం? నిన్నటి పత్రికలు పరిశీలిస్తే సిద్దిపేట జిల్లా డీఈవో మొత్తం ప్రభుత్వ పాఠశాలలో 6వేల మంది విద్యార్థులు అడ్మిషన్ అయ్యారని చెప్పారు. కానీ వాస్తవాలను పరిశీలిస్తే వెయ్యి మంది కూడా అడ్మిషన్ కాలేదని సమాచారం. ఇలా తప్పుడు సంకేతాలు ఇవ్వడం వల్ల ప్రభుత్వ పాఠశాలలు మరింత నిర్వీర్యమయ్యే అవకాశం ఉంది.

పాఠశాలల ప్రారంభంలోనే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్స్, టై, బెల్ట్ ఇవ్వాలని అధికారులు ఆదేశాలను జారీ చేసిన విషయం తెలిసిందే. కానీ నేడు పరిస్థితి ఏమిటి? విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ విషయంలో ఇంకా గందరగోళం నెలకొని ఉంది. యూనిఫామ్స్ కుట్టుపని ఇంకా పూర్తి కానేలేదు. కనీసం 50శాతం కూడా ప్రింట్ కాలేదు, కానీ పూర్తిగా ప్రింట్ అయినవి అన్ని జిల్లాలకు పంపించామని అధికారులు చెబుతున్నారు. అనేక సంవత్సరాలుగా వస్తున్న పరిస్థితి ఈ విద్యా సంవత్సరంలో కూడా అదే తరహాలో ఉంది. కనీసం రెండు జతల దుస్తులు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందంటే ఆలోచించాల్సిన పరిస్థితి. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విద్యార్థులు పాత దుస్తుల్నే ఇస్త్రీ చేసుకుని వస్తున్నారు. ఇంకా 'మన ఊరు మన బడి' పథకం కూడా నత్తనడకనే కొనసాగుతున్నది. ఈ పథకం ద్వారా ప్రధానంగా మౌలిక వసతులు కల్పన, డిజిటల్ విద్య, తాగునీరు, సరిపడా ఫర్నిచర్, ప్రహరీలు, కిచెన్‌షెడ్‌లు, మరుగుదొడ్లు, మూత్రశాలలో ఇలా 12రకాల పనులు పూర్తి చేస్తామని చెప్పిన ప్రభుత్వం నోటి మాటలు నీటిమూటలుగానే ఉన్నాయి. 26,065 పాఠశాలలో రూ.7,289 కోట్లతో సౌకర్యాలను మెరుగుపరచాలని లక్ష్యంగా పెట్టుకుంది. శిథిలావస్థలో ఉన్న వాటి స్థానంలో కొత్త భవనాలు నిర్మాణం చేయాలని, మొదటి విడతగా 9,123 పాఠశాలను ఎంపిక చేసింది. ఇందులో రూ.3,497 కోట్లు మౌలిక సదుపాయాల కోసమే అన్నారు. ఫిబ్రవరిలోనే వీటిలో చాలా పాఠశాలల్లో పనులు పూర్తయినవి అని సంబరాలు జరుపుతు న్నామని చెప్పుకొచ్చారు. కానీ సగమే పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమైనా నేటికీ పనులు పూర్తికాలేని పరిస్థితి. అంగు ఆర్భాటాల కోసం లక్షల కోట్ల రూపా యలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం, విద్యా వ్యవస్థను అభివృద్ధి చేయడం కోసం ఎందుకు ఖర్చు చేయడం లేదో నేటికీ అర్థం కాని ప్రశ్నే. ■

సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించాలి

బొగ్గు గనుల ఉద్యోగుల 11వ వేతన సవరణ జాతీయ కార్మిక సంఘాల నాయకుల అద్వితమైన కృషితో దేశంలోని ఏ పరిశ్రమ రంగంలోని 19 శాతం వద్ధితో సాధించారు. కేంద్రం కోలిండియా యాజమాన్యం పదేండ్ల వేతన ఒప్పందం ఉంటుందని దీనికి కట్టు బడితేనే ముందుకు సాగుతుందని చెప్పినా వినకుండా కార్మిక సంఘాలు పట్టుబట్టి ఐదేళ్ల కాలానికి వేతన ఒప్పం దం చేయడం గమనార్హం. ఇది కార్మిక సంఘాల నాయకుల ఐక్య పోరాటంతో సాధ్యమైందని తెలుపుటలో ఎలాంటి సందేహం లేదు. సమయస్ఫూర్తితో వేతన సవరణ ఒప్పందం చేసినందులకు కార్మిక సంఘాల నాయకులకు విప్లవాభి వందనాలు. ఈ సంఘాల నాయకులందరూ దాదాపు దేశంలోని బొగ్గు గనులలో ఉద్యోగ విరమణ చేసిన వారే. కానీ వీరు బొగ్గు గని రిటైర్ ఉద్యోగుల సమస్యల ను పట్టించుకోకపోవడం బాధాకరం. సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించాలని సింగరేణి కార్మిక సంఘాల నాయకులను అనేక అనేక సందర్భాలలో వేడుకున్నా పట్టించుకోవడంలేదు. రిటైర్డ్ ఉద్యోగుల వైద్య, ఆరోగ్య సౌకర్యాలు గురించి వీరికి తెలియని విషయం కాదు. సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత వైద్య సౌకర్యాలు కోలిండియా ఒప్పందంతో ముడివడి ఉంటాయని ఈ నాయకులు చెబుతుంటారు. కానీ ఇదే యూనియన్ నాయకులు వీరు సింగరేణిలో గుర్తింపు సంఘంగా ఎన్నికైనప్పుడు కోల్ ఇండియాలో లేని ఎన్నో సౌకర్యాలు, ఆర్థిక ప్రయోజనాలు, ప్రమోషన్స్ సింగరేణి యాజమాన్యంతో ఒప్పందం చేసుకొని ఉద్యోగులకు కల్పించామని అవకాశమొచ్చిన ప్రతిసారి చెబుతుంటారు. సింగరేణి సంస్థ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం తమ నిధులనుండి వివిధ పథకాల పేరుతో అనేక కార్యక్రమాలకు పైసలను అవసరమైన చోట వెచ్చిస్తున్నది. కానీ ఈ లాభాలకు మూలస్తంభాలైన తమ చెమట రక్తాన్ని సింగరేణి సంస్థ తమ కుటుంబంగా భావించి యవ్వన జీవితాన్ని ధారబోసి ప్రస్తుతం చేవలేని అచేతన పరిస్థితుల్లో ఉన్న రిటైర్డ్ ఉద్యోగులను వైద్యపరంగా ఆదుకొనుటకు దయ చూపడంలేదు. సింగరేణి యాజమాన్యానికి, రాష్ట్ర ప్రభుత్వానికి అనేకసార్లు వినతి పత్రాలు సమర్పించిన ఫలితం దక్కడం లేదు. కేంద్రంలో అధికార భారతీయ జనతా పార్టీ ప్రభుత్వ అనుబంధ సంస్థ అయిన బిఎంఎస్ కూడా రిటైర్డ్ బొగ్గు గనుల ఉద్యోగుల పెన్షన్ గురించి గానీ, సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల ఉచిత వైద్య సౌకర్యాల గురించి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. తరచుగా ఈ సంఘం జాతీయ నాయకులు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని, బొగ్గు కార్యదర్శిని కలుస్తున్నట్లు పత్రికలలో చూస్తుం టాం కానీ అత్యల్ప పెరుగుదల లేని పెన్షన్ గురించి వైద్య సౌకర్యాల గురించి చర్చించకపోవడం శోచనీయం. ఇప్పటికైనా సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల బాధలు పట్టించుకోని వారికి మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉన్నది.

-దండంరాజు రాంచందర్‌రావు, సెల్:9849592958

కేరళలో పెట్టుబడులకు సహకరించండి

- యూఎస్‌లో భారత రాయబారితో విజయన్ భేటీ



న్యూయార్క్ : కేరళలో మరిన్ని పెట్టుబడులు తీసుకొచ్చేందుకు దౌత్యపరంగా సహకరించాలని అమెరికాలోని భారత రాయబారి తరన్ జిత్ సింగ్ సంధును ముఖ్యమంత్రి పినరయి విజయన్ కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. అమెరికా పర్యటనలో భాగంగా భారత రాయబార కార్యాలయానికి వెళ్లి తరన్ జిత్‌తో విజయన్ భేటీ అయ్యారు. రక్షణ, అంతరిక్ష రంగాల్లో పెట్టుబడులకు అవకాశముందని ఈ సందర్భంగా తరన్ జిత్ పేర్కొన్నారు. అలాగే ఫార్మా స్యూటికల్స్, టీకాల రంగంలోనూ అవకాశాలున్నాయని, ఈ దిశగా తాము సహకరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కాగా ఆరోగ్య కార్యకర్తలను అమెరికాకు పంపడం, నర్సింగ్ విద్యను విస్తరింపజేయడం, ఈ దిశగా అమెరికా వైద్య విద్య సంస్థలతో కలిసి పనిచేసేందుకు ఉన్న అవకాశాలపైనా ఇరువురు చర్చించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. పర్యాటక రంగం, మెడికల్ టూరిజం, అయుర్వేదం వంటి రంగాల్లోనూ ద్వైపాక్షిక సహకారానికి ఉన్న అవకాశాలపై సమాలోచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కేరళ ఆర్థిక మంత్రి కె బాలగోపాలన్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి డాక్టర్ విపి జాయ్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆ పేపర్లను తొలగించవద్దు

ఢిల్లీ వర్సిటీ వీసీకి ఆర్థిక అధ్యాపకుల వినతి

న్యూఢిల్లీ : జాతీయ విద్యా విధానంలో భాగంగా మూడు ఐచ్ఛిక పేపర్లను తొలగిం చాలన్న ప్రతిపాదనను ఉపసంహరించు కోవాలని ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన ఆర్థిక శాస్త్ర ఉపాధ్యాయులు వైస్ ఛాన్సలర్ యోగేష్ సింగ్‌ను కోరారు. 'ఆర్థిక వ్యవస్థ -దేశం-సమాజం', ఉత్పత్తి సంబంధాలు -ప్రపంచీకరణ', 'వివక్షకు సంబంధించిన ఆర్థిక శాస్త్రం' పేరిట ఉన్న ఐచ్ఛిక పేపర్లను తొలగించాలని గత నెల 26న జరిగిన యూనివర్సిటీ విద్యా మండలి సమావేశం ప్రతిపాదించింది.

అయితే ఈ ప్రతిపాదన అసమగ్రంగా ఉన్నదని, ఈ పేపర్లను గత 40 సంవత్సరాలుగా బోధిస్తున్నామని అధ్యా పకులు తెలిపారు. ఈ పేపర్లు సమకాలీన ప్రపంచం గురించి విద్యార్థులకు లోతైన అవ గాహన కలిగిస్తున్నాయని కిరోరీమాల్ కళా శాల అసోసియేట్ ప్రొఫెసర్ సౌమ్యజిత్ భట్టాచార్య చెప్పారు. ఈ పేపర్లు విద్యార్థు లలో ఎంతగానో ప్రాచుర్యం పొందాయి. వీటి ద్వారా కార్ల్ మార్క్స్ నుండి జోసెఫ్ అలోయిస్ వరకూ ఎందరో ప్రముఖుల సిద్ధాంతాలను గురించి విద్యార్థులు తెలుసుకుంటున్నారు. విద్యార్థులకు ఫోర్డ్ కార్ల గురించి బోధిస్తున్నామని, అలాంటప్పుడు ప్రముఖుల సిద్ధాంతాలను గురించి చెబితే తప్పేముం దని భట్టాచార్య ప్రశ్నించారు. ఈ పేపర్లను ప్రైవేటు, విదేశీ యూనివర్సిటీలలో కూడా బోధిస్తున్నారని భట్టాచార్య చెప్పారు. ఉపయోగకరమైన చర్చలు జరగకుండా నివారిస్తే విద్యార్థులు క్రమశిక్షణతో ఎలా ప్రవర్తిస్తారని ఆయన ప్రశ్నించారు.

పలు జిల్లాలకు వేడిగాలుల హెచ్చరిక

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వచ్చే రెండు రోజులకు సంబంధించి పలు జిల్లాల్లో వేడిగాల్పులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆ జాబితాలో నల్లగొండ, ఖమ్మం, ఆదిలాబాద్, ములుగు, కొమరంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, భూపాలపల్లి, వరంగల్, హన్మకొండ జిల్లాలున్నాయి. అదే సమయంలో రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే సూచనలున్నాయని తెలిపింది.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

భావ ప్రకటనా స్వేచ్ఛకు విఘాతం

- మోడీ ప్రభుత్వ బెదిరింపులపై ప్రజాస్వామ్యవాదుల ఆందోళన
- రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్న డార్సే వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : రైతుల ఆందోళనకు సంబంధించిన కొన్ని ట్వీట్లను తొలగించని పక్షంలో ట్విట్టర్‌పై నిషేధం విధిస్తామని, ఉద్యోగుల నివాసాలపై దాడులు చేస్తామని నరేంద్ర మోడీ ప్రభుత్వం బెదిరించిందంటూ ఆ సంస్థ మాజీ సీఈఓ జాక్ డార్సే చేసిన వ్యాఖ్యలు దేశంలో రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. మోడీ ప్రభుత్వ వైఖరిని ప్రజాస్వామ్య వాదులంతా ముక్తకంఠంతో నిరసిస్తున్నారు. మరోవైపు డార్సే ప్రకటనను ప్రభుత్వం తోసిపుచ్చగా పలువురు బీజేపీ నేతలు దీనిని అంతర్జాతీయ కుట్రగా అభివర్ణించారు. అయితే ట్విట్టర్ వ్యవస్థాపకుడికి అబద్ధాలు చెప్పాల్సిన అవసరమేమిటన్న ప్రశ్న ఉదయిస్తోంది. భావ ప్రకటనా స్వేచ్ఛను హరించేందుకు, ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు మోడీ ప్రభుత్వం తనకున్న అధికారాలను దుర్వినియోగం చేయడాన్ని గమనిస్తే భారత ప్రజాస్వామ్యం పెను ప్రమాదంలో పడిందన్న విషయం అర్థమవుతోంది.

దేశంలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే భావ ప్రకటనా స్వేచ్ఛ అవసరం ఎంతైనా ఉంది. అది ప్రజలకు ప్రజాస్వామ్యం అందించిన పవిత్రమైన హక్కు. ప్రభుత్వం జవాబుదారీతనంతో వ్యవహరించేలా చూడడానికి ఇది అంకుశంలా ఉపకరిస్తుంది. తమ భావాలను వ్యక్తపరచేందుకు పౌరులకు మరింత స్వేచ్ఛ అందించి, వారికి సాధికారత కల్పిస్తుంది. వారిని ఆలోచనాపరులుగా తీర్చిదిద్ది, సమస్యలపై గళం విప్పేలా చేస్తుంది. అమెరికా రాజ్యాంగంలో భావ ప్రకటనా స్వేచ్ఛకు, ప్రజాస్వామ్యానికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు. ఈ రెండింటికీ అవినాభావ సంబంధం ఉంది. భారత రాజ్యాంగంలోని 19వ అధికరణలో కూడా భావ ప్రకటనా స్వేచ్ఛకు రక్షణ కల్పించారు.

హక్కును అణచివేస్తున్నారు

అయితే డార్సే చెప్పిన మాటలను పరిశీలించినా, చాలా మందికి గతంలో ఎదురైన చేదు అనుభవాలను అవలోకనం చేసుకున్నా మోడీ ప్రభుత్వం ఈ స్వేచ్ఛను ఏకపక్షంగా, ఎలాంటి సమర్థనీయమైన హేతుబద్ధత లేకుండా అణచివేస్తోందో అర్థమవుతుంది. ప్రజల మధ్య నిర్భయంగా చర్చ జరగడానికి అవకాశం కల్పించే అత్యంత ప్రాచుర్యం పొందిన వేదికగా ట్విట్టర్ కొనసాగుతున్న కాలమిది. ఈ వేదిక పైన ప్రభుత్వానికి వ్యతిరేకంగా అభిప్రాయాలు చెప్పకుండా నిరోధించడమంటే ఆర్టికల్ 19ని ఉల్లంఘించడమే తప్ప మరొకటి కాదు. భావ ప్రకటనా స్వేచ్ఛ హక్కును నిర్భీతితో వినియోగించుకునేందుకు అవకాశం ఇవ్వకుండా దేశ పౌరులను అడ్డుకోవడాన్ని చూస్తుంటే ప్రభుత్వంలో నిరంకుశత్వం రోజురోజుకూ ఎలా పెరిగిపోతోందో తెలిసిపోతుంది.

ప్రభుత్వం తనకు చట్టప్రకారం సంక్రమించిన అధికారాన్ని సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం ఎలా దుర్వినియోగం చేస్తోందో డార్సే చెప్పిన మాటలను బట్టి అర్థమవుతోంది. ఈ ప్రభుత్వం చట్టాలను రూపొందించి, వాటిని అమలు చేసేది ప్రజల కోసం కాదు. ప్రజలను అణచివేసేందుకు, వారి గొంతు నొక్కేందుకు మాత్రమే చట్టాలను ప్రయోగిస్తోంది.

నేరగాళ్ల ముఠా తరహాలో...

భావ ప్రకటనా స్వేచ్ఛను హరించే విషయంలో ప్రభుత్వ స్పందనను నేరచరితుల ముఠాతో పోల్చవచ్చు. ఎలాగంటే ఈ ముఠా బలవంతంగా అధికారాలను ఉపయోగించుకొని, ప్రజలను బ్లాక్‌మెయిల్ చేసి, వారు మౌనాన్ని ఆశ్రయించేలా చేస్తుంది. భావ ప్రకటనా స్వేచ్ఛను ఉల్లంఘిస్తున్న ప్రభుత్వాలతో అనుభవాలను గురించి చెప్పమని డార్సేను అడిగినపుడు ఆయన నోటి నుండి వచ్చిన మొట్టమొదటి దేశం పేరు భారతదేశమే. మన దేశం ప్రజాస్వామ్యానికి తల్లి లాంటిదని బీజేపీ చెప్పుకుంటూ ఉంటుంది. అయితే అది భావ ప్రకటనా స్వేచ్ఛను ఎలా అణచివేస్తోందో ప్రపంచానికి ఇంకా తెలియదు. దేశంలో రాజకీయ స్వేచ్ఛ కూడా అణచివేతకు గురవుతోందన్న చేదునిజం డార్సే మాటల ద్వారా సభ్య ప్రపంచానికి తెలిసిపోయింది. రాజకీయ సమీకరణ కోసం తమకున్న రాజ్యాంగపరమైన హక్కులను ఉపయోగించుకుంటున్న రైతుల ఆందోళనను పట్టించుకోవద్దంటూ ట్విట్టర్‌ను ప్రభుత్వం బెదిరించింది. దీంతో ప్రభుత్వాన్ని విమర్శించే వారి గొంతుకలు ప్రజలకు వినిపించలేదు. వారు కూడా తమ అభిప్రాయాలు సామాజిక మాధ్యమంలో పంచుకోలేకపోయారు. భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడి అంటే ప్రజాస్వామ్యంపై దాడే. దీనిని ప్రతిఘటించేందుకు ప్రజలు, సంస్థలు ఏకమవ్వాల్సిన ఆవశ్యకత ఉంది.

ఏం చేయాలంటే...

మన ప్రజాస్వామ్యానికి ముప్పుగా పరిణమిస్తున్న ఇలాంటి చర్యలకు వెంటనే అడ్డుకట్ట వేసి, కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాజకీయంగా సున్నితమైన అంశాలను సామాజిక మాధ్యమాల నుండి ఎందుకు తొలగించాల్సి వచ్చిందో, ఈ వ్యవహారంలో ఎందుకు జోక్యం చేసుకోవాల్సి వచ్చిందో వివరిస్తూ ప్రభుత్వం ఒక పారదర్శకమైన అఫిడవిట్‌ను విడుదల చేయాల్సి ఉంది. భావ ప్రకటనా స్వేచ్ఛను, రాజకీయ సమీకరణను అణచివేసేందుకు అవలంబించిన ఈ ప్రమాదకరమైన ధోరణిపై పరిశీలన జరపడానికి సంయుక్త పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేయాలి. సామాజిక మాధ్యమాలలో భావ ప్రకటనా స్వేచ్ఛకు రక్షణ కల్పించేందుకు చేపట్టాల్సిన చర్యలను ఈ కమిటీ తెలియజేయాలి. ప్రభుత్వ వివక్షాపూరిత వైఖరులకు అడ్డుకట్ట వేసేందుకు అవసరమైన చట్ట సవరణను కూడా ఈ కమిటీ సూచించాల్సి ఉంటుంది. ప్రభుత్వం సామాజిక మాధ్యమాలపై ఆంక్షలు విధించాలని అనుకుంటే అమెరికాలో మాదిరిగా ముందుగా దానిని దిగువ కోర్టు అంగీకరించాలి. దీనివల్ల ప్రభుత్వ ఆగడాలకు కళ్లెం వేయవచ్చు. డార్సే ఆరోపించిన విధంగా ప్రభుత్వ బెదిరింపులు రాజ్యాంగంలోని 19వ అధికరణకు భంగకరంగా ఉన్నందున అలాంటి చర్యలను సుప్రీంకోర్టు పరిశీలించాల్సిన అవసరం ఉంది. అధికార దుర్వినియోగం జరగకుండా భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడేందుకు అత్యున్నత న్యాయస్థానం మార్గదర్శకాలు విడుదల చేయాలి.



మెరుగైన పాలన కోసం కేరళ ప్రభుత్వ మెగా ఔట్ రీచ్

షెడ్యూల్ ప్రకటించిన మంత్రివర్గం

తిరువనంతపురం : పాలనను మరింత మెరుగుపరిచేందుకు, ప్రజల వద్దకు పాలనను తీసుకెళ్ళేందుకు గానూ కేరళ ప్రభుత్వం మెగా పబ్లిక్ ఔట్‌రీచ్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు కేరళ ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. అభివృద్ధి క్రమాన్ని మరింత వేగిరపరిచేందుకు, జిల్లా స్థాయిలో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఆయన మంత్రివర్గ సహచరులు ప్రత్యక్షంగా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. సెప్టెంబరు 4, 7, 11, 14 తేదీల్లో మంత్రివర్గం అధ్యక్షతన కొజికోడ్, త్రిస్సూర్, ఎర్నాకులం, తిరువనంతపురంలలో జోనల్ సమావేశాలు జరుగుతాయి. ఆయా తేదీల్లో స్థానిక శాంతి భద్రతల విభాగ అధికారులతో జరిగే సమావేశానికి ముఖ్యమంత్రి విజయన్ అధ్యక్షత వహిస్తారు. జిల్లా స్థాయిలో అత్యంత తీవ్రంగా వున్న సమస్యలన్నింటినీ జూన్ 20నాటికల్లా సేకరించాల్సిందిగా జిల్లా కలెక్టర్లను కేబినెట్ కోరింది. జోనల్ సమావేశాల్లో వాటిని ప్రవేశపెడతారు. మౌలిక ప్రాతిపదిక సౌకర్యాల అభివృద్ధి ప్రాజెక్టులను కేబినెట్ సమీక్షిస్తుంది. సంక్షేమ పెన్షన్ల పంపిణీపై విశ్లేషణ జరుపుతుంది.

జిల్లా స్థాయిలో సంక్షేమ కార్యక్రమాల పనితీరును సమీక్షిస్తుంది. కేంద్ర పథకాల పురోగతిని కూడా మంత్రిత్వ స్థాయి ప్రతినిధి వర్గం సమీక్షించి, వేగంగా అమలు చేయడానికి అడ్డంకులేమైనా వుంటే వాటిని తొలగిస్తుంది. జాతీయ హైవేల అభివృద్ధి, హై రేంజ్ హైవేలు, తీరప్రాంత హైవేలు, జాతీయ జల మార్గాలు, బైపాస్‌లు, రింగ్ రోడ్లు, ఒవర్‌బ్రిడ్జిలు వీటిల్లో వున్నాయి. ప్రజారోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రులు, అంగన్‌వాడీలు, సివిల్ స్టేషన్లు, ప్రభుత్వ పాఠశాలల్లో సిబ్బంది సమస్యలను పరిష్కరించడానికి, మరిన్ని మౌలిక సదుపాయాలను అందచేయాల్సిన అవసరం గురించి కూడా కేబినెట్ చర్చిస్తుంది. లైఫ్ మిషన్ ప్రాజెక్టుల పురోగతిని, వాటి నిర్వహణను మంత్రిత్వ స్థాయి సమావేశం సమీక్షిస్తుంది.

సమస్యలను మూడు గ్రూపులుగా జోనల్ సమావేశాలు వర్గీకరిస్తాయి, మంత్రిత్వ స్థాయిలో పరిష్కరించగలిగేవి, జిల్లా స్థాయిలో పరిష్కరించగలిగేవి, ఈ రెండు కేటగిరీల్లోకి రానివి మూడో కేటగిరీగా వర్గీకరిస్తారు. జోనల్ సమావేశాలకు ముందుగానే సమస్యలను గుర్తించి, వాటి పరిష్కరించేందుకు గానూ వివిధ విభాగాల ప్రధాన కార్యదర్శులు కలెక్టర్లతో అనుసంధానమవుతారు. జోనల్ సమావేశాల్లో మంత్రులకు చీఫ్ సెక్రటరీ, ప్రిన్సిపల్ కార్యదర్శులు సాయపడతారు. నిర్ణయం జరిగిన 48గంటల్లోగా అవసరమైన ఆదేశాలను ప్రభుత్వం జారీ చేస్తుంది.

సీపీఐ నేతలతో కేజ్రీవాల్ భేటీ

న్యూఢిల్లీ: ప్రజా ప్రభుత్వ అధికారాలను హరించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌పై న్యాయ పోరాటానికి ఆమాద్మీ పార్టీ (ఆప్) మద్దతు సమీకరిస్తోంది. ఈ క్రమంలో బుధవారం నాడు సీపీఐ నేతలతో ఢిల్లీ ముఖ్య మంత్రి, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సమావేశమయ్యారు. ఇందు కోసం ఢిల్లీలోని సిపిఐ ప్రధాన కార్యాల యానికి వెళ్లిన ఆయన సీపీఐ ప్రధానకార్యదర్శి డి రాజా, జాతీయ కార్యదర్శి కె నారాయణ తదితరులతో భేటీ అయ్యారు. అనంతరం ఇరు పార్టీల నేతలు సీపీఐ కార్యాలయం వెలుపల అభివాదం చేస్తూ ఫొటోలు దిగారు. ఆప్ చేస్తున్న న్యాయపోరాటానికి తమ మద్దతు ఉంటుందని ఈ సందర్భంగా డి రాజా పేర్కొన్నారు.



సమాఖ్య స్ఫూర్తిని మోడీ సర్కార్ మంటగలుపుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్దతు తెలిపిన సీపీఐ నేతలకు కేజ్రీవాల్ కృతజ్ఞతలు తెలిపారు.



నూతన పీఆర్సీని వెంటనే ఏర్పాటు చేయాలి

- పెండింగ్ డీఏలను ప్రకటించాలి
- ఉద్యోగుల సాధారణ బదిలీలు చేపట్టాలి : సీఎస్‌కు టీఎన్జీవో వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నూతన పే రివిజన్ కమిటీ (పీఆర్సీ)ని వెంటనే ఏర్పాటు చేయాలని టీఎన్జీవో కేంద్ర సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ నేతృత్వంలో బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉద్యోగుల పెండింగ్ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కోరారు. రాష్ట్రంలో జులై ఒకటో తేదీ నుంచి పీఆర్సీ అమలయ్యేలా నూతన కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని తెలిపారు. లేదంటే అదేరోజు నుంచి మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని పేర్కొన్నారు. పెండింగ్‌లో డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలని తెలిపారు. ఉద్యోగుల ఆరోగ్య బీమా పథకాన్ని పకడ్బందీగా అమలు చేయడం కోసం ఉద్యోగుల చందాతో ఈహెచ్‌ఎస్ సౌకర్యాన్ని కల్పించేలా వెంటనే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని సర్వే నెంబర్ 36,37లో గతంలో ఉద్యోగులకు కేటాయించిన స్థలాన్ని భాగ్యనగర్ టీఎన్జీవో సొసైటీకి కేటాయించడానికి ప్రభుత్వ మెమోను ఉపసంహరించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర నూతన సచివాలయంతో పాటు అన్ని జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల్లో టీఎన్జీఓకు ఆఫీసును కేటాయించాలని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు రెండేండ్లకు పదోన్నతి కల్పించాలంటూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులననుసరించి అన్ని శాఖల్లో ఆ ప్రక్రియను చేపట్టాలని సూచించారు. ఉద్యోగుల సాధారణ బదిలీలు చేపట్టాలని పేర్కొన్నారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులన్నీ వెంటనే చెల్లించాలని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు ఆంధ్రలో పనిచేస్తున్న 80 మంది క్లాస్-3 తెలంగాణ ఉద్యోగులను వెనక్కి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.

చంచల్‌గూడ జైల్లో దశాబ్ది ఉత్సవాలు

- ఖైదీల పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

జైళ్లశాఖ ఆధ్వర్యంలో తెలంగాణా రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బుధవారంనాడిక్కడి చంచల్‌గూడ జైలులో జరిగిన వేడుకల్లో రాష్ట్ర జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీల పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు, వారి కుటుంబసభ్యులకు వడ్డీలేని రుణాలను అందచేశారు. ఈ కార్యక్రమానికి హోమ్ శాఖ ముఖ్య కార్యదర్శి, జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జితేందర్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. జైళ్లలో శిక్షా ఖైదీలకు చేపట్టిన పలు సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీల పిల్లల్లో మెరిట్ సాధించిన పదవ తరగతి వారికి రూ.3వేలు, ఇంటర్ విద్యార్థులకు రూ.5వేలు, ఉన్నత చదువులు సాధించిన వారికి రూ.15 వేలు చొప్పున అందించామన్నారు. అలాగే జరిమానాలు కట్టలేక, జైల్లోనే మగ్గుతున్న ఖైదీలకు ఆ సొమ్మును చెల్లించి, బుధవారం విడుదల చేశామన్నారు. వివిధ జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు వడ్డీ లేని రుణాలు రూ. 25 వేల నుంచి రూ. 50 వేల వరకు అందిస్తున్నట్టు చెప్పారు. అలాగే మహిళా ఖైదీల పిల్లలకు న్యూట్రిషన్ కిట్లు అందిస్తున్నామన్నారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర జైళ్లలో శిక్షా ఖైదీలకు క్రీడలు, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో జైళ్ల శాఖ ఐజి వై రాజేష్, డీఐజీలు యన్ మురళీబాబు, డి శ్రీనివాస్, యం.సంపత్, పర్యవేక్షణాధికారులు సంతోష్ రాయ్, కళాసాగర్, మహిళా జైలు పర్యవేక్షణాధికారి అమరావతి, డాక్టర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

పదేండ్లలో వందేండ్ల అభివృద్ధి

- టీఎస్‌పీహెచ్‌సీ చైర్మెన్ కోలేటి దామోదర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రం పదేండ్లలో వందేండ్ల అభివృద్ధిని సాధించిందని తెలంగాణ రాష్ట్ర పోలీసు గృహ నిర్మాణ సంస్థ చైర్మెన్ కోలేటి దామోదర్ అన్నారు. పదేండ్ల విజయాలు దశాబ్ది ఉత్సవాల్లో తార్కాణాలుగా నిలుస్తాయని బుధవారంనాడొక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ మోడల్ దేశానికి అవసరమనీ, దానికోసం యావత్ దేశం ఎదురుచూస్తున్నదని తెలిపారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పాలన సాగుతున్నదని కొనియాడారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా త్వరలోనే దేశ రాజకీయాల మార్పుకు నాంది పలుకుతుందని అభిప్రాయపడ్డారు.

ఎమ్ఎమ్‌టీఎస్ రైళ్లు రద్దు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రైల్వే ట్రాక్‌ల నిర్వహణ పనుల కారణంగా ఎమ్ఎమ్‌టీఎస్ రైళ్ల సేవల్ని తాత్కాలికంగా రద్దుచేస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ తెలిపారు. లింగంపల్లి నుంచి హైదరాబాద్, హైదరాబాద్ నుంచి లింగంపల్లి రూట్‌లో రైళ్లను ఈనెల 14, 15 తేదీల్లో రద్దు చేస్తున్నామని చెప్పారు. ఉందానగర్-లింగంపల్లి-ఫలక్‌నుమా రూట్లలో ఈనెల 17వరకు సేవల్ని నిలుపుదల చేస్తున్నట్టు తెలిపారు. ప్రయాణీకులు మార్పును గమనించి, సహకరించాలి విజ్ఞప్తి చేశారు.

ఉక్రెయిన్‌కు సంఘీభావం, మరి పాలస్తీనాకు ?

- అమెరికా నయవంచనకు హ్యాట్సాఫ్

మాస్కో :రష్యాతో యుద్ధం చేస్తున్న ఉక్రెయిన్‌కు సాయమందించే విషయంలో గతంలో ఎన్నడూ లేని రీతిలో ముక్త కంఠంతో, మూకుమ్మడిగా వ్యవహరిస్తున్న పశ్చిమ దేశాలు, ఇజ్రాయిల్ అక్రమ ఆక్రమణలో వున్న పాలస్తీనాకు మద్దతుగా ఎన్నడూ కనీసం ఆందోళన కూడా చెందలేదు. ఈ దుర్మార్గమైన ధోరణికి మూలం కపటత్వమే, ఈ వ్యవహార శైలి మనకు అసహ్యాన్ని కలగచేస్తుందని రచయిత, కాలమిస్ట్ జాన్‌విట్ వ్యాఖ్యానించారు. అత్యంత ఆటవికమైన, అమానుషమైన ఇజ్రాయిల్ చర్యల గురించి అసలు వాస్తవాలేమిటో మనకు తెలియకుండా చేయడానికి మన ప్రభుత్వాలు, ప్రధాన స్రవంతిలోని మీడియా, పశ్చిమ దేశాల్లోని ప్రచారకర్తలు బాగా శ్రమిస్తారు. పాలస్తీనా ప్రజల ప్రయోజనాలు అంటే మన కాలంలోని మానవాళి ప్రయోజనాలేనని ఆయన వ్యాఖ్యానించారు. జాత్యంహంకార ధోరణితో పాలస్తీనియన్లపై నిరంతరంగా విరుచుకుపడే ఇజ్రాయిల్ దాడుల గురించి వార్తా కథనాలు ఇచ్చేటపుడు ప్రధాన స్రవంతిలోని వ్యాఖ్యాతలు పిరికి భాష ఉపయోగిస్తారు. ఈ విషయంలో పశ్చిమ దేశాల్లోని ఇజ్రాయిల్ అనుకూల లాబీ సాధించిన విజయమే ఇందుకు గుర్తు. ఇటువంటి వార్తలు ఎలా ప్రచురితమవాలి, దాని వర్ణన ఎలా వుండాలనే విషయంలో లాబీ ఇచ్చే సూచనలు, సలహాలకు తలొగ్గే వార్తలు వెలువడతాయి.

సర్కారు బడుల్లో వసతులు కల్పించాలి

కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలి : విద్యాశాఖ కార్యదర్శికి ఎస్ఎఫ్ఐ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలని కోరింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణను బుధవారం హైదరాబాద్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమించాలని కోరారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని తెలిపారు. కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ కోసం చట్టం చేయాలని, పెండింగ్‌లో ఉన్న పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలను అందించాలని కోరారు. కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో ప్రభుత్వం సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. వాటిలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని పేర్కొన్నారు. మన ఊరు - మన బడి పథకాన్ని అన్ని పాఠశాలల్లోనూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే చేపట్టిన వాటిలో పనులు చేయాలని తెలిపారు. పనులు నిలిపోయిన పాఠశాలల్లో వాటిని పునరుద్ధరించి నిధులు విడుదల చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి శంకర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె అశోక్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు జె రమేష్ పాల్గొన్నారు.

బీసీ వసతి గృహాలకు ఆన్‌లైన్‌లో ప్రవేశాలు కల్పించొద్దు

రాష్ట్రంలోని బీసీ కళాశాలల వసతి గృహాలకు ఆన్‌లైన్ పద్ధతిలో ప్రవేశాలు కల్పించే పద్ధతిని వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఈ విద్యాసంవత్సరం నుంచి బీసీ కళాశాలల వసతిగృహాల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు చేసుకోవాలంటూ ఆ శాఖ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. ఒక విద్యార్థి ఆన్‌లైన్‌లో హాస్టల్ సీటు కోసం దరఖాస్తు చేసుకున్న తర్వాత మూడు హాస్టళ్లకు ఆప్షన్లు ఇవ్వాలని తెలిపారు. ఎక్కడ సీటు వస్తే అక్కడ చేరాలన్న నిబంధన పెట్టారని పేర్కొన్నారు. దీనివల్ల విద్యార్థులు హాస్టళ్లలో చేరే పరిస్థితి ఉండబోదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్లు చేయడమంటే హాస్టళ్లను ఎత్తేయాలన్న కుట్ర చేయడమేనని విమర్శించారు. కళాశాలలో అడ్మిషన్ తీసుకున్న ప్రతి విద్యార్థికీ హాస్టల్ సీటు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అద్దె భవనాల్లో నడుస్తున్న హాస్టళ్లు, సౌకర్యాల్లేని హాస్టళ్లలో నాణ్యమైన భోజనం అందించకుండా వాటిని ఎత్తేసే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. గతంలో లాగానే హాస్టళ్లలో ప్రవేశాలు కల్పించాలని కోరారు.

డీసెట్‌లో 3,975 మంది ఉత్తీర్ణత

- ఫలితాలు విడుదల
- 72 డీఈఐఈడీ కాలేజీల్లో 4,750 సీట్లు : కన్వీనర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డీసెట్ ఫలితాల వివరాలు

	దరఖాస్తు	హాజరు	ఉత్తీర్ణత	శాతం
ఎస్సీ	1,276	977	977	100
ఎస్టీ	1,341	1,101	1,101	100
బీసీ	3,475	2,755	1,686	61.19
ఇతరులు	393	317	211	66.56
మొత్తం	6,485	5,150	3,975	77.18

రాష్ట్రంలో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఐఈడీ), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ) కోర్సుల్లో 2023-25 బ్యాచ్ ప్రవేశాల కోసం నిర్వహించిన డీసెట్-2023 రాతపరీక్ష ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఈ మేరకు డీసెట్ కన్వీనర్ ఎస్ శ్రీనివాసాచారి ఒక ప్రకటన విడుదల చేశారు. డీసెట్‌కు మొత్తం 6,485 మంది దరఖాస్తు చేస్తే, 5,150 మంది అభ్యర్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. వారిలో 3,975 (77.18 శాతం) మంది ఉత్తీర్ణత పొందారని వివరించారు. అబ్బాయిలు 1,058 మంది దరఖాస్తు చేయగా, 837 మంది పరీక్ష రాశారని తెలిపారు. వారిలో 712 (85.06 శాతం) మంది ఉత్తీర్ణత పొందారని పేర్కొన్నారు. 5,427 మంది అమ్మాయిలు దరఖాస్తు చేస్తే, 4,313 మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు.

వారిలో 3,263 (75.65 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారని వివరించారు. తెలుగు మాధ్యమానికి 2,575 మంది అభ్యర్థులు దరఖాస్తు చేస్తే, 2,043 మంది హాజరయ్యారని తెలిపారు. వారిలో 1,551 (75.91 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. తెలుగు మాధ్యమంలో 73 మార్కులు సాధించిన బాలిన మాధవరావు ప్రథమ ర్యాంకు సాధించారని వివరించారు. ఇంగ్లీష్ మీడియంకు 3,213 మంది దరఖాస్తు చేయగా, 2,495 మంది పరీక్ష రాశారని తెలిపారు. వారిలో 2,114 (84.72 శాతం) మంది ఉత్తీర్ణత పొందారని పేర్కొన్నారు. ఇందులో 73 మార్కులు సాధించిన షేక్ ముస్తాక్ పాషా అగ్రస్థానంలో నిలిచారని వివరించారు. ఉర్దూ మాధ్యమానికి 697 మంది దరఖాస్తు చేయగా, 612 మంది హాజరయ్యారని తెలిపారు. వారిలో 310 (50.65 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. ఇందులో 58 మార్కులు సాధించిన జావెరియా ఫిర్దోస్ ప్రథమ ర్యాంకు పొందారని వివరించారు. ఫలితాల కోసం www. deecet. cdse. telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. రాష్ట్రంలో 72 డీఈఐఈడీ కాలేజీల్లో 4,750 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇందులో పది ప్రభుత్వ కాలేజీల్లో తెలుగు మాధ్యమంలో 500 సీట్లు, ఉర్దూ మాధ్యమంలో 400 సీట్లు, ఇంగ్లీష్ మాధ్యమంలో 500 సీట్లు కలిపి మొత్తం 1,400 సీట్లున్నాయని వివరించారు. 62 ప్రయివేటు కాలేజీల్లో తెలుగు మాధ్యమంలో 1,750 సీట్లు, ఉర్దూ మాధ్యమంలో వంద సీట్లు, ఇంగ్లీష్ మాధ్యమంలో 1,500 సీట్లు కలిపి మొత్తం 3,350 సీట్లున్నాయని తెలిపారు.

కౌన్సిలింగ్ ఎప్పుడు?

హైదరాబాద్ వదలని నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్ -1

- ఉన్నతాధికారుల అండగా జూనియర్లపై ఒత్తిడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారు బదిలీ కావాలి. ఎక్కడి నుంచైతే డిప్యూటేషన్‌పై తిరిగి అక్కడికి వెళ్లిపోవాలి. అయినా సరే...ఏండ్ల తరబడి హైదరాబాద్ ఆస్పత్రుల్లో తిష్ట వేసుకుని కూర్చున్నారు. వారిని అక్కడి నుంచి పంపిస్తే తప్ప అర్హత కలిగిన తమకు పదోన్నతులు లభించే అవకాశం లేకపోవడంతో కిందిస్థాయిలో ఉద్యోగులు నష్టపోతున్నారు. ఇదే విషయంపై పదే పదే ఉన్నతాధికారులకు విన్నవించుకుంటున్నా ఫలితం లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంవత్సరాల తరబడి తామందించిన సేవలకు తగిన ప్రతిఫలం లభిస్తుందా? అని ఎదురుచూస్తున్నారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా, గాంధీ, నిలోఫర్ తదితర ఆస్పత్రుల్లో నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1గా విధులు నిర్వహిస్తున్న వారిలో ఎక్కువ మంది ఏండ్లతరబడి ఒకే ఆస్పత్రిలో విధులు నిర్వహి స్తున్నట్టు తెలుస్తున్నది. దీంతో ఆయా ఆస్పత్రుల్లో పట్టు సంపాదించి తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. డ్యూటీల విషయంలో సీనియర్లను, తమ వారికి సులువైన పనులు చెబుతూ జూనియర్లపై పనిభారం మోపుతున్నారని సమాచారం. తమ చెప్పుచేతల్లోకి రాని వారిని తమ అదుపులోకి తెచ్చుకునేందుకు వేధింపులకు కూడా పాల్పడుతున్నట్టు తెలుస్తున్నది. రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకుల కార్యాలయం ఈ ఏడాది ఐదున సీనియార్టీ లిస్టును విడుదల చేసింది. నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్ 2 నుంచి గ్రేడ్ 1గా పదోన్నతి పొందేందుకు అర్హత కలిగిన వారి జాబితా ఇది. ఇందులో మల్టీ జోన్-1 నుంచి ఏడుగురు, మల్టీ జోన్ -2 నుంచి 13 మంది ఉన్నారు. అయితే ఇప్పటి వరకు కౌన్సిలింగ్ తేదీలను ప్రకటించకపోవడంతో పరిస్థితిలో మార్పు రావడం లేదు. కౌన్సిలింగ్ జరిగితే మల్టీ జోన్-2లో ఎవరైతే గ్రేడ్ -1గా డిప్యూటేషన్‌పై పని చేస్తున్నారని అది రద్దయి తిరిగి మల్టీ జోన్ -1కి పంపించాల్సి ఉంటు ంది. అదే విధంగా దీర్ఘకాలంగా ఒకే చోట గ్రేడ్-1 గా కొనసాగుతున్న వారిని వేరే వైద్యశాలకు బదిలీ చేసి వేకెన్సీ జాబితా పెట్టాల్సి ఉంటుంది. ఇది ఇష్టం లేనీ, హైదరాబాద్ వదిలి వెళ్లడం ఇష్టం లేని కొంత మంది కారణంగానే కౌన్సిలింగ్ జాప్యం చేస్తున్నారనే సీనియర్టీ లిస్ట్‌లో ఉన్నవారు అనుమానం వ్యక్తమవుతున్నది. హైదరాబాద్‌లోని ఆయా ప్రభుత్వాస్పత్రుల్లో పని చేస్తున్న గ్రేడ్-1 సూపరింటెండెంట్లలో ఐదేండ్ల నుంచి 13 ఏండ్ల వరకు ఒకే చోట పని చేస్తున్న వారుండటం గమనార్హం. గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్ అంటే గెజిటెడ్ హోదా. ఈ హోదా కలిగిన వారిని ప్రతి మూడేండ్లకొకసారి స్థానచలనం చేయాల్సి ఉన్నప్ప టికీ కొంత మంది స్వార్థప్రయోజనాల కారణంగా ఒకే చోట కొనసాగిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా కౌన్సిలింగ్ నిర్వహించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.



రైతన్న విజయం

అన్నదాత ఉద్యమానికి దిగొచ్చిన హర్యానా సర్కారు


- అన్ని డిమాండ్లకూ అంగీకారం తెలిపిన ఖట్టర్ ప్రభుత్వం



చండీగఢ్ : హర్యానాలో రైతులు విజయం సాధించారు. తమ డిమాండ్ల సాధన కోసం వారు చేస్తున్న ఉద్యమానికి రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చింది. రైతులు చేసిన అన్ని డిమాండ్లకూ అక్కడి బీజేపీ సర్కారు అంగీకారం తెలిపింది. పొద్దుతిరుగుడు పంటను ఎంఎస్‌పీ పైనే తీసుకుంటామని, జైలులో ఉన్న రైతులను విడుదల చేస్తామని హామీనిచ్చింది. దీంతో రైతులు తమ ఉద్యమాన్ని విరమించారు. డిమాండ్ల సాధన కోసం హర్యానాలోని కురుక్షేత్రలో రైతులు ఆందోళన చేస్తున్నారు. జాతీయ రహదారిని దిగ్బంధించారు.

ఈ నిరసనల్లో భాగంగా రెండో రోజు రాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చింది. రైతులకు, ప్రభుత్వానికి మధ్య ఒప్పందం కుదిరింది. ఇది తమ పోరాట విజయమని రైతులు తెలిపారు. ప్రభుత్వ ప్రతినిధిగా డిప్యూటీ కమిషనర్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ.. పొద్దుతిరుగుడు పంటను కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కి (క్వింటాల్‌కు రూ. 6,400) తీసుకుంటామని ప్రకటించారు. ఇందుకోసం మండీలలో రేటు పెంచడంతో పాటు భవన్‌ల మొత్తాన్ని కూడా ప్రభుత్వం పెంచనున్నదన్నారు. జిల్లా ఎస్పీ సురేంద్ర భదౌరియా కూడా నిరసన స్థలానికి చేరుకుని జైలులో ఉన్న రైతులను అవసరమైన చర్యల తర్వాత విడుదల చేస్తామని హామీఇచ్చారు.

కేంద్రంలోని మోడీ సర్కారు వివాదాస్పద సాగుచట్టాలతో రైతుల జీవితాలతో ఆడుకున్నది. మోడీ సర్కారు నిర్ణయానికి వ్యతిరేకంగా రైతులు దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనలకు దిగారు. దీంతో కేంద్రం ఆ వివాదాస్పద సాగు చట్టాలను వెనక్కి తీసుకున్న విషయం విదితమే. ఇటు మహారాష్ట్రలోనూ రైతులు తమ డిమాండ్ల సాధన కోసం ఏఐకేఎస్ ఆధ్వర్యంలో ఇటీవల చేపట్టిన మహార్యాలీకి రాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు మరొక బీజేపీపాలిత రాష్ట్రమైన హర్యానా కూడా తన రైతు వ్యతిరేఖ ధోరణిని బయటపెట్టుకున్నది. దీంతో రాష్ట్రంలోని రైతులు ఉద్యమానికి దిగటంతో ఖట్టర్ సర్కారు మెట్టు దిగి.. వారి డిమాండ్లకు అంగీకరించిందని విశ్లేషకులు తెలిపారు. "మరోసారి రైతులు గెలుపొందారు. ప్రభుత్వం తలవంచాల్సిందే. బీజేపీ ఇటీవలి సంవత్సరాలలో తన నిర్ణయాన్ని మార్చలేమని చూపించడానికి ప్రయత్నిస్తున్నది. కానీ దేశంలోని రైతులు పదే పదే పోరాటం చేస్తున్నారు" అని వారు చెప్పారు.



ప్రభుత్వం హామీ ఇవ్వడంతో గత రెండ్రోజులుగా ఎండవేడిమితో రోడ్డుపై కూర్చున్న రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. రైతులు దీనిని మరో విజయంగా భావించారు. డిప్యూటీ కమిషనర్ కురుక్షేత్ర స్వయంగా నిరసన స్థలానికి చేరుకొని రైతు నాయకులతో చర్చించారు. రైతు నాయకులు గురునామ్ సింగ్ చధు, అతని సహచరులను విడుదల చేయాలనీ..పొద్దుతిరుగుడు పువ్వులను ఎంఎస్‌పీపై కొనుగోలు చేయాలని రైతుల ముఖ్యమైన డిమాండ్‌లు వినిపించారు. అనంతరం ప్రభుత్వం తరపున డిప్యూటీ కమిషనర్ హామీ ఇవ్వటంతో రైతులు తమ నిరసనను విరమించారు. భారతీయ కిసాన్ యూనియన్(బీకేయూ) ప్రతినిధి రాకేష్ టికాయత్‌మాట్లాడుతూ.. ఇతర పంటలకు ఎంఎస్‌పీ హామీ కోసం దేశవ్యాప్తంగా గణనీయమైన ఉద్యమం జరగాలన్నారు. దేశంలో ఎంఎస్‌పీ గ్యారెంటీ యాక్ట్ అమలులోకి వచ్చినపుడే అంతిమ విజయమని పంజాబ్ రైతు నాయకుడు సుర్జిత్ సింగ్ ఫూల్ తెలిపారు.

సకల జనుల కష్టాలు పోవాలంటే...

- పరివర్తన చెందిన భారతదేశంలో మాత్రమే సాధ్యం : సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పరివర్తన చెందిన భారతదేశంలో మాత్రమే సకల జనుల కష్టాలు తొలగిపోతాయని బీఆర్‌ఎస్ పార్టీ జాతీయ అధ్యక్షులు, సీఎం కేసీఆర్ తెలిపారు. బుధవారం మహారాష్ట్ర అహ్మద్‌నగర్‌కు చెందిన పలువురు ప్రముఖులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి కేసీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని అభివృద్ధిపథంలో నడిపేందుకు పాలకులకు అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకోవాలనే మనసుండాలని అభిప్రాయపడ్డారు. అలాంటి ఆలోచన ఏడు దశాబ్దాల పాలకులకు లేకపోయిందని విమర్శించారు. అందువల్లే ప్రజలు ఇప్పటికీ కనీస అవసరాలైన నీరు, విద్యుత్ కోసం తపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు, దళిత, ఆదివాసీ, బలహీన వర్గాలు కేంద్రంగా పాలనా ప్రాథమ్యాలను ఖరారు చేసుకోవాలన్నారు. అలా చేసుకున్నందునే తెలంగాణ దేశానికి ఆదర్శంగా మారిందని వివరించారు. మనసుంటే మార్గముంటుందని తొమ్మిదేండ్ల తెలంగాణ నిరూపించిందని కేసీఆర్ స్పష్టం చేశారు. విద్యుత్ వ్యవస్థను గాడిలో పెట్టడానికి సాగునీటి వ్యవస్థను చక్కదిద్దడానికి వ్యవసాయాన్ని పండగలా చేయడానికి రైతాంగంలో భరోసా నింపడానికి తాను ఎట్లాంటి ఆలోచనలు చేసాననే విషయాన్ని ఈ సందర్భంగా మహారాష్ట్ర నేతలకు సిఎం కేసీఆర్ వివరించారు. పార్టీలో చేరిన వారిలో ఎన్సీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఘనశ్యామ్ షెలార్ తదితరులున్నారు. సీఎం కేసీఆర్ విధానాలు దేశమంతా విస్తరించాలని వారు తమ ఆకాంక్షను వ్యక్తం చేశారు. రాబోయే కాలంలో దేశవ్యాప్తంగా రైతులు, మహిళలు, యువత చైతన్యమై కలసికట్టుగా నిలబడి పార్టీలను కాకుండా ప్రజా ఆకాంక్షలను గెలిపించుకునేందుకు కృషి కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, బీఆర్‌ఎస్ మహారాష్ట్ర నేతలు ఖదీర్ మౌలానా హిమాన్షు తివారీ తదితరులు పాల్గొన్నారు.

నాగపూర్‌లో....

బుధవారం నాగ్‌పూర్‌లోని బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్ సమక్షంలో నాగ్‌పూర్ టౌన్ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ ప్రణీత్ మొహద్ బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే బాల్క సుమన్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

డ్రగ్స్ విక్రయిస్తున్న సినీ నిర్మాత కృష్ణ ప్రసాద్ అరెస్ట్



నవతెలంగాణ-రాజేంద్రనగర్

గోవా నుంచి డ్రగ్స్ తీసుకుని వచ్చి, నగరంలో అమ్ముతున్న సినీ నిర్మాత కృష్ణ ప్రసాద్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్టు రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. డీసీపీ జగదీశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా బోనకల్ మండలానికి చెందిన సుంకర కృష్ణ ప్రసాద్ చౌదరి 2016లో కబాలి సినిమాని నిర్మించారు. అదేవిధంగా తెలుగులో సర్దార్, గబ్బర్ సింగ్, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, అర్జున్ సినిమాలకు డిస్ట్రిబ్యూటర్‌గా పని చేశారు. ఆ సినిమాల్లో భారీగా నష్టాలు రావడంతో అతడు గోవాలో ఒక క్లబ్బు స్థాపించాడు. అక్కడ కూడా నష్టాలు రావడంతో తిరిగి హైదరాబాద్‌కు వచ్చాడు. అయితే గోవాలో క్లబ్ నిర్వహించే సమయంలో అక్కడ నైజీరియాలతో పరిచయం ఏర్పడి డ్రగ్స్ తీసుకోవడం అలవాటు చేసుకున్నాడు. అయితే కొంతకాలం నుంచి గోవా నుంచి గుట్టుచప్పుడు కాకుండా డ్రగ్స్ తీసుకొని వచ్చి నగరంలోని ఇతర వ్యక్తులకు అమ్ముతున్నాడు. బుధవారం అత్యంత విశ్వసనీయ సమాచారం ప్రకారం కృష్ణ ప్రసాద్ కిస్మత్పూర్‌లో డ్రగ్స్ విక్రయిస్తుండగా మాదాపూర్, రాజేంద్రనగర్ ఎస్వోటీ పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇతని వద్ద నుంచి 90 ప్యాకెట్లు కలిగిన 82.75 గ్రాముల కొకైన్, నాలుగు సెల్ ఫోన్లు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు.

రైల్వే క్రాసింగ్ గేట్ల వద్ద భద్రత పెంపు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో మానవ సహిత లెవల్ క్రాసింగ్ గేట్ల వద్ద భద్రతను పెంపొందించినట్టు ఆ సంస్థ బుధవారంనాడొక పత్రికా ప్రకటనలో తెలిపింది. ఈనెల 15వ తేదీ 'అంతర్జాతీయ లెవెల్ క్రాసింగ్ అవగాహన దినోత్సవం' నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు రోడ్డు ప్రయాణీకులకు అవగాహన కల్పించడం, రోడ్ అండర్ బ్రిడ్జిలు (ఆర్‌యూబీ), రోడ్ ఓవర్ బ్రిడ్జిలు (ఆర్‌ఓబీ), పరిమిత ఎత్తుగల సబ్‌వేలు (ఎల్‌హెచ్‌ఎస్) నిర్మాణంతో మొత్తం 80 మానవసహిత లెవల్ క్రాసింగ్‌లు మార్పు చేసినట్టు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జోన్ పరిధిలో మనుషులతో కూడిన లెవల్ క్రాసింగ్‌లను తొలగించడానికి కృషి చేస్తున్నామన్నారు. అంతర్జాతీయ రైల్వేల యూనియన్ నిర్ణయానికి అనుగుణంగా ఈనెల 15న లెవల్ క్రాసింగ్ అవగాహన దినం నిర్వహిస్తూ రోడ్డు వినియోగదారులను చైతన్యవంతం చేసే కార్యక్రమాలు చేపడుతున్నా మన్నారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు.

నేడు రవీంద్రభారతిలో పల్లెప్రగతి ఉత్సవాలు


- సర్పంచులు, ఎంపీపీలకు సన్మానం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం నాడు రాష్ట్ర వ్యాప్తంగా పల్లెప్రగతి దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. అందులో భాగంగానే పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో ఉత్సవాలు జరుగనున్నాయి. అందులో ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డులు పొందిన సర్పంచులను, ఉత్తమ మండలాల అవార్డులు పొందిన ఎంపీపీలను ఆ శాఖ ఆధ్వర్యంలో సన్మానించనున్నారు. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ప్రతి గ్రామంలో పారిశుధ్యం, పచ్చదనం కార్యక్రమాల ద్వారా జరిగిన ప్రగతిని అధికారులు వివరించనున్నారు. ప్రతి పల్లెలో జరిగిన అభివృద్ధిని అధికారులు నివేదికల రూపంలో తెలియచేస్తారు. ఈ మేరకు బుధవారం సమాచార, పౌర సంబంధాల శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది.

అమిత్‌షా ఖమ్మం బహిరంగ సభ వాయిదా

- గుజరాత్, మహారాష్ట్రలో భారీ వర్షాల వల్లనే : బండి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గుజరాత్, మహారాష్ట్రలో భారీ ఎత్తున వర్షాలు కురుస్తుండటంతో ఖమ్మంలో జరగాల్సిన అమిత్‌షా బహిరంగ సభను వాయిదా వేస్తున్నట్టు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్ ప్రకటించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా 24 గంటలపాటు పర్యవేక్షించాల్సిన అవసరం ఉన్నందున అనివార్య కారణాలవల్ల బహిరంగ సభకు రాలేకపోతున్నానని చెప్పడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్‌లలో ఇప్పటికే రైళ్లను రద్దు చేశారనీ, ఎన్డీఆర్‌ఎఫ్ దళాలను ఇప్పటికే తుఫాన్ బాధిత ప్రాంతాలకు పంపారని తెలిపారు. దాదాపు 50 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారని చెప్పారు. ఈ విపత్కర సమయంలో బహిరంగ సభ నిర్వహించడం సముచితం కాదనే నిర్ణయానికి వచ్చామని తెలిపారు. వాస్తవానికి బహిరంగ సభ కోసం అన్ని ఏర్పాట్లు చేశామనీ, పార్టీ సీనియర్ నేతలంతా అక్కడే మకాం వేసి పనిచేశారని చెప్పారు. వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అతి త్వరలోనే ఖమ్మంలో బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. 25న నడ్డా బహిరంగ సభ నాగర్‌కర్నూల్‌లో జరుగుతుందన్నారు.